ఏప్రిల్ 16-30, 2021
సంపుటి 01, సంచిక 13
*Complimentary Copy - 13*

తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక





*Printed, Published and Owned by :* ***KALVAKUNTLA KAVITHA***
Printed at : **HARSHITHA PRINTERS**, Khairatabad, Hyderabad - 500 004.
Published at : **TELANGANA JAGRUTHI,** Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State.
Editor : **KALVAKUNTLA KAVITHA**

# విషయ సూచిక




08

శ్రీరంగ మాహాత్మ్యంలో అనితర ప్రాసాద మాధుర్యం వ్యక్తం చేసిన **భైరవ కవి... నాటి కవిత**



27

సాహిత్య యాత్రలోని ఒడిదుడుకులు తట్టుకొని **కేంద్ర సాహిత్య అవార్డ్‌ని సాధించిన కవి నిఖిలేశ్వర్**తో **బాణాల శ్రీనివాస్** ముఖాముఖి.



05

ఆనాడు తెలంగాణ గ్రామాలలో భూస్వామ్యం చేసే దౌర్జన్యాలను వివరించే నాటికథ **వట్టికోట ఆళ్వారుస్వామి... పరిగె**



21

భండారు అచ్చమాంబలోని సంస్కరణా దృక్పథాన్ని కథల్లో ప్రతిఫలించిన తీరు వివరించిన డా॥ వి. త్రివేణి వ్యాసం... **భండారు అచ్చమాంబ స్త్రీ సంస్కరణ**



09

**షోర్ అండ్ వేవ్** నవలలో నాటి సంప్రదాయాల వైనం తెలుపుతున్న **సంగిశెట్టి** విశ్లేషణ



31

**పుస్తకాలే జీవిత సర్వస్వంగా బతికిన కపిలవాయి**ని ఆవిష్కరించిన **ఆమ్ గోత్. వెంకట్ పవార్** వ్యాసం



13

విజ్ఞాన ప్రగతి క్షణభంగురమే అని తెలియజేసిన వేణు నక్షత్రం కథ... **మన నరకమే మనకు స్వర్గం**

**వరూధిని**పై జాలిపడ్డ కవిహృదయం **అనంత పద్మనాభారావు** వరూధిని పద్యాలలో...



12

వ్యవస్థల పతనాలను వివరించే కథ **రామచంద్ర మౌళి... దీన్ని ఇకనైనా ఆపండి...35** పేజీలో

స్వాతంత్ర్యానంతరం పరిమళించిన తెలుగు కవిత్వం వివరించే **ఎస్.వి. సత్యనారాయణ** వ్యాసం... **అభ్యుదయ సాహిత్యంలో స్త్రీల కవిత్వం...39** పేజీలో

**అంపశయ్య నవీన్** కథలను విశ్లేషించిన **వరిగొండ** సమీక్షా వ్యాసం... **యానాంలో ఒకరోజు... 43** పేజీలో

చీర గురించి **నాంపల్లి సుజాత** తాత్విక పరివేదన **"చీర గురించి"** కవితలో **...47** పేజీలో

**దండోరా జెండా**కు జేజేలని పలికిన **జూపాక సుభద్ర** కవిత **...19** పేజీలో

**వేమన గ్రంథాలయ** దర్శనోత్సవాన్ని తెలిపే **వనపట్ల** కవిత **...20** పేజీలో

**మడిపల్లి రాజకుమార్** రూపొందించిన **తెలంగాణ గజల్ ...47** పేజీలో


ఇంకా సభలు సమావేశాలు, పుస్తక సమీక్ష, సాహిత్య శిఖరం, స్వీకారం, మరెన్నో...

# తంగేడు సంచికకు స్పందన...

పేపర్ క్వాలిటీ
చూస్తే ఆంగ్ల పత్రికలను
గుర్తుకు తెస్తున్నారు... మీ
తంగేడు చూస్తే...
**- జింబో**
రచయిత

పత్రికలో
గుణాత్మకమైన మార్పు
వచ్చింది. అభినందనలు
**- మౌని శ్రీనివాస్**
కథా రచయిత

మీ విషయ
సూచిక కొండను అద్దంలో
చూపినట్టు బాగుంది.
**- అనుమాండ్ల భూమయ్య**
రచయిత

మీ పత్రిక
చూడగానే ఆకర్షించింది.
చదివితే మరింత బాగుంది.
**- జగన్**
మన తెలంగాణ

పత్రికలోని
సంపాదకీయం నుండి
స్వీకారం వరకు అన్ని మాకు బాగా
నచ్చుతున్నాయి. సంగిశెట్టి,
కాంచనపల్లిల విశ్లేషణలు
బాగున్నాయి.
**- సంకేపల్లి నాగేంద్రశర్మ**
చరిత్ర పరిశోధకులు

తంగేడు పత్రిక
చాలా బాగా వస్తోంది.
అడుగడుగున మీ కృషి
కనిపిస్తోంది.
**- సుద్దాల అశోక్ తేజ**
సినీ కవి

మీ పత్రికలో
సాంకేతికాంశాలు
సాహిత్యాంశాలు పోటీ
పడుతున్నాయి.
**- డా॥ నాళేశ్వరం**
కవి

తంగేడు
ఒక చక్కని పత్రిక.
కలకాలం నిలవాలి.
**- మన్మోహన్ రావు**
సాహిత్యాభిమాని

తంగేడు పత్రిక
తొలిరోజులతో పోలిస్తే
చాలా ఇంప్రూవ్ అయింది.
**- మామిడి హరికృష్ణ**
కల్చరల్ డైరెక్టర్

పత్రిక
తీయడంలో జాగ్రత్తగా
ఉంటున్నారు. సాంప్రదాయిక
వ్యాసాలు వేసేటప్పుడు డిటిపి
జాగ్రత్తగా చేయించండి.
**- సంగనభట్ల నర్సయ్య**
చరిత్ర పరిశోధకుడు




## 'తంగేడు' సంచిక వార్షిక చందా వివరాలు

'తంగేడు' పక్ష పత్రికను ఆదరిస్తున్న పాఠకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు. తంగేడు పత్రిక ప్రతి సంచికను పొందేందుకు గాను, వార్షిక చందాదారులుగా చేరండి. ఇందుకోసం రూ.50 చెల్లించి, 24 సంచికలను పొందండి. చందాదారులుగా చేరేందుకు **http://www.thangedu.co.in** వెబ్‌సైట్‌లో పేరు నమోదు చేసుకొని, ఆన్ లైన్ లో నగదు చెల్లించేందుకు వీలు కల్పించడం జరిగింది. డెబిట్/క్రెడిట్ కార్డులు, నెట్ బ్యాంకింగ్, UPI ద్వారా నిర్ణీత నగదు చెల్లించగలరు. చెక్కుల ద్వారా కూడా వార్షిక చందాదారులుగా చేరవచ్చు.

**వార్షిక చందా చెక్కులను పంపవలసిన చిరునామా:**

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం.1-2-234/13/46/4,
3వ అంతస్తు, ఎన్.టి.ఆర్ స్టేడియం దగ్గర, అరవింద్ నగర్,
దోమలగూడ, హైదరాబాద్ - 500 029.

సంపాదకీయం


తంగేడు

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

16-30 ఏప్రిల్, 2021

సంపుటి 01 సంచిక 13





శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్





డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614


# తప్పులెన్ను వారు....

సాహిత్యంలో పండితులకు దోషాలపై అసహనం ఉంటుందనే ప్రతీతి ఉంది. సాహిత్య ధిషణ ఉన్న కొందరు ఇతరుల రచనలో తప్పులు వెతుకుతారు. తద్వారా తమ ఆధిక్యతను చాటుకొని తృప్తి పడతారు. నన్నయ మొదలు శ్రీశ్రీ వరకు వెతికితే భాషా నిర్మాణంలో దోషాలు కనిపించిన విషయం తెలిసిందే, అంత మాత్రాన వాళ్ళ స్థానాన్ని ఎవరైనా శంకించగలరా? వాళ్ళ సృజన లోతుల్ని ఎవరైనా కొట్టివేయగలరా?

అయితే మహాపాండిత్యం కలిగినవాళ్ళు అట్లా రంధ్రాన్వేషణ చేస్తే, 'సరేలే లోపాలు దిద్దుతారు' అని సరిపెట్టుకోవచ్చు. కాని మిడి మిడిజ్ఞానులు కూడా ఎదుగుతున్న సృజన మీద తన విమర్శనాస్త్రాలు సంధిస్తే ఎంతో హాస్యాస్పదంగా, పేలవంగా ఉంటుంది. Never judge of art by its defects అనేది ఆర్య వాక్యం. ఒక కళను దాని లోపాలతో తూచడం పెద్దరికం అనిపించుకోదు. "మరకలను కాదు, మెరుపులను చూడాల"నే సినారె మాట అందరికీ శిరోధార్యం.

ఎదుగుతున్న సాహితీవేత్తలు కూడా ఇలాంటి కువిమర్శలకు బెదరి పోకూడదు. వాటిని తాటాకు చప్పుళ్ళు గానే భావించాలి. తమ సాధనను కొనసాగించాలి. ఎవరైనా సహృదయం తో ఇచ్చే సూచనలను సౌమనస్యంతో స్వీకరించాలి. అది కువిమర్శే అయితే నిర్ద్వంద్వంగా తిరస్కరించాలి.

కొంత మంది తొలిరాతల్ని చూస్తే మిగుల నిరాశ కలుగుతుంది. వీళ్ళు సాహిత్య రంగంలో నిలబడలేరు అనుకుంటాం. కాని సాధన తరువాత ఎదిగిన క్రమంలో వాళ్ళ రచనలలో గొప్ప కళా ఖండాలు కనబడతాయి. తమ పైన వచ్చే ఎంత వ్యతిరేకతను అవహేళనలను ఎదుర్కొంటేనే వాళ్ళే స్థానం సాధించారో ఊహిస్తే కళ్ళు చమరిస్తాయి.

సృజనకు వయసుతో పనిలేదు. చిన్నారి పొన్నారి చిరుత కూకటి నుండే కవులుగా ప్రవర్ధిల్ల వలసిన అవసరం లేదు. వాల్మీకి. కాళిదాసు, షేక్సిపియర్, రవీంద్రనాథ్ ఠాగూర్, వంటి మహాకవులు తమ బాల్యం నుండే కవితాభ్యాసం చేసిన వాళ్ళు కాదు. అయినా వాళ్ళు ఇప్పుడేస్థానంలో ఉన్నారో వేరే చెప్పవలసిన పనిలేదు. కాబట్టి సృజనకు వయసుతో నిమిత్తం లేదు. "నేను ఎప్పటినుండో రాస్తుండవలసింది" అని, ఈ వయసులో ఏం మొదలు పెడతాం? అని నిరాశ పడవలసిన అవసరం లేదు.

సోక్రటీస్ మరణం ముందు కూడా కొత్త సంగీత పరికరం దొరికితే సాధన చేశాడట. మరణ శిక్ష అమలు కాబోయే ముందు "ఎంత సమయం దొరికితే అంత సాధన చేస్తాను" అన్నాడట. కాబట్టి సృజనోత్సాహం ఉన్న వాళ్ళు అప్రయోజకులైన విమర్శకులను పట్టించుకోవలసిన ఆగత్యం లేదు. నిర్మాణాత్మకమైన సూచనలను ఇచ్చే వారిని గౌరవించకుండా ఉండవలసిన అవసరమూ లేదు. ఒక్క సృజన రంగంలోనే కాదు, కోడిగుడ్డుపై ఈకలు పీకే పెద్దవాళ్ళు మనకు చాలా చోట్ల తారసపడతారు. వాళ్లకు ఓ నమస్కారం చేసి మన పని మనం చేసుకుపోవలసిందే.

సృజనాత్మకతకు మరింత మేలిమి ప్రోది చేసుకోవలసిందే.

జై తెలంగాణ, జై జాగృతి.

సాహితీ శిఖరం



## జ్ఞానపీఠ పురస్కార గ్రహీత

# శ్రీలాల్ శుక్లా

ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రఖ్యాత రచయిత శ్రీలాల్ శుక్లా 2009లో జ్ఞాన్ పీఠ్ పురస్కారాన్ని అందుకున్నారు. శ్రీలాల్ శుక్లా, స్వాతంత్ర్య అనంతరం భారత సమాజంలో నైతిక విలువలకు సంబంధించిన కథాంశాలను నవలలుగా మలిచారు. తన రచనల్లో గ్రామీణ, పట్టణ జీవితాల్లోని లోటుపాట్లను వ్యంగ్యంగా ఎత్తిచూపారు. శ్రీలాల్ శుక్లా రచించిన రాగ్ దర్బారీ నవల, పాఠకులను అమితంగా ఆకట్టుకోవడంతో పాటు, ఆంగ్లం, తెలుగు భాషలతో సహా 15 భారతీయ భాషల్లోకి అనువాదమైంది.

## నోబెల్ సాహిత్య బహుమతి గ్రహీత

# మారియో వర్గాస్ లోసా

పెరూ దేశానికి చెందిన రచయిత మారియో వర్గాస్ లోసా 2009లో సాహిత్య విభాగంలో నోబెల్ బహుమతి అందుకున్నారు. మారియో వర్గాస్ లోసా తన రచనల్లో ఎక్కువగా అధికారం మరియు పెట్టుబడిదారీ విధానంపై విమర్శలకు ప్రాధాన్యం ఇచ్చేవారు. తన మొదటి పుస్తకం "ది టైమ్ ఆఫ్ ది హీరో"తో వర్గాస్ లోసా గొప్ప ప్రశంసలు అందుకున్నారు. వర్గాస్ లోసా రాజకీయాల్లో పాలుపంచుకుంటూనే రచనలు కొనసాగించారు. "ది గ్రీన్ హౌస్," "ది వార్ ఆఫ్ ది ఎండ్ ఆఫ్ ది వరల్డ్", "కెప్టెన్ పాంటోజా అండ్ సీక్రెట్ సర్వీస్" వంటివి మారియో వర్గాస్ లోసా ప్రముఖ రచనలు.



# పరిగె

1952లో వచ్చిన ఈ కథ నాటి తెలంగాణ
ఆధో వర్గాల దైన్యానికి ఒక ప్రతిఫలనం...



**వట్టికోట ఆళ్వారు స్వామి**
(1915 - 1961)

సాయంత్రము 7 గంటల సమయము, ఖైదీలను గదుల్లో పెట్టి తాళము వేసి వరండాలో జవానులు మాటా, మంతీ సాగించారు. తాము ఉద్యోగము చేసిన వివిధ జైళ్ళలో చేసిన దౌర్జన్యాలను ఘనకార్యాలుగా, ఖైదీలు చేసే సాహసచర్యలు, వాని నణచుటకై అవలంభించే వివిధ పద్ధతులను తమ అమూల్య అనుభవాలుగా చెప్పుకుంటున్నారు జవానులు.

ఖైదీల గది నుండి ఒక ఖైదీ ఏడ్పు వినబడింది. ఎంత సేపటి నుండో ఉప్పొంగి వస్తున్న దుఃఖాన్ని ఆపుకుంటున్నప్పటికి, హద్దు దాటి విధి లేక పెద్దగా ఏడ్వాల్సి వచ్చింది. అయినప్పటికి "ఇది జైలు, ఏడ్వటానికి కూడా స్వాతంత్ర్యము లేదు ఎదురుగా వరండాలోనున్న జవానులు ఏమంటారో" అనే భయము కూడా ఆ ఏడ్పులో ధ్వనిస్తున్నది.

ఆ గదిలో తమ తమ స్థలాల్లో కూర్చొని, తమ బయటి ప్రపంచాన్ని తలచుకుంటున్న యితర ఖైదీలు ఏడుస్తున్న ఖైదీ - మల్లయ్య వైపు సానుభూతితో, ఆశ్చర్యముతో దృష్టి మరల్చారు.

జవానులు "ఏమిటోయ్! అల్లరి" అని తమ కర్తవ్యాన్ని లాంఛనంగా అమల్లో పెట్టి, ఆ ఖైదీ దుఃఖాన్ని సామాన్య విషయంగా, అట్టివెన్నో తమ అనుభవానికి వచ్చినట్లు నిర్లక్ష్యంగా, తిరిగి మాటా మంతీ సాగించారు. "ఈ ఖైదీలు కూర్చొని మాట్లాడటానికి కూడా అవకాశమివ్వరు" అని ఒక జవాను విసిగాడు.

ఖైదీలు వారే కుటుంబానికి, మతానికి,కులానికి, గ్రామానికి సంబంధించిన వారైనా వారంతా ఖైదీలు. నేటి ఒకే విష సమాజ వృక్షానికి కాసిన కుక్కమూతి పిందెలు.

మల్లయ్య ఖైదీ వద్ద ఇతర ఖైదీలు మూగారు. మల్లయ్య ఏడ్పు కొద్దిగా తగ్గింది. కాని చుట్టు ఖైదీలంతా ఆప్తులుగా చేరేవరకు తిరిగి దుఃఖము పొంగి వచ్చింది. ఎక్కి ఎక్కి ఏడ్వసాగాడు.

> **"ముసలితొక్కు ఆరునెలలైంది మంచాన్నిబట్టి. చావక, బ్రతక్క ఉన్నాడు. బ్రతికే ఆశలేదు. కాని ఆ రోజే చస్తాడని అనుకోవడానికి వీండ్లేం బ్రహ్మకొడుకులా? ఒళ్ళొంగక ఏదో వగలు" సేతుసింధీ పోలీసు పటేలుకు జవాబు చెప్పాడు. ఇంట్లో తండ్రి - ఇవన్ని తన జీవిత అనుభవాలే అన్నట్లు నిర్లక్ష్యంగా పడి ఉన్నాడు పరధ్యానంలో స్మృతి తప్పి. తుదకు చెల్లెలును బలవంతము చేసి ప్రక్కగ్రామానికి వంతుకు పంపారు.**

"ఏమి జ్ఞాపకమొచ్చిందో" ఒక ఖైదీ సానుభూతిగా అన్నాడు.

"జైలుకు వచ్చి ఏడిస్తే ఏమి లాభం? మొదటనే హుషారుగా ఉండాలే." ఒకడు ధర్మపన్నాలు పలికాడు.

మూడు నెలలకే ఇంత బుగులు పడతారోయ్! నా సగం వయసు జైల్లో గడిచింది. ఇంకా జైల్లోనే ఉన్నాను నేను. ఇంకా ఎన్నిసార్లు రావలసి ఉందో" ఒక జైలు పిట్ట పలికింది.

"ఎందుకేడుస్తున్నావు మల్లన్నా" చాలా దీనంగా ఒక ఖైదీ పరామర్శ చేశాడు.

తన తండ్రి మంచములో పడి మూల్గుతుండగా ఎక్కిఎక్కి ఏడుస్తున్న తనను తన తండ్రి పరామర్శ చేసిన దృశ్యం మల్లయ్య కండ్లల్లో ఆడింది.

మల్లయ్య ఖానాపురం వంతుమాదిగ. తల్లి చిన్నప్పుడే ప్రసూతి రోగంతో మరణించింది. పొట్టకు చాలని కష్టంతో జీవితమెల్ల కండలు కరిగించి చావుకు కాళ్ళు చాపి మంచములో పడి ఉన్న ముసలి తండ్రి. తల్లి చస్తూ వదలిపోయిన ఆడ పసికూనను ప్రేమతో పెంచి పెద్ద చేసిన చెల్లెలు - యిదే అతని కుటుంబము. తండ్రి ముసలివాడైనందున గ్రామ బేగారి పని మల్లయ్య మెడబడ్డది.

నాటి కథ

తండ్రి మంచము పట్టాడు. పది. పన్నెండేండ్ల చెల్లెలు పెండ్లి భారం. మంచం పట్టిన తండ్రి చికిత్స - ముఖ్యంగా కుటుంబ పోషణ భారం మల్లయ్యపై బడ్డది. బేగారి చేసిన తర్వాత దొరికే కొద్ది సమయములో ఇతర కూలి పని చేసుకోవడం కూడా ఒక్కొక్కప్పుడు సాధ్యం కాకపోయేది. మల్లయ్య ఒక్కొక్కప్పుడు ప్రభుత్వాధికారుల బరువులకు పోవడం చెల్లెలు గ్రామ బేగారి పని చేస్తే, తండ్రిని చూసుకోవడం జరుగుతుండేది. ఒక్కొక్కసారి బేగారి చేసిన తర్వాత వేరే కూలి లేక దినమంతా పొట్ట మాడ్చుకునే ఉండాల్సి వచ్చేది. తంటాలుపడి తండ్రికి మాత్రం పేరుకు నోరు తడిపేవాడు. మల్లయ్య ఒకనాడు బరువుకు పోయి సాయంత్రము ఇంటికి చేరుకున్నాడు. తండ్రి ఆరోగ్యము మరీ చెడిపోయింది. ప్రమాదస్థితిలో నున్నాడు. చెల్లెలు ఏడుస్తూ కూర్చున్నది. ఒక వైపు కడుపు మాడ్తున్నది. రెండోవైపు తండ్రి దూరమయ్యేస్థితి వచ్చింది. వస్తున్న దుఃఖాన్ని మల్లయ్య ఆపుకొని చెల్లెలును సముదాయించి, ఆ రాత్రికై ఏ విధంగానైనా ఇంత ఆదరవు సంపాదించడానికి ఇల్లు వదలి బయలుదేరాడు.

ఆలోచిస్తూ మల్లయ్య గ్రామం వెలుపలికి పోయాడు. పొలాల్లో కుప్పలు పేరుస్తున్నారు. మెల్లగా ఒక కళ్ళం వద్దకి చేరాడు.

ఆ రోజంతా పొలాలలో పనిచేసిన కూలీలు తమ కూలి తక్కువ దొరికినందుకు భూస్వామితో బేరాలు చేస్తున్నారు. భూస్వామి లోభత్వానికి విసిగి, బిచ్చము గింజలకై ప్రాధేయపడుతున్నారు. భూస్వామి ఎంగిలి మెతుకులు దులిపినట్లు ఇన్ని గింజలు కూలి వాండ్ల ఒళ్ళో చల్లాడు. ఆ దృశ్యమంతా చూస్తున్న మల్లయ్య నిరాశ చెందాడు. కష్టపడిన వాండ్లకే కూలి సరిగా యివ్వక బిచ్చము గింజలు కూడా ఏడుస్తూ పెడ్తున్నప్పుడు తన కొక గింజకూడా ఆశలేదని నిరాశతో కొయ్యకాలు పొలాలవైపు వెళ్ళాడు.

పనులు ముగించుకొని భూస్వాములు, జీతగాండ్లు కూలీలు గ్రామం ముఖం పట్టారు.

ముసి, ముసి చీకట్లో ఒక్కొక్క పరిగెకర్రను పోగుచేసుకొని కట్టగా కట్టి ఆనాటి రాత్రికి ఆదారము దొరికనందున తన ప్రయోజకత్వానికి గర్విస్తూ వీరునిగా ఉత్సాహంగా ఇంటిదోవ పట్టాడు. తండ్రిని తలచుకొని, ఏర్పడిన ఆపద జ్ఞాపకము రాగానే ఉత్సాహానికి, గర్వానికి చెంప పెట్టయి కుంగిపోయాడు.

మార్గ మధ్యమున అక్కడక్కడ చిన్న చిన్న గుట్టలుగా పేర్చి ఉన్న వరి కుప్పలను, తన చంకలోని పరిగెకట్టను పోల్చుకున్నాడు. ఈర్ష్య పడ్డాడు.

"అవి ఎంత పెద్దగా నున్నప్పటికి ఈ కట్టకిందికి రావు. పనికిరావు. కుప్పలు కుక్క గొడుగులు అనుకుంటు ముందుకు సాగాడు.

"ఎవరోయ్, అటుపోయేది" ఒక కుప్ప వద్ద నుండి ధ్వని వచ్చింది.

మల్లయ్య నిలబడ్డాడు. నలువైపుల పరికించాడు.

ఒక ఆజానుబాహుడు మెడ మీద అడ్డంగా చేతికర్రను ఆనించుకొని కర్ర రెండు చివరలు పట్టుకొని మల్లయ్యవైపు వస్తున్నాడు.

"ఎవడ్రా నీవు? ఎక్కడ నుంచి తెస్తున్నావు ఆ కట్టను?"

"పొలాల్లో పరిగెను కట్ట కట్టాను"



> **ఇంతలో వెనుకనుండి పరుగెత్తి వస్తున్న వ్యక్తి అమాంతంగా మల్లయ్య వీపు పై బలంగా చేతికర్రతో దెబ్బ వేశాడు. చస్తిన"ని మల్లయ్య, అతని చెల్లెలు కిందపడిపోయారు. ఒకరిపై ఒకరు పడి ఏడుస్తున్నారు. మల్లయ్య వెంబడించిన ఆ వ్యక్తి పోలీసు పటేలు ముందు ఆ పరిగెకట్టను పెట్టి అది తన వరికుప్ప నుండి మల్లయ్య దొంగిలించాడని ఫిర్యాదు చేశాడు. పడి ఏడుస్తున్న మల్లయ్యను చెల్లెలు నుండి వేరు చేసి చావిడి స్తంభానికి కట్టారు. 'సేతుసింధీలు. చెల్లెలును బలవంతంగా వంతుకు పొమ్మని తిరిగి పోలీసు పటేలు బలవంత పెట్టసాగాడు.**

నాటి కథ

మల్లయ్య తన నిర్దోషిత్వాన్ని గట్టిగా ఎరుకపరిచాడు.

"ఓహో! నీవు వస్తావని పరిగె కట్టి పెట్టామోయ్. ఈ కుప్పలన్ని పరిగెకట్టి పేర్చినవే. ఏమి వగలమారి మొగాడివిరా?"

"పరిగె ఏరుకోవడం తప్పేనా?" తనకు కలిగిన అన్యాయముపై, ఆ వ్యక్తి యొక్క అంతులేని స్వార్థముపై ఆశ్చర్యమును కనబరచు ధ్వనితో మల్లయ్య అన్నాడు.

"ఇంకా నీల్గుతున్నావు? పెట్టు అక్కడ ఆ కట్టను" కర్ర లేపాడు.

మల్లయ్య ఇక లాభం లేదని గ్రహించి, దీనంగా తన దీనస్థితిని తండ్రి గతిని తెలిపాడు, బ్రతిమిలాడాడు.

మల్లయ్య బ్రతిమిలాడడంతో, తప్పకుండా ఆ కట్ట దొంగిలింపబడినదనే గట్టి నమ్మకం ఆ వ్యక్తికి కలిగి "ఎవడికి పుట్టావురా??" అని ఇంకా రౌద్రముతో కర్ర లేపి కొట్టబోయాడు.

ఇక నిలబడితే లాభము లేదని పరిగెకట్టెను చంకలో గట్టిగా పట్టుకొని కాలికి బుద్ధి చెప్పాడు. ముందు మల్లయ్య వెనుక ఆ వ్యక్తి, గ్రామం ముఖం పట్టారు.

మల్లయ్య తండ్రిని చేరుకోవాలె. పరిగెకట్టను ఎలాగైనా రక్షించుకోవాలె. చెల్లెలుకు, తండ్రికి రాత్రికి ఇన్ని మెతుకులు పెట్టాలె అనే నిశ్చితాభిప్రాయమునకు తన బలాన్ని చేయూత నిచ్చి, సర్వశక్తులనుపయోగించి వడిగా పరుగెత్తుతున్నాడు.

గ్రామములో మార్గమధ్యముననున్న చావిడి వద్దకు తుడుచుకుంటూ ఒక గోడ ప్రక్కన నిలబడి ఉంది చెల్లెలు. పోలీసు పటేలు బండ బూతులు తిడ్తున్నాడు.

సాయంత్రం మల్లయ్య పొలాల వైపు వెళ్ళిన తర్వాత మల్లయ్య కొరకు పోలీసు పటేలు కబురంపాడు. ప్రక్క గ్రామం అత్యవసర పనిమీద వంతుపోవలసి వుంది. ఇంట్లో మల్లయ్య లేనందున తండ్రి ప్రమాదస్థితి పై ఏడుస్తు కూర్చున్న చెల్లెలును సేతుసింధీ తీసుకెళ్ళాడు. చెల్లెలును వంతుకుపొమ్మని ఒత్తిడి చేస్తున్నాడు. చెల్లెలు ఏడుస్తూ తన తండ్రి అవస్థ పోలీసు పటేలుకు తెలుపుతూ

**మల్లయ్య ఖానాపురం వంతుమాదిగ. తల్లి చిన్నప్పుడే ప్రసూతి రోగంతో మరణించింది. పొట్టకు చాలని కష్టంతో జీవితమెల్ల కండలు కరిగించి చావుకు కాళ్ళు చాపి మంచములో పడి ఉన్న ముసలి తండ్రి. తల్లి చస్తూ వదలిపోయిన ఆడ పసికూనను ప్రేమతో పెంచి పెద్ద చేసిన చెల్లెలు - యిదే అతని కుటుంబము. తండ్రి ముసలివాడైనందున గ్రామ బేగారి పని మల్లయ్య మెడబడ్డది. తండ్రి మంచము పట్టాడు. పది. పన్నెండేండ్ల చెల్లెలు పెండ్లి భారం.**

ఉంది.

ఇంతలో అన్న మల్లయ్య పరుగెత్తుకు రావడం తనను "పోలీసు పటేలు ఎర నుండి రక్షించడానికని భావించింది.

"కాని ఇద్దరూ వలలో చిక్కారు. మల్లయ్యను చూడగానే బావురుమని ఏడుస్తూ మల్లయ్య పంచ చేరింది.

ఇంతలో వెనుకనుండి పరుగెత్తి వస్తున్న వ్యక్తి అమాంతంగా మల్లయ్య వీపు పై బలంగా చేతికర్రతో దెబ్బ వేశాడు. చస్తినా"ని మల్లయ్య, అతని చెల్లెలు కిందపడిపోయారు. ఒకరిపై ఒకరు పడి ఏడుస్తున్నారు. మల్లయ్య వెంబడించిన ఆ వ్యక్తి పోలీసు పటేలు ముందు ఆ పరిగెకట్టను పెట్టి అది తన వరికుప్ప నుండి మల్లయ్య దొంగిలించాడని ఫిర్యాదు చేశాడు.

పడి ఏడుస్తున్న మల్లయ్యను చెల్లెలు నుండి వేరు చేసి చావిడి స్తంభానికి కట్టారు. సేతుసింధీలు. చెల్లెలును బలవంతంగా వంతుకు పొమ్మని తిరిగి పోలీసు పటేలు బలవంత పెట్టసాగాడు.

"దీని తండ్రికి ఎట్లా ఉందోయ్" క్రూర పాలకయంత్రములో భాగమై మానవత్వాన్ని చంపుకొని చండపాలన చేస్తున్న ఆ పోలీసు పటేలు నోటి నుండి మానవత్వాన్ని జ్ఞప్తికి తెచ్చు ఒక వాక్యము వెళ్ళింది.

"ముసలితొక్కు ఆరునెలలైంది మంచాన్నిబట్టి. చావక, బ్రతక్క ఉన్నాడు. బ్రతికే ఆశలేదు. కాని ఆ రోజే చస్తాడని అనుకోవడానికి వీండ్లేం బ్రహ్మకొడుకులా? ఒళ్ళొంగక ఏదో వగలు" సేతుసింధీ పోలీసు పటేలుకు జవాబు చెప్పాడు.

ఇంట్లో తండ్రి - ఇవన్ని తన జీవిత అనుభవాలే అన్నట్లు నిర్లక్ష్యంగా పడి ఉన్నాడు పరధ్యానంలో స్మృతి తప్పి.

తుదకు చెల్లెలును బలవంతము చేసి ప్రక్క గ్రామానికి వంతుకు పంపారు. ఝామురాత్రి వేళ బిక్కురు, బిక్కురు మనుకుంటూ దిక్కులు చూస్తూ చెల్లెలు వంతుకు బయలుదేరింది.

తండ్రికి అండగా వున్న చెల్లెలు దూరమైంది. మల్లయ్య నిర్బంధంలో ఉన్నాడు. తండ్రిని కండ్ల చూస్తానో లేదో అని బాధపడ్తున్నాడు మల్లయ్య.

తెల్లవారి మల్లయ్యను పోలీస్ స్టేషన్‌కు పంపాడు పోలీసు పటేలు. దొంగ నేరము క్రింద మల్లయ్యకు మూడు నెలలు శిక్షైంది.

తండ్రి, చెల్లెలు సంగతి ఏమైందో తెలియదు.

ఒకనాడు జైలు పనిమీద మల్లయ్య బజారుకు పోయాడు. అంగడిలో ఒక పరిచయస్తుడు కనబడ్డాడు. జవానును బ్రతిమిలాడి అతన్ని కలిసికొని మాట్లాడితే తండ్రి మరణించాడనీ, చెల్లెలు ఊరు విడిచి ఎక్కడికో వెళ్ళిపోయిందని, ఇల్లు పాడుపడిందని తెలిసింది.

ఉబికి వస్తున్న పట్టరాని దుఃఖాన్ని బహు కష్టంగా ఆపుకున్నాడు. పెద్దగా ఏడిస్తే పదిమంది కూడ్తారు. దయతలచి మాట్లాడే అవకాశమిచ్చిన జవానుకు మాట వస్తుంది.

లోపల, లోపల కుమిలిపోతున్నాడు. అన్నం తిని గదిలోకి చేరిన తర్వాత ఇక ఏడ్వవచ్చునుకున్నాడు. సర్వ స్వతంత్రుడనని భ్రమపడి పెద్దగా ఏడ్చాడు.

"మా చెల్లెలు ఏమైందో."

తపిస్తున్నాడు. హృదయంలో.

# శ్రీరంగ మాహాత్మ్యం

## భైరవ కవి - శ్రీరంగ మాహాత్మ్యం



భైరవ కవి ప్రసిద్ధకవి గౌరన కుమారుడు. నూతనకవి సూరనకు సమకాలికుడు. కవిగజాంకశం అనే ఛందశ్శాస్త్ర గ్రంథం రాశాడు. రుతుపరీక్ష పేరుతో నవరత్నాలను గురించి వాటిలో ఉత్తమత్వాలను గురించి రాశాడు. ఇది ఒకవిధంగా శాస్త్ర గ్రంథము. ఛందశ్శాస్త్రము కూడా శాస్త్ర గ్రంథము. ఇవి కాక శ్రీరంగమాహాత్మ్యము అనే పేరుతో శ్రీరంగ క్షేత్రము వెలసిన కథను గరుడ పురాణం నుండి తీసుకొని కావ్యంగా రాశాడు. చిత్రకవిత్వము కూడా ప్రవేశపెట్టినాడు. చక్రబంధం, నాగబంధం వంటి బంధ కవిత్వాలను రాశాడు. లఘువులలో వచనం రాశాడు. భైరవ కవి ప్రయోగదక్షుడుగా కనపడుతున్నాడు.

హరిదివ్యనామధేయామృతంబింపార
జెలగి యాస్వాదించు జిహ్వజిహ్వ
గోవింద కల్యాణగుణ విశేషంబులు
పలుమారు తలపోయు తలపు తలపు
కమలాక్షు నిత్యమంగళమూర్తి విభవంబు
సొంపారవీక్షించు చూపు చూపు
ఫణిరాజతల్ప శ్రీపాదపద్మంబులు
చేరి యర్చనసేయు సేత సేత
వాసుదేవ ప్రియంబైన వ్రతము వ్రతము
దైత్యభేది నుపాసించు తపము తపము
శౌరి నారాధనముసేయు జపము జపము
విష్ణు పదభక్తి సమకొల్పు వినికి వినికి

మాకందము కడునిది ర
మ్మా కందము డాయబోయి మంజీరులకన్
మాకందగ వెరగవిసిన
మాకందముగాదె మగువ మాకందమిలన్

వారములకు నతమని వరి
వారములకు నెలవుటలగుచు వాలెడి సమ్య
గ్వారము వారము తనకు
వారము లొనరింపసింధువారములతివా

సమాజం

# అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన హైదరాబాదీ నవల 'షోర్ అండ్ వేవ్'

**నాటి నవలలో హైదరాబాద్ సమాజ ఆవిష్కరణ...**



సంగిశెట్టి శ్రీనివాస్

దక్షిణ ఏషియా ప్రాంతంలోని సాహిత్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసే ఉద్దేశ్యంతో ఐక్య రాజ్యసమితికి అనుబంధంగా నడిచే యునెస్కో సంస్థ 1968-71 మధ్య కాలంలో ఐదు పుస్తకాలను ప్రచురించింది. ఇందులో బిభూతిభూషణ్ బందోపాధ్యాయ రాసిన పతేర్ పాంచాలి, ప్రేమ్‌చంద్ రాసిన 'గోదాన్', అలాగే ఆయన చిన్న కథలు ఆంగ్లంలోకి తర్జుమా చేసి ఆ సంస్థ ప్రచురించింది. దీనితో పాటు ఉర్దూలో అహ్మద్ అజీజ్ రాసిన 'హైసీ బులందీ హైసీ పస్తీ' నవలను కూడా ప్రచురించింది. దీన్ని రాల్ఫ్ రసెల్ ఇంగ్లీషులోకి 'షోర్ అండ్ వేవ్' పేరిట తర్జుమా చేసిండు. జపనీస్ భాషలో రాసిన పుస్తకాలు 'ఫుట్ ప్రింట్స్ ఇన్ స్నో', 'పిల్లర్ ఆఫ్ ఫైర్' పేరిట వెలువడ్డాయి. బిభూతి భూషణ్ బంధోపాధ్యాయ 'పతేర్ పాంచాలి' పుస్తకాన్ని 1929లో రాసిండు. దీన్ని 1955లో సత్యజిత్‌రే అదే పేరుతో సినిమాగా తీసిండు. ఈ పుస్తకాన్ని మద్దిపట్ల సూరి అదే పేరుతో తెలుగులోకి 1960లో తర్జుమా చేసిండు. ఆ తర్వాత యునెస్కో సంస్థ తరఫున టి.డబ్ల్యు క్లార్క్, తారపద ముఖర్జీలు ఇంగ్లీషులోకి తర్జుమా చేసింర్రు. ఇది 1968లో ప్రచురితమయింది. అలాగే మున్షీ ప్రేమ్ చంద్ 1936లో రాసిన 'గోదాన్' నవలను



'గిఫ్ట్ ఆఫ్ ఏ కౌ' పేరిట 1968లో గార్డన్ సి. రోడర్మెల్ తర్జుమా చేసిండు. అలాగే ప్రేమ్‌చంద్ చిన్న కథలను ఇంగ్లీషులోకి డేవిడ్ రూబిన్ తర్జుమా చేసిండు. ఇది 'వరల్డ్ ఆఫ్ ప్రేమ్‌చంద్' పేరిట అచ్చయింది. వీటన్నింటినీ యునెస్కో సంస్థ ప్రచురించింది. ఇవన్నీ కూడా తెలుగులోకి కూడా తర్జుమా అయ్యాయి. అయితే ఇక్కడ చర్చించుకుంటున్న నవల 'షోర్ అండ్ వేవ్'.

'షోర్ అండ్ వేవ్'ని పాకిస్తాన్ ప్రాతినిధ్య నవలగా యునెస్కో ప్రచురించింది. అయితే ఈ నవలలోని కథాంశం 1945లో రెండో ప్రపంచ యుద్ధ ఆరంభం నుంచి ఇండియా-పాకిస్తాన్‌గా విడిపోయే వరకు హైదరాబాద్ నగర ఉన్నత ముస్లిం (నవాబుల) కుటుంబాల జీవనశైలిని, ఆనాటి స్థితిగతుల్ని, సంస్కృతిని మనసుకు హత్తుకునే విధంగా అహ్మద్ అజీజ్ రాసిండు. అంతే ఉన్నతంగా ఈ నవలను బ్రిటన్‌కు చెందిన లండన్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ రాల్ఫ్ రస్సెల్ అనువదించిండు. హైదరాబాద్ ఆత్మను ఆవిష్కరించిండు. ఇందులోని పాత్రలను ప్రత్యక్షంగా పేర్కొనకుండా కల్పిత పాత్రలను, ప్రాంతాలను సృష్టించిండు. హైదరాబాద్‌ను ఫర్ఖొందనగర్, సికింద్రాబాద్‌ను తాబిందనగర్‌గా, హుసేన్‌సాగర్‌ని షాహిద్‌సాగర్‌గా, బంజారాహిల్స్‌ని కిషన్‌పల్లిగా పేర్కొన్నాడు. ఏడో నిజామ్‌ని ఖాన్ హజ్రత్‌గా, ఆయన ప్రధానిని రాజా ఆఫ్ రాజాస్ షుజాత్ షంషేర్ సింగ్ బహదూర్‌గా పేర్కొన్నాడు. ఆధునికత వైపు వేగంగా అడుగులు వేస్తున్న హైదరాబాద్ కట్టడాలు, అందులోని విలాసవంతుల జీవితాలను ఈ నవల్లో చిత్రించాడు. హైదరాబాద్‌లోని మూడు ఉన్నత నవాబీ కుటుంబాలు, రాజాస్థానంలో ఒకరిపై ఒకరు పై చేయి కోసం వేసే ఎత్తుగడలు, కయ్యాలను వియ్యం ద్వారా నెయ్యంగా మార్చుకోవడం ప్రధానంగా స్త్రీ పాత్రల ద్వారా కథను నడిపించిన తీరు అద్భుతం. ఈ నవల రచనా కాలం 1948. ఉర్దూలో అచ్చయింది కూడా ఈ కాలంలోనే. అయితే ఆంగ్లంలోకి 1971లో తర్జుమా

అయింది. అయినప్పటికీ ఈ నవల యొక్క వన్నె ఏ మాత్రం తగ్గలేదు. మీదు మిక్కిలి హైదరాబాద్ ఔన్నత్యాన్ని ప్రపంచానికి తెలియజేసింది.

నవాబీ ఖాందాన్‌కు చెందిన ఖుర్షీద్ జమానీ ఆమె కూతురు నూర్జహాన్ కేంద్రంగా ఈ నవల నడిచింది. ఖుర్షీద్ జమానీ 1920 ఆ కాలం నాటికే ఇంట్లో ఉన్న వాళ్ళని 'డార్లింగ్'అని పిలిచేది. ఆమె ఆంగ్ల విద్యా ప్రవీణురాలు. విదేశాల్లో చదువుకున్నది. మొత్తం హైదరాబాద్ రాజ్యంలోనే ఆమెలాగా ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడేవారు లేరు అనే ప్రతీతి. ఎంత జ్ఞానవంతురాలో అంత అందగత్తె కూడా! ఈమె తండ్రి ఖలీల్ జంగ్ నిజాం ఆస్థానంలో ఉన్నతోద్యోగి. ఈయన తన మొదటి భార్య చనిపోయిన తర్వాత ఐదేండ్లకు బిడ్డకు ట్యూషన్లు చెప్పే గ్రేస్ క్రూ (సికందర్ బేగమ్) అనే ఆంగ్ల వనితను పెళ్ళి చేసుకున్నడు. అంటే ఆంగ్లో-ముస్లిం వివాహమనేది హైదరాబాద్‌లో 1930 ఆ ప్రాంతంలో చాలా విరివిగా ఉండే వనేది అర్థమైతుంది. ఈ విషయం తర్వాత నవలలో వచ్చే పాత్రల ద్వారా మరింత అర్థమైతది. ఖుర్షీద్ జమానీ భర్త సంజయ్ బంగర్ నిజాం ఆస్థానంలో కమీషనర్ పదవిలో ఉన్నాడు. వీళ్లకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. వీళ్ళ చుట్టూతా ఈ నవల నడుస్తుంది.

ఈ నవల్లో హైదరాబాద్‌లోని ముస్లిం సమాజంలో భాగమైన ఆధునికత, సంస్క ృతి, ఆచారాలు, నమ్మకాలు, నిజాం రాజు అలవాట్లు, నవాబీ ఖాందాన్‌ల చుట్టరికాలు, చదువులు, వృత్తులు, పాలనా వ్యవహారాలు తదితర అంశాలు రికార్డయ్యాయి. వీటన్నింటిలోనూ హైదరాబాద్ ఆత్మ ప్రతిఫలించింది. గంధ, ధూపపు గాఢమైన పరిమళం మైమరపింప జేసింది. ఇచ్చిన మాట కోసం కట్టుబడే ఖచ్చితత్వం, ఆంగ్లో-ఇండియన్ (ముస్లిం) సహవాసం, దోస్తానా ఇందులో ఆవిష్కృతమయింది. హైదరాబాద్‌లోని నవాబీ కుటుంబాలు

> **హైదరాబాద్‌ది గంగా-జమున తెహజీబ్. పంచభాషా సంస్కృతికి ఆలవాలం. ఇంగ్లీషు, ఉర్దూ, తెలుగు, మరాఠీ, కన్నడ హైదరాబాద్ రాజ్య అధికార భాషలు. అయితే ఈ సంస్కృతి క్రమేణా తెలంగాణ సాయుధ పోరాటం కాలం నుంచి కనుమరుగయింది. అందుకే ఇవ్వాళ తెలుగు తెలిసిన ముస్లింలు (ముఖ్యంగా హైదరాబాద్‌లో), ఉర్దూ తెలిసిన 'హిందువులు' (ప్రధానంగా గ్రామాల్లో) చాలా తక్కువ. హైదరాబాద్‌లో పక్కపక్కనే కలిసి జీవిస్తున్నా వీరి విషయాలు వారికి, వారి విషయాలు వీరికి పట్టింపులో ఉండవు. ఎవరి ఉద్యమాలు వారివి. ఎవరి ఇలాఖా వారిది.**




మషూర్‌ల్ ముల్క్, ఖలీల్ జంగ్, జలీల్ జంగ్ కుటుంబాల చుట్టూ కథ నడుస్తుంది. ఆనాడు ముల్క్, జంగ్, మొయినుద్దౌలా అనేది రాజ కుటుంబీకుల బిరుదులు. ముల్క్ కన్నా జంగ్ పెద్ద బిరుదు. జంగ్ కన్నా మొయినుద్దౌలా ఇంకా పెద్ద బిరుదు. ఇప్పటికీ హైదరాబాద్‌లో దేశవ్యాప్తంగా ఖ్యాతి గాంచిన 'మొయినుద్దౌలా క్రికెట్ కప్'పోటీలు జరుగుతాయి. వీరందరూ ఒకే పేరుతో అదే 'నవాబ్‌సాబ్' పేరిట పిలువబడేవారు.

ఈ నవలలోని కథాంశం హైదరాబాద్‌లోని నవాబీ ఖాందాన్‌లోని వ్యక్తుల నిత్య జీవితంలో ఎదురయ్యే వివాదాలు, విషయాలే! వీటన్నింటిని నూర్జహాన్ అనే మహిళ కేంద్రంగా రాయడమయ్యింది. సంజర్ బేగ్, ఖుర్షిద్ జమానీల కూతురు నూర్జహాన్. సంజర్ బేగ్ నిజాం ప్రభుత్వంలో ఉన్నతోద్యోగి.

నూర్జహాన్ వివాహం బయటి ప్రాంతంలో ఇంజనీరింగ్ చదువుకున్న సుల్తాన్ హుసేన్‌తో జరుగుతుంది. సుల్తాన్ అప్పటికే అన్ని ఖండాల్లో విహారయాత్రలు చేసి ఉన్నాడు. అంటే ఎంత విస్తృతంగా ప్రపంచాన్ని చుట్టివచ్చాడో అర్థం చేసుకోవచ్చు. ఆయన ప్రతి సంవత్సరం ఒక నెల రోజుల పాటు వేసవి అలసట తీరేందుకు ముస్సోరిలో గడపడం అలవాటుగా చేసుకున్నాడు. ఆనాడు ముస్సోరిలోని హోటల్లలో సుల్తాన్, ఆయన మిత్రులు (ఆడ, మగ) జాలీగా గడిపేవారు. 35వ యేట 19 ఏళ్ళ నూర్జహాన్‌ని పెళ్ళి చేసుకున్నాడు. ముస్సోరికి హనీమూన్‌కు వచ్చిననాడే భర్త తన పాత మిత్రురాలుతో ప్రణయం కొనసాగించడాన్ని చూస్తుంది. ఆ తర్వాత వీరిద్దరి మధ్యన ఉన్న ఏజ్ గ్యాప్, సుల్తాన్ హుసేన్

విచ్చలవిడితనం, తాగుడు ఆమెకు నచ్చలేదు. దాంతోపాటు ఒకసారి గొడవలో నూర్జహాన్‌ని సుల్తాన్ చెంపదెబ్బ కొడతాడు. దీంతో విషయం తెలుసుకొని కోపోద్రిక్తురాలైన ఖుర్షిద్ జమానీ సంఘటనకు ఎలాంటి సంబంధంలేని అమాయకులైన సుల్తాన్ తల్లి, చెల్లి జుబూదాని తూలనాడుతుంది. తర్వాతి కొంతకాలానికి అనివార్యంగా వీరి ఖాందాన్‌లలోనే మొదటిసారిగా 'విడాకులు' తీసుకున్నరు. ఆ తర్వాత తన చిన్ననాటి దోస్తు అతర్‌ని నూర్జహాన్‌ని పెళ్ళాడుతుంది. ఆ తర్వాత సుల్తాన్ కూడా మరో పెళ్ళి చేసుకుంటాడు.

హైదరాబాద్ నగరంలో ఆంగ్లో-ముస్లిం వివాహాలు చాలా సర్వసాధారణంగా జరిగేవి. అంతేగాదు తాబిందనగర్ (సికింద్రాబాద్) లోని క్లబ్బుల్లో జరిగే పార్టీల్లో డాన్సులు, రోల్స్‌రాయిస్ కారుల్లో కిషన్‌పల్లి (బంజారాహిల్స్) నుండి ప్రయాణాలు విందులు, వినోదాల గురించి అజీజ్ అహ్మద్ రాసిండు. ఈ నవల ప్రారంభం కావడమే బంజారా స్త్రీలు తమ వస్తువులను అమ్ముకోవడానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తీరు. ఆ తర్వాత వారి వృత్తి పోవడం. అదే సమయంలో నగరానికి ఆవల వారు నివాసం ఏర్పాటు చేసుకోవడం గురించి రాసిండు. ఈ బంజారాలు నివసించే ప్రాంతం కొండలు, గుట్టలు, పచ్చని పచ్చిక, నీటి కొలనులు, సూర్యోదయం, చంద్రుని మెళుకువ అన్నీ అద్భుతంగా ఉండడంతో నిజాం నవాబు దగ్గర త్వరలో ప్రధానిగా నియమితులుగానున్న అఫ్జా హస్కర్ జంగ్ ఈ ప్రాంతాన్ని డెవలప్ చేసిండు. ఇక్కడి ఇండ్లు విదేశాలను తలపించే విధంగా నిర్మించిన విధానాన్ని ఆయన నవల్లో వర్ణించిండు. జర్మనీ, ఇటలీల నుంచి తెప్పించిన వస్తువులతో ఈ ఇండ్ల ఇంటిరీయర్స్‌ని డెకరేట్ చేయడం కూడా ఇందులో రాసిండు. మిత్రులతో ఏరి కోరి అక్కడ స్థలాలు కొని భవంతులు నిర్మించుకునేలా హస్కర్‌జంగ్ కృషి చేసిండు. ఇతనే ఆ ప్రాంతానికి నిజాం సంస్థానంలోని హిందు పండితుడితో 'కిషన్‌పల్లి' పేరిట చరిత్రను రాయించడానికి పూనుకుంటాడు. ఎందుకంటే అంతకుముందు ఆ పండితుడు తనకు కలలో శ్రీకృష్ణుడు కనిపించి తన గురించి రాయిమన్నాడు అని చెప్పుకుంటాడు. దీన్ని గుర్తుంచుకొని హస్కర్ జంగ్ ఆ పండితునితో 'కిషన్‌పల్లి' చరిత్రను రాయమంటాడు. నిజానికిది ఇవ్వాళ 'బంజారా హిల్స్'గా ప్రసిద్ధి. బంజారాహిల్స్ రూపుదిద్దుకుంటున్న నాటి చిత్రాన్ని మనకళ్ల ముందుంచిండు. నవాబులకు ఒక్కొక్కరికి ఒకటి కన్నా

> **హైదరాబాద్‌లోని ముస్లిం సమాజంలో భాగమైన ఆధునికత, సంస్కృతి, ఆచారాలు, నమ్మకాలు, నిజాం రాజు అలవాట్లు, నవాబీ ఖాందాన్‌ల చుట్టరికాలు, చదువులు, వృత్తులు, పాలనా వ్యవహారాలు తదితర అంశాలు రికార్డయ్యాయి. వీటన్నింటిలోనూ హైదరాబాద్ ఆత్మ ప్రతిఫలించింది. గంధ, ధూపపు గాఢమైన పరిమళం మైమరపింప జేసింది. ఇచ్చిన మాట కోసం కట్టుబడే కచ్చితత్వం, ఆంగ్లో-ఇండియన్ (ముస్లిం) సహవాసం, దోస్తానా ఇందులో ఆవిష్కృతమయింది.**

ఎక్కువ భవంతులు ఉన్న తీరును, కొంత మంది తమ 'ఉన్నత స్థాయి'ని మెయింటెయిన్ చేయడానికి ఫాల్స్ ప్రిస్టేజ్‌కు పోయి అప్పులపాలయిన తీరుని కూడా చెప్పిండు. అంతెందుకు నిజాం నవాబ్ తన చాయ్‌లో మార్జువానా లాంటి మత్తుపదార్థాన్ని సేవించేవాడని కూడా ఒక దగ్గర రాసిండు. ఆనాడు నిజాం గురించి అలా రాయడానికి (ఎంత కల్పిత పేరు పెట్టినప్పటికీ) సాహసముండాలి. అంతేగాకుండా ఆనాటి నవాబ్ ఖాందాన్‌లో పెళ్ళి కావాల్సిన బాలురకు 'ఉంపుడు గత్తె'లుండటం సర్వ సాధారణం. బాలురు బయట చెడుతిరుగుళ్లు తిరుగుతున్న తీరు, బంజారాహిల్స్ రాళ్ళు కొట్టుకునే వడ్డెర స్త్రీలపై అత్యాచారాలకు పాల్పడే 'చోటే నవాబు'ల గురించి రాసిండు. వీరికి ఉంపుడుగత్తెలుగా అత్యంత పేదరికంలో ఉన్నటువంటి 14-15 ఏండ్ల అమ్మాయిలను తీసుకొచ్చి ఇంట్లోనే ఉంచుకొనే తీరుని, వీరు చోటే నవాబులకు అందించే 'సేవల' గురించి కూడా చెప్పిండు. అంతెందుకు ఉన్నత కుటుంబాల్లోని స్త్రీలు 'పర్వర్ట్'గా మారిన తీరుని జీనత్ పాత్ర ద్వారా చెప్పిండు. ఆమె ఆఖరికి కల్లు కూడా తాగడాన్ని కూడా రికార్డు చేసిండు. ఇదంతా హైదరాబాద్ సంస్థానంలోని ముస్లిం ఖాందానీ కల్చర్, జీవన విధానంలో భాగంగా అజీజ్ చెప్పిండు.

పైన చెప్పుకున్నట్లుగా బిభూతిభూషణ్ బంధోపాధ్యాయ, ప్రేమ్ చంద్ రాసిన రచనలు దాదాపు 50 ఏండ్ల నుంచే తెలుగు పాఠకులకు తెలుసు. అయితే ఉర్దూలో రాసిన 'హైసీ బులందీ హైసీ పస్తీ' గురించి పెద్దగా తెలియదు. ఈ నవలాకారుడు అహ్మద్ అజీజ్ పక్కా హైదరాబాదీ. హైదరాబాద్‌లో 1914లో పుట్టిన అహ్మద్ ఉర్దూలో కథలు, నవలలు రాయడమే గాకుండా ఇక్బాల్ రచనల్లో నిష్ణాతుడు. మంచి పరిశోధకుడు. ఈయన దేశ విభజన తర్వాత పాకిస్తాన్‌కు వెళ్ళిండు. అక్కడ ఒకటి రెండేండ్లు ఉండి కెనడాకు వెళ్ళిండు. కెనడాలోని విశ్వవిద్యాలయంలో ఇంగ్లీషు ప్రొఫెసర్‌గా పనిచేసిండు. అంతకు ముందు ఈయన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇంగ్లీష్ డిపార్ట్‌మెంట్‌లో కూడా పనిజేసిండు. అంతేగాదు ప్రిన్సెస్ దుర్రెషెవార్‌కు వ్యక్తిగత కార్యదర్శిగా వ్యవహరించిండు. ఆమెతో పాటు కాశ్మీర్‌లో పర్యటించిండు. ఆ అనుభవంతో మూడుతరాల కశ్మీరీ జీవితాన్ని కథల్లో చిత్రించిండు. 1946లో అజీజ్ ఉర్దూలో రాసిన పుస్తకమే ఇప్పటికీ అభ్యుదయ రచయితల సంఘానికి సంబంధించిన అథెంటిక్ పుస్తకం అంటే అతిశయోక్తి కాదు. ఈయన 16, డిసెంబర్, 1978లో చనిపోయిండు. ఇక నవలను ఇంగ్లీషులోకి హృద్యంగా తర్జుమా

వ్యాసం

చేసిన రాల్ఫ్ రస్సెల్ ఆ భాషలో నిష్ణాతులు. బ్రిటన్ కమ్యూనిస్టు పార్టీ సభ్యుడైన రస్సెల్ ఉర్దూ ప్రతిభను గుర్తించి పాకిస్తాన్ ప్రభుత్వం ఈయనకు 'సితార-ఎ-ఇంతియాజ్' అవార్డుని బహూకరించింది.

హైదరాబాద్‌ది గంగా-జమున తెహజీబ్. పంచభాషా సంస్కృతికి ఆలవాలం. ఇంగ్లీషు, ఉర్దూ, తెలుగు, మరాఠీ, కన్నడ హైదరాబాద్ రాజ్య అధికార భాషలు. అయితే ఈ సంస్కృతి క్రమేణా తెలంగాణ సాయుధ పోరాటం కాలం నుంచి కనుమరుగయింది. అందుకే ఇవ్వాళ తెలుగు తెలిసిన ముస్లింలు (ముఖ్యంగా హైదరాబాద్‌లో), ఉర్దూ తెలిసిన 'హిందువులు' (ప్రధానంగా గ్రామాల్లో) చాలా తక్కువ. హైదరాబాద్‌లో పక్కపక్కనే కలిసి జీవిస్తున్నా వీరి విషయాలు వారికి, వారి విషయాలు వీరికి పట్టింపులో ఉండవు. ఎవరి ఉద్యమాలు వారివి. ఎవరి ఇలాఖా వారిది. కాలం, దానితో పాటు రాజకీయాలు వీరిద్దరినీ పరస్పరం శత్రువులుగా మార్చింది. ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ముషాయిరాల్లో భాగంగా గజళ్ళు వినిపించిన నారాయణరెడ్డి, దాశరథులు ఇప్పుడు లేరు. ఉర్దూ కవితా గానం చేసిన మఖ్దూం, మైకాష్‌లు కూడా లేరు.

అయితే వారి సాహిత్యాన్ని మొత్తం తెలుగు పాఠకులకు తెలియజేయాల్సిన బాధ్యత 'తెలంగాణ సాహిత్య అకాడెమీ'పై ఉన్నది. ఇన్నేండ్లు పరాయి పాలన మూలంగా హైదరాబాద్ ఉర్దూ సాహిత్యం రకరకాల కారణాల వల్ల తెలుగులోకి రాలేదు. ఇప్పటికైనా హైదరాబాద్ కేంద్రంగా విశ్వవ్యాప్తమైన ఉర్దూ సాహిత్యాన్ని తెలుగులోకి తీసుకు రావాల్సిన అవసరమున్నది. గంగా-జమున తెహజీబ్‌కు ఆలవాలమైన ఉర్దూ-తెలుగు సాహిత్యాన్ని, రచనలను అటు తెలుగులోకి, తెలుగులో మెరుగైన రచనలు ఉర్దూలోకి తర్జుమా చేయాల్సిన అవసరమున్నది. దీని ద్వారా ప్రజల మధ్యన సయోధ్య పెరిగే అవకాశమున్నది. ఇందుకు తొలి అడుగు 'హైసీ బులందీ హైసీ పస్తీ' (శిఖరాలు-లోయలు)తో మొదలు కావాలని కోరుకుంటున్నా!

కవిత

# వరూధినీ!



**- డా. రేవూరు అనంతపద్మనాభ రావు**

అచ్చర భామినీ! మిసిమి యందపు బొమ్మ వరూధినీ! నినున్
మెచ్చె వసంతకాంతులను మించెడి చక్కదనాల ప్రోడయో
సచ్చరి తుండు మంచుమల సొంతము జూచు నెపాన వచ్చెనీ
వచ్చెరు వంద; నదృష్టమటన్న నిదేగద! ఎంతవారికిన్



నీదు హృదబ్జ మందు కరుణించె గదా ఇల చందమామకున్
జోదగురాజు వచ్చెడిని చూడుమదే, ప్రవరాఖ్యుడే సుమా!
వాదున కట్టు త్రోసె నిను, వాని మనమ్మున గల్గె ప్రేమ నిం
పాదిగ నేగు దెంచెడిని వాడె సుమాస్త్రుడు ఓవరూధినీ!

కన్నియవేట నీ మనసు కాంక్షిత మింతలు నంతలై కడున్
వన్నెలు చిన్నెలై కడుపు పంట స్వరోచికి దోహదమ్ముగా
సన్నుత వంశ సంభవుడు సాగరధీరుడు మంచు కొండకున్
తిన్నగ పర్వులెత్తె గద! దేవుని లీల లెరుంగ నేర్తుమే!.

మాయలు పన్ని మోసముగ మాటలు పల్కిన వీని నమ్మి నీ
సోయగ మప్పజెప్పితివి; చోద్యముగాదె తిరస్కరించియున్
పోయిన వాడు వచ్చుటన మోసము గాదటె, దోషకారియై
హాయిగ ఖేచర ప్రవరు డాదట నేగెను మోసబోయితిన్!

మోసము సుమ్మి- ఎట్టి పార పొచ్చెములేక యెడంద నమ్మి ఆ
భూసురు డేయటంచు కడు మోసము నందితి; గుండె వ్రయ్యలే
నో సుదతీ! నిజంబు విన, నోర్వగ లేవమాన బాధ- ఆ
వేసము జూచి మోసపడ వింతగదా ఇది ఓ వరూధినీ!

కథ

# మన నరకమే - మనకు స్వర్గం

మనిషి విజ్ఞానంతో పాటు వంచన చేయడం ఎట్లా సాధించాడో చెప్పే కథ....



వేణు నక్షత్రం (U.S.)

“చిత్ర గుప్తా, ఈ అవిశ్రాంత కార్యక్రమాల వల్ల నా శరీరం బాగా అలసిపోయింది. మనసు కొంత విశ్రాంతిని కోరుకుంటుంది” యమధర్మరాజు ముఖంలో కొట్టచ్చినట్టు అలసత్వం కనిపిస్తుంటే చిత్రగుప్తునితో తన బాధంతా వెల్లడించుకున్నాడు.

ఎవరూహించని కరోనా మహమ్మారి మూలంగా ప్రపంచ వ్యాప్తంగా చాలా మరణాలు సంభవిస్తుంటే డాక్టర్లు, నర్సులతో సమానంగా నరకంలో యమపురిలో యమధర్మరాజు సంస్థానం కూడా అలుపు సొలుపూ లేకుండా పనిచేస్తున్నారు.

భూలోకంలో మోసాలు, పాపాలు చేసే వారు ఎక్కువకావడం, కరోనా కష్టకాలం మొదలయ్యినప్పటి నుండి చచ్చిన ప్రతివాడు సరాసరి నరకానికే పోవడం వల్ల అక్కడ ఎవ్వరికీ ఒక్క క్షణం కంటిమీద కునుకు లేకుండా అవుతుంది.

“స్వామీ, మీ పరిస్థితి చూసి నేనూ అదే చెపుదాము అనుకున్నా! మీకు విశ్రాంతి అవసరం. అక్కడ దేవేంద్రుల వారిని చూడండి. వచ్చే ఒకటీ, అరా కేసుల్ని చూస్తూ హాయిగా కాలు మీద కాలు వేసుకుని ఎలా కూర్చున్నాడో!” యమధర్మరాజుని ఉడికించాలని అన్నాడు చిత్రగుప్తుడు తన పని భారం కూడా కొన్ని రోజులు తప్పించుకోవాలని చూస్తూ.

“వైద్యులు కరోనాకి టీకా కనిపెట్టారు అని వార్త చూసాను, ఇప్పుడు మనకెట్లాగు కొంత పని భారం అయితే తగ్గుతుంది. ఆ ఏర్పాట్లేవో చేయి మరి!” చిత్రగుప్తునికి పని పురమాయించాడు యమధర్మరాజు.

“ఈ సారి భూలోకంలోనే భూతలస్వర్గం అని పేరు గాంచిన కొత్త ప్రదేశానికి తీసుకెళ్తాను. మనకెలాగూ ఇక్కడి స్వర్గలోకానికి అనుమతి లేదు” అన్నాడు ఎప్పటి నుండో అమెరికాకు వెళ్ళాలి అని కోరికతో ఉన్న చిత్రగుప్తుడు.

“ఏదీ? హైదరాబాద్ నగరమే కదా?” అన్నాడు యమధర్మరాజు అక్కడ తిన్న హిమక్రీములు గుర్తుకు వచ్చి నోట్లో లాలాజలం ఊరుతుండగా.

“ఆ.. అప్పుడెప్పుడో ఎన్.టీ.ఆర్ జమానా నుండి ఇప్పటి జూనియర్ ఎన్.టీ.ఆర్ జమానా వరకూ అక్కడికే వెళ్తున్నాము కదా స్వామీ! ఈ సారి తెలుగువాళ్ళు ఎక్కువగా ఉన్న ఒక విదేశానికి వెళ్దాము. ఆ దేశం పేరు అమెరికా” అన్నాడు చిత్రగుప్తుడు.

“ఓ అమెరికానా? అటులనే కానివ్వు!” అన్నాడు ఉత్సాహంగా యమధర్మరాజు.

“మానవులు అవలంభిస్తున్న ‘రిమోట్-వర్క్ ఫ్రం హోమ్’ పద్ధతిన మనము అక్కడి నుండే అన్ని శిక్షలు అమలు చేయవచ్చు స్వామీ! ” అని మొత్తం ప్రణాళిక వివరించాడు చిత్రగుప్తుడు.

“భేష్ చిత్రగుప్తా భేష్.. ప్రయాణానికి సిద్ధంకండు!” ఆర్డర్ జారీ చేసాడు యమధర్మరాజు.

★ ★ ★

ముందుగా అనుకున్నట్టుగానే అమెరికాలో న్యూయార్క్‌లో ఒకపెద్ద రిసార్టులో దిగారు యమధర్మరాజు, చిత్రగుప్తుడు. బాగా అలసిపోయిన ఇద్దరికీ మంచి నిద్రపట్టేసింది. కొన్నిగంటల నిద్ర అనంతరం మెలుకువ వచ్చింది యమధర్మరాజుకి. చుట్టూ చూసాడు. ఎక్కడా చిత్రగుప్తుని జాడ కనిపించలేదు.

కిటికీ ద్వారా బయటకు చూస్తే పెద్ద పెద్ద మంచు కొండలు. ఎక్కడా జన సంచారం లేదు. స్వర్గంలో- నరకంలో కనపడే మంచుకొండలే ఇక్కడా కనపడేసరికి కోపం నశాలానికి అంటింది.

“యముండ!” అరిచాడు గట్టిగా యమధర్మరాజు. ఆ అరుపులకి రిసార్ట్ అంతా మారు మ్రోగిపోయింది.

“చిత్రగుప్తా... నాకు ఏదో భూతలస్వర్గం చూపుతావు అని ఇక్కడికి తీసుకొచ్చి పడేసావు. ఎక్కడ చూసిన మంచుగుట్టలు తప్ప మానవ సంచారమే లేదే? ఎక్కడున్నావు?” చిర్రెత్తుకొచ్చిన యమధర్మరాజు గదని భుజంపై పెట్టుకుని బెడ్‌రూమ్ నుండి హాల్లోకి, హాల్లో నుండి బెడ్‌రూమ్‌లోకి తిరుగుతున్నాడు ఆవేశంగా.

గడియారంలో సమయం ఉదయం తొమ్మిది గంటలు చూపుతుంది. కొద్ది సేపటి తర్వాత మెల్లిగా తలుపు తెరుచుకుంది. ఒక అందమైన యువతి చీరకట్టులో రాజకుమారిలా వెలిగిపోతూ నాజూకు నడకతో యమధర్మరాజుని సమీపించింది. ఆ అమ్మడి ఒంటికి రాసుకున్న అత్తరుపరిమళం ఒక్కసారిగా యమధర్మరాజు మత్తుని వదిలించింది.

యమధర్మరాజు కళ్ళు ఆశ్చర్యంతో విచ్చుకున్నాయి. రంభ, ఊర్వశి, మేనక, తిలోత్తమలను చూసి విసిగిపోయిన కళ్ళకు ఆ అమ్మాయి మరింత అందంగా కనిపించింది. వయ్యారంగా నడుస్తూ యమధర్మరాజు నిల్చున్న దగ్గరకు వచ్చింది.

"ఎవరు బాలికా నువ్వు, మా చిత్రగుప్తుడిని కాని చూసావా?" ఆశ్చర్యంలోంచి తేరుకుని అడిగాడు యముడు.

"స్వామి నాపేరు చిత్రగుప్తి. మహిళా కోటాలో నాకు ఈ ఉద్యోగం ఇచ్చి చిత్రగుప్తుల వారు నిన్ననే స్వీయ ఉద్యోగ విరమణ తీసుకున్నాడు. ఫ్లోరిడాలో ఒక వెకేషన్ హౌం తీసుకొని అక్కడే సెటిల్ అవుతాడని మీతో చెప్పమన్నాడు" అంది వినయంగా చిత్రగుప్తి.

"యముండ! ఏమిటి.. చిత్రగుప్తుడికి ఉద్యోగ విరమణా?" కోపంతో, అసహనంతో అరిచినంత పనిచేసాడు యమధర్మరాజు.

"అవును స్వామీ, అమెరికా చట్టం ప్రకారం పదవీ విరమణ వయసు అరవై ఎనిమిది సంవత్సరాలు అని తెలుసుకొని పదవీ విరమణకి నిర్ణయించుకున్నారు" అసలు విషయం చెప్పింది చిత్ర గుప్తి.

"అంత మోసం చేస్తాడా చిత్రగుప్తుడు! చూద్దాం ఎన్నిరోజులు నా నుండి తప్పించుకు తిరుగుతాడో! ఇంతకీ నీకు ఈ అవకాశం ఎలా వచ్చింది?" అంత ఆవేశంలో కూడా సందేహం వచ్చింది యమధర్మరాజుకి.

"స్వామీ.. ఇక్కడే రెసెప్షనిస్టుగా పని చేస్తున్న నాకు ఎక్కువ జీతం ఆశ చూపడంతో ఈ రోజు నుండి ఈ వృత్తిలో చేరాను" అన్ని వివరాలు చెప్పింది చిత్రగుప్తి.

"యముండ!" గట్టిగ అరిచాడు ఆవేశంతో. బాగా అలసిపోయిన యముడికి బి.పీ కూడా పెరగడంతో సోఫాలో కూలపడిపోయాడు. వెంటనే అక్కడ ఉన్న మెడికల్ కిట్ నుండి రెండు బి.పీ మాత్రలు తీసి కొన్ని నీళ్ల ఇచ్చింది. యమధర్మరాజు వాటిని గుటుక్కుమని మింగి కొంత శాంత స్వరూపుడయ్యాడు.

"యముండ! మా పై అంత దారుణానికి ఒడిగడతాడా చిత్రగుప్తుడు. చూస్తుండు నేను చిత్రగుప్తుని పై ఎలాంటి చర్యలు తీసుకుంటానో? అయినా ఒక మహిళ చిత్రగుప్తుని వృత్తి చేయుటమా..? ఇది అసంభవం!" కోపంతో ఊగిపోయాడు యమధర్మరాజు.

"అసంభవం కాదు స్వామీ, సంభవమే! మీరు మరొక్కసారి అలాంటి మాటలు మాట్లాడినచో ఇక్కడి మహిళా సంఘాలు మీపై పరువు నష్టం దావా వేయును. మీకు ఏ పని కావాలో, ఎవరి చిట్టా కావాలో అడుగుము. క్షణంలో మీ ముందు ఉంచెదను! అంతే కానీ, మహిళా సామర్థ్యాన్ని తక్కువ చేసి చూడకండి!" అంతే ధీటుగా జవాబిచ్చింది చిత్రగుప్తి.

"చిత్రగుప్తా .." కోపంగా అరిచాడు

**చిత్రగుప్తుడు చిట్టా ఇచ్చే వరకు, మరణించిన వారిని స్వర్గానికి తీసుకు పోవాలో, నరకానికి తీసుకు పోవాలో తెలియక ఒక ప్రత్యేక బస ఏర్పాటు చేసి అందరికీ సమాన గౌరవం ఇస్తున్నాము. ఈ చర్య వల్ల మేము ఆర్థికంగా బాగా నష్ట పోయాము, ఇంకా నష్ట పోతూనేఉన్నాము. ఒక్క రోజులో నూనె లో దేవించి బుగ్గి కావల్సిన వారు కూడా వారం రోజుల వరకు స్వర్గానికి వెళ్లే వారితో సమానంగా రాజభోగాలు అనుభవిస్తున్నారు. ఇప్పుడు తాత్కాలిక బసను తొలగించి మా నష్టాన్ని పూడ్చుకుంటాము" ఒక పెద్ద పరిష్కారం దొరికిందన్న సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు యమధర్మరాజు.**



కథ

యముడు

"పొరబాటు స్వామీ.. చిత్ర గుప్తి!" సరిదిద్దింది.

"హు ..ఇది హెచ్చరికా లేక విన్నపమా?" హుంకరించాడు.

"ఇది హెచ్చరికే! "అంతే వేగంగా జవాబిచ్చింది చిత్రగుప్తి.

"మాతోనే పరిహాసమా? అది ఎలా సాధ్యం? ఎన్నో రోజుల నుండి ఈ వృత్తిలో ఉన్న మాకే సాధ్యం కానప్పుడు, ఈ రోజే వృత్తిలో చేరిన నీకు ఎలా సాధ్యం? "చిత్రగుప్తి దబాయింపుకు ఖంగుతిన్న యమధర్మరాజు కొంచెం తగ్గాడు.

"ఇప్పుడు దారిలో పడ్డారు స్వామి" అని మనసులో అనుకుంది చిత్రగుప్తి. టేబుల్ పైన ఉన్న బ్రేక్ఫాస్ట్ బార్ ని ఇచ్చి తినమంది. బాగా ఆకలిగా ఉన్న యముడు ఆవురావురని ఒక్క గుక్కలో మింగేశాడు. ఇప్పుడు కొంత స్థిమితపడ్డాడు యమధర్మరాజు.

"మీకు ఎవరి చిట్టా కావాలో చెప్పండి. చిటికె లో మీ ముందు ఉంచుతా! అంతే కాని నా సామర్థ్యాన్ని తక్కువ చేసి చూస్తే ఊరుకునేది లేదు" వార్నింగ్ ఇచ్చింది చిత్రగుప్తి.



"అబ్బో! మహిళా శక్తి అట!! అని మనసులో అనుకుని, కొంత నవ్వుకున్నాడు యమధర్మరాజు.

కొద్దిసేపు కళ్ళు మూసుకుని ఆలోచించి, చిత్రగుప్తి అరచేతిలో అంజనం వేసి ఒక వ్యక్తి రూపాన్ని చూపుతూ "ఈ మానవుడి చిట్టా విప్పుము" అని చెప్పి మీసము పై చేయి వేసి ఒక చిరు మందహాసం చేసాడు యమధర్మరాజు.

చిత్రగుప్తి ఆ వ్యక్తిని చూసి, "ఓ... ఇతడేనా?" అని మనసులో అనుకోని పక్క రూములోకి వెళ్ళింది.

"ఒక వ్యక్తి వివరాలు కనుక్కోవడం కోసం ఎంత కష్టమో తెలియదు పాపం! మేము ఎన్ని రోజులు కూర్చుంటే, ఎన్ని గ్రంథాలు తిరగేవేస్తే అతడు చేసిన పాప పుణ్యాల చిట్టా దొరుకుతుంది? ఎలాగూ ఈ బాలిక ఆ చిట్టా సంపాదించలేదు. ఈ నెపంతో ఇప్పుడే ఉద్యోగంలోంచి తీసివేసి మళ్ళీ చిత్రగుప్తుని రప్పించెదను" అని మనసులో అనుకుని, నవ్వుకొని "యముండ!" అని తన తెలివికి తానే మురిసిపోయాడు యమధర్మరాజు.

పక్క రూములోకి వెళ్లిన చిత్రగుప్తి తన లాప్టాప్ ఓపెన్ చేసి, అక్కడి ప్రింటర్కి కనెక్ట్ చేసింది. వికీపీడియాలోని వివరాలను ప్రింట్ చేసి ప్రింట్ అవుట్తో బయటకు వచ్చి యమధర్మరాజు చేతికందించింది.

ఆ పేపర్పై ఉన్న చిత్రం చూసి వివరాలు చూసి ఖంగుతిన్నాడు యముడు. ఆశ్చర్యచకితుడై చిత్రగుప్తి ఇచ్చిన వివరాలు చదివాడు.

"ఇతను మాయబజార్ చలనచిత్రం లోని 'సత్యపీఠం' లాంటి యంత్రాన్ని వాడుకలోకి తెచ్చి ఐ-పాడ్, ఐ-ఫోన్ లాంటి పరికరాలను కనిపెట్టి దూర ప్రాంతాల్లోని సామాన్య ప్రజానీకం ఒకరిని ఒకరు చూసుకుంటూ మాట్లాడే వీలు కల్పించాడు. కంప్యూటర్ రంగంలో ఒక సాంకేతిక విప్లవాన్ని లేపాడు. ఇతని పేరు స్టీవ్ జాబ్స్. ఇతడు చాలా మందికి ఆదర్శంగా నిలిచాడు, అనారోగ్యంతో యాభై ఆరవ ఏట మరణించాడు" అని చదివాడు యముడు.

కళ్ళు మూసుకుని తన పాశాన్ని గాల్లో పెట్టి ఒక చిన్న శ్లోకం చదివాడు. వెంటనే ఒక చిట్టా యముడి చేతిలో ప్రత్యక్షం అయ్యింది. యువతి ఇచ్చిన చిట్టాతో పోల్చి చూసాడు. అన్ని వివరాలు సరిగ్గా సరిపోయాయి. నమ్మలేక పోయాడు యముడు.

"బహుశా ఇదంతయూ ఆ చిత్రగుప్తుని మాయ అయ్యుంటుంది. చిత్రగుప్తా.. నాతోనే పరిహాసమా? ఇప్పుడు చూద్దాం నీవెలా ఈ అమ్మడికి సహాయపడుతావో?" అని మనసులో అనుకుని కళ్ళు మూసుకొని బాగా ఆలోచించి ఇప్పుడు ఇంకొక వ్యక్తి రూపాన్ని ఆ యువతి అరచేతిలో అంజనం వేసి చూపాడు యమధర్మరాజు.

ఆ రూపాన్ని చూసిన యువతి "ఓ ఇంతేనా? ఇది చాలా సులభం" అనుకుంటూ ఇలా లోపలికి వెళ్లి అలా బయటకి వచ్చింది ప్రింట్ అవుట్తో.

అంతలోనే తిరిగి వచ్చిన యువతిని చూసి యముడు చాలా సంతోషంగా "నేను అనుకున్నానులే, ఇది నీ వల్ల కాదు అని! కొన్ని దశాబ్దాలుగా కోటాను కోట్ల మంది జనన మరణాలను, పుట్టు పూర్వోత్తరాలను రాసిన మాకే సవాలా? సరే మీరు వెళ్లి చిత్రగుప్తుని తీసుకు రండు, ఈ సారికి క్షమించి వదిలేస్తున్నాను" అని మరొక్క సారి మీసాల మీద చేయి వేసి "యముండ" అన్నాడు విజయ గర్వంతో యమధర్మరాజు.

ఆ గర్వము నుండి తేరుకోక ముందే చిత్రగుప్తి తనచేతిలోని వివరాలు యముడికి అందచేసింది. ఖంగుతిన్నాడు యమధర్మరాజు. "ఇంత త్వరగా అన్ని వివరాలు సేకరించడమా?" అని ఒకటికి

**"అవును చిత్రగుప్తా! మనుషులే ఇతర మనుషులకు మోసాలు చేస్తుంటే, ఇంకో వైపు మనుషుల పట్లే కాక మూగ జంతువుల పట్ల కూడా దయతో మసులుకునే మనుషులు ఎక్కడో ఒకరు ఉంటారు" అన్నాడు కొంత ఉద్వేగంగా. దున్నపోతుకు పూర్తి శక్తులు తిరిగి ప్రసాదించాడు యమధర్మరాజు. వెంటనే దున్నపోతు ఒక్క ఉదుటున తన కట్లని తెంచుకుని, ఆ ఒక్క యువకుడిని తప్ప అందరినీ కుమ్మి అక్కడినుండి సురక్షితంగా బయటపడి యమధర్మరాజుని చేరింది.**

కథ

రెండు సార్లు కాగితాన్ని అమ్మాయిని తేటిపారజ చూసాడు. మళ్ళీ కళ్ళు మూసుకొని తన పాశాన్ని గాల్లో పెట్టి శ్లోకం చదివి చేతిలో చిట్టా రాగానే చదివాడు.

వివరాలు ఇలా చదివాడు "ఇతను కోటాను కోట్ల యువతీ యువకులకి తన ఆట పాటలతో వినోదాన్ని పంచాడు. ముఖ్యంగా యువతని తనదైన స్టయిల్లో స్టెప్పులు వేస్తూ ఉర్రూతలూగించెను. ఇతని పేరు మైఖేల్ జాక్సన్, అనుమానాస్పద తీరులో, ఒక ఔషధం వికటించి మరణించెను". రెండింటిలో వివరాలు పోల్చి చూసుకుని సంభ్రమాశ్చర్యాలకు గురి అయ్యాడు యమధర్మరాజు.

ఆ తర్వాత ప్రముఖ నిర్మాత రామానాయుడు, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, గాన గంధర్వుడు బాలు, బాస్కెట్ బాల్ ప్లేయర్ కోబి బ్రయంట్, నటులు జయప్రకాశ్ మరి కొంత మంది ప్రముఖుల వివరాలు యమధర్మరాజు అడగడం, చిత్రగుప్తి చిటికెలో చూపడం జరిగింది.

"భేష్ బాలికా భేష్! మేము మీ పని వల్ల చాలా సంతృప్తి చెందినాము. అదియును కాక చిత్రగుప్తుని పని వల్ల మేము బాగా విసిగిపోతిమి" కొంత సంతోషంతో ఉప్పొంగిపోతూ, చిత్రగుప్తునిపై అసహనాన్ని ప్రదర్శించాడు యమధర్మరాజు.

"అదేమిటీ స్వామీ, కొన్ని శతాబ్దాలుగా వారి సేవలు .." అంటూ ఇంకా ఏదో చెప్పబోయింది చిత్రగుప్తి.

ఆ మాటలను మధ్యలోనే ఆపి "ఆ .. ఒక్కరి చిట్టా తీసుకురావడానికి కనీసం వారం రోజులు తీసుకుంటున్నారు ఈ మధ్య చిత్రగుప్తులవారు. దానికి తోడు కొంత మతిమరుపు వ్యాధి కూడా సోకినట్టు మా అంతరంగిక వైద్యుల అనుమానం!

చిత్రగుప్తుడు చిట్టా ఇచ్చే వరకు, మరణించిన వారిని స్వర్గానికి తీసుకు పోవాలో, నరకానికి తీసుకు పోవాలో తెలియక ఒక ప్రత్యేక బస ఏర్పాటు చేసి అందరికీ సమాన గౌరవం ఇస్తున్నాము. ఈ చర్య వల్ల మేము ఆర్థికంగా బాగా నష్టపోయాము, ఇంకా నష్ట పోతూనే ఉన్నాము. ఒక్క రోజులో నూనె లో దేవించి బుగ్గి కావల్సిన వారు కూడా వారం రోజుల వరకు స్వర్గానికి వెళ్లే వారితో సమానంగా రాజభోగాలు అనుభవిస్తున్నారు. ఇప్పుడు తాత్కాలిక బసను తొలగించి మా నష్టాన్ని పూడ్చుకుంటాము" ఒక పెద్ద పరిష్కారం దొరికిందన్న సంతోషంతో ఉక్కిరిబిక్కిరి అయ్యాడు యమధర్మరాజు.

"ధన్యురాలిని స్వామీ!" అంది వినయంగా చిత్రగుప్తి.

> **ఎంతో హడావిడిగా, కన్నుల పండువగా ఉన్న హాలీవుడ్ ప్రాంతం ఒక్కసారిగా నిర్మానుష్యం అయ్యింది. ఎటూ చూసినా చిమ్మ చీకటి. హొటల్లో జనరేటర్ పై ఎమర్జెన్సీ లైట్లు మాత్రమే వెలుగుతున్నాయి. ఏ/సి పూర్తిగా నిలిపి వేయబడింది. ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు యమధర్మరాజు. రాత్రి అసలే నిద్ర పట్టలేదు. ఉదయం నిద్రపట్టే సమయంలో దేవేంద్రుల వారి నుండి కబురు వచ్చింది.**

"భలే చిత్రగుప్తి, భలే! మాకు చాలా సంతోషంగా ఉంది. నీకు మంచి జీతభత్యాలతో పాటు ఉపరి లాభ బహుమానము.. అదే 'సైన్ ఆన్ బోనస్' కూడా ఇప్పించెదను.

"చాలా సంతోషం స్వామీ!" అని వినయంగా నమస్కరించింది. "ఈ ఇంటర్నెట్ గూగుల్, వికీపీడియా గురించి తెలియకుండా జాగ్రత్తపడాలి. లేదంటే మొదటికే మోసం వస్తుంది" అని అనుకుంది చిత్రగుప్తి మనసులో.

"మరి స్వర్గ, నరకాల్లో జరుగుతున్న వివరాలు ఎలా తెలియాలి" కొంత సేపటి తర్వాత సందేహం వచ్చింది యమధర్మరాజుకి.

"మీకెందుకు చింతస్వామీ, రిమోట్ వర్క్ సిస్టం ఉంది కదా? ఇప్పటికే మేము భూమ్మీద ఉన్న నాసా సెంటర్ నుండి చంద్రునిపై ఉన్న ఉపగ్రహాన్ని నడిపిస్తున్నాము. రిపేరులొస్తే చేస్తున్నాము. అలాంటిది స్వర్గ-నరకాల నుండి వివరాలు తేవడం మాకు పెద్ద కష్టమేమి కాదు. మీకు ప్రతి రోజు స్వర్గంలో దేవేంద్రులవారి సంగతులు, నరకంలో అమలు చేసిన శిక్షల వివరాలు, శిక్షలు పడిన వారి జాబితా, పునర్జన్మల వివరాలు, మనుషుల్ని వేయించే నూనె డబ్బాల స్టాక్ వివరాలు, ఇంధనం నిలువలు అన్నీ ఎప్పటికప్పుడు తెలియ చేస్తాను కదా!" చాలా నమ్మకంగా చెప్పింది చిత్రగుప్తి.

"భేష్... బాలికా... భేష్! మీలో ఇంతటి సామర్థ్యం, నైపుణ్యం దాగున్నాయని అనుకోలేదు. సరేగాని మా చిత్ర గుప్తులవారు ఇది భూతలస్వర్గం అన్నారు, మరి ఎక్కడ చూసినా మా లోకంలో ఉన్నట్టే అన్నీ మంచుకొండలే కనిపిస్తున్నాయి?" అన్నాడు ప్రశ్నార్థకంగా ముఖం పెట్టి.

"ఇప్పుడు ఇక్కడ శీతాకాలం స్వామీ! విపరీతమయిన చలి, మంచు వల్ల ఎవరూ బయటకి రారు. ఇంకా కరోనా రెండవ వేవ్ వచ్చింది అన్నారు కదా! అందుకనే చాలా మంది ఇంటికే పరిమితం అయ్యారు. మీకు ఈ శీతాకాలంలో భూతల స్వర్గం చూడాలంటే మనం వెస్ట్‌కోస్ట్‌కి వెళ్ళాలి స్వామీ" అంది వినయంగా....

"అటుల అయినచో అక్కడికే వెళ్ళెదము. చిత్రగుప్తుల వారు ఇక్కడికెందుకు తెచ్చారో?" అన్నాడు సందేహంగా...

"వయసు అయిపోయింది కదా స్వామీ, ఆ వివరాలు తెలియవనుకుంటా!" అంది చిత్రగుప్తి కావాలనే చిత్రగుప్తుని విలువ తక్కువ చేస్తూ.

"సరే అయితే. ఆ ప్రయాణపు ఏర్పాట్లు చూడండి. ఆ మాటలో వజ్ర

క
థ

వైఢూర్యములు ఉన్నవి. అవసరము ఉన్నన్ని తీసుకొనుము" అన్నాడు చిత్రగుప్తి చెప్పిన మాటలు విని.

మూట విప్పి చూసిన చిత్రగుప్తికి దాదాపు కళ్ళు తిరిగి పడిపోయేంత పనయింది. వెంటనే ఆ షాకు నుండి తేరుకుని "సరే స్వామీ, అవన్నీ నాకు వదిలేయము" అని రెండు చేతుల్లో పట్టినన్ని వజ్రాలు బ్యాగులో వేసుకొని లాస్ వేగాస్ ట్రిప్ కి ఏర్పాట్లు మొదలుపెట్టింది.

★ ★ ★

ఎప్పుడూ తన వాహనం అయిన దున్నపోతు మీదే తిరిగిన యమధర్మరాజు మొదటి సారి విమానంలో ఎక్కాడు. యమధర్మరాజుతో పాటు చిత్రగుప్తి కూడా ఉంది.

"ఆహా.. ఈ పుష్పక విమాన ప్రయాణం ఎంత హాయిగా ఉంది. ఈ ప్రయాణం ఇంత హాయిగా ఉంటుందని అప్పుడే తెలిస్తే, ఆరోజు రావణాసురుడు మా యమపురిని ముట్టడించినప్పుడే రావణుని పుష్పక విమానాన్ని తస్కరించాల్సింది" యమధర్మరాజు ఆలోచనలు కొంటెగా ఎక్కడికెక్కడికో వెళ్లాయి తన విమాన ప్రయాణంలో.

ఆ రోజంతా యూనివర్సల్ స్టూడియోలో వింతలు, విశేషాలు చూసి, మానవుడి మేధస్సుకి, కళాత్మక విలువలకి అబ్బురపడ్డాడు యమధర్మరాజు. ఒక మంచి రెస్టారెంటులో సుష్టుగా భోంచేసి, తనకు బాగా ఇష్టమయిన హిమక్రీములని ఆరగించి తన హొటల్ సూట్కి వెళ్లి హాయిగా నిద్రపోయాడు యమధర్మరాజు.

యమధర్మరాజు దగ్గర ఉన్న వజ్రవైఢ్యూరాలని ఎలా తన స్వంతం చేసుకోవాలో ఆలోచిస్తూ నిద్రపోలేక పోయింది చిత్రగుప్తి తన హొటల్ రూమ్లో.

★ ★ ★

ఉదయం నిద్రనుండి లేచిన యమధర్మరాజుకి మనసు చాలా ప్రశాంతంగా ఉంది. యూనివర్సల్ స్టూడియోలో చూసిన వింతలు విశేషాలు, మనసులో గిలిగింతలు పెడుతున్నాయి.

"ఆహా... మానవుడి మేధస్సు రోజు రోజుకీ ఎంత కొత్తగా ఆలోచిస్తుంది? ఎన్ని గమ్మత్తులు, జిమ్మిక్కులు సృష్టిస్తున్నాడు" మనసులోనే ఎన్నోసార్లు అనుకున్నాడు యమధర్మరాజు.

తన మనసంతయూ పుష్పకవిమానంతో నిండిపోయింది. దాన్ని ఎలా యమపురికి తీసుకుపోవాలా అని ఆలోచిస్తున్నాడు. మానవుడు అనుభవిస్తున్న ఈ భోగభాగ్యాలని తాను కూడా నరకంలో ఎలా అనుభవించాలన్న విషయం కలవరపెడుతుంటే ప్రశాంతంగా ఉండలేకపోతున్నాడు యమధర్మరాజు.

అప్పుడే వచ్చిన చిత్రగుప్తి యమధర్మరాజుకు నమస్కరించి ఆఫీసు రూంకి వెళ్ళింది నేరుగా. కంప్యూటర్ సిస్టంపై కూర్చుంది ఆఫీసు రూంలో. ఇంతకు ముందు సర్చ్ చేసి ప్రింట్ చేసిన వివరాల హిస్టరీ డిలీట్ చేసింది.

"చిత్రగుప్తీ!" పిలిచాడు యమధర్మరాజు

"స్వామీ" అని వచ్చింది చిత్రగుప్తి.

"మీరు ఏమి చేస్తున్నారు?" అన్నాడు ప్రశాంతంగా

"ప్రజల తప్పుల చిట్టా తయారు చేస్తున్నాను స్వామీ" అంది.

"భేష్ చిత్రగుప్తీ!" అని కాఫీ టేబుల్ పై పెట్టిన బ్రేక్ఫాస్ట్ తింటూ ఇంకో చేతిలో 'స్టార్ బక్స్' కాఫీ సేవిస్తూ కిటికీలో నుండి బయటకు చూస్తున్నాడు. పక్కనే ఎయిర్ పోర్టులో ఎన్నో విమానాలు ఆగి ఉన్నాయి.

"విమానంలో కూర్చుని ఆకాశంలో విహరిస్తూ విజయగర్వంతో మీసాలు మెలివేస్తూ యమపురిలో దిగుతుంటే, ఇంద్రుడు అసూయతో స్వర్గం నుండి చూస్తుంటే.." చాలా మత్తుగా, గమ్మత్తుగా అందమైన ఊహలతో ఉక్కిరి బిక్కిరి అయ్యాడు యమధర్మరాజు.

★ ★ ★

వారం రోజుల తర్వాత :

చిత్రగుప్తి పనితీరుతో యమధర్మరాజు చాలా సంతోషంగా ఉన్నాడు. అంతలోనే వెస్ట్ కోస్టును ఒక పెద్ద గాలి తుఫాను చుట్టు ముట్టింది. విద్యుత్ స్తంభాలు, చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ సరఫరా ఆగిపోయింది. విమానాలు ఎక్కడివక్కడే అయిపోయాయి.

ఎంతో హడావిడిగా, కన్నుల పండువగా ఉన్న హాలీవుడ్ ప్రాంతం ఒక్కసారిగా నిర్మానుష్యం అయ్యింది. ఎటూ చూసినా చిమ్మ చీకటి. హొటల్లో జనరేటర్ పై ఎమర్జెన్సీ లైట్లు మాత్రమే వెలుగుతున్నాయి. ఏ/సి పూర్తిగా నిలిపి వేయబడింది. ఉక్కబోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు యమధర్మరాజు. రాత్రి అసలే నిద్ర పట్టలేదు. ఉదయం నిద్రపట్టే సమయంలో దేవేంద్రుల వారి నుండి కబురు వచ్చింది. నరక ద్వారం వద్ద ఎవరూ లేక పోవడంవల్ల ప్రతి ఒక్కరూ వచ్చి స్వర్గపు తలుపులు కొడుతూ ఇబ్బంది పెడుతున్నారని సమాచారం. హడావిడిగా లేచి చిత్రగుప్తి కోసం ఎదురు చూస్తున్నాడు.

"చిత్రగుప్తీ, ఏమిటీ ఈ వైపరీత్యము?" వచ్చీ రాగానే చాలా కోపంగా అడిగాడు యమధర్మరాజు

"ప్రకృతి వైపరీత్యము స్వామీ" అన్నది అమాయకంగా ముఖంపెట్టి.

"దేవేంద్రుల వారి నుండి ఆజ్ఞ. వెంటనే నాకు వారందరి చిట్టా తీసుకురండు" అని చిత్రగుప్తి చేతిలో అంజనం వేసి చూయించాడు స్వర్గద్వారం వద్ద ఎదురుచూస్తున్న వారిని.

"సరే స్వామీ" అని తన ఆఫీసు రూమ్ లోకి వెళ్లిన తర్వాత కానీ గుర్తుకు రాలేదు ఇంటెర్నెట్ లేదు అనే విషయం.

సెలెబ్రిటీస్ వివరాలు అయితే తీసుకురాగల్గింది కానీ ఇప్పుడు ముక్కూ మొఖం తెలియని వారి వివరాలు ఎలా తీసుకురావాలో అర్థం కాలేదు. ఒళ్ళంతా చెమటలు పట్టేసాయి చిత్రగుప్తికి. అసలే యమధర్మరాజు చాలా కోపంగా ఉన్నాడు. ఏమి చెయ్యాలో అర్థం కాలేదు.

"చిత్రగుప్తీ!" అరిచాడు కోపంగా...

"వస్తున్నా స్వామీ!" అని హఠాత్తుగా హాట్స్పాట్ గుర్తుకు వచ్చి ఓపెన్ చేసి

ఇంటర్నెట్ ద్వారా ఎవరివో కొన్ని వివరాలు తీసుకుంది. అప్పటికే కొన్ని వివరాలు యమధర్మరాజు తన మహిమతో తెప్పించాడు. ఎట్టి పరిస్థితిలో తను దొరికిపోయేది ఖాయం అని నిర్ధారించుకుంది. ఆ చిట్టాని యమధర్మరాజు చేతిలో పెట్టింది. ట్రంకు పెట్టిలో దాచిన వజ్రాల మూట మొత్తాన్ని తన హాండ్ బ్యాగ్‌లో సర్దుకుని యమధర్మరాజుకి కనపడకుండా పారిపో యింది అక్కడినుండి.

యమధర్మరాజు ఒక్కొక్కరి చిట్టాను పరిశీలిస్తున్నాడు. ఎందుకో అనుమానం వచ్చింది. తన పాశం గాల్లో ఆడించి శ్లోకం చదివి చిట్టా తెప్పించాడు నరకలోకం నుండి. చిత్రగుప్తి చిట్టాతో పోల్చి చూసాడు. అసలే వివరాలు సరిపోలేదు. వెంటనే ఇంకొక చిట్టా తెప్పించారు. అది కూడా సరిపోలేదు. వెంటనే అన్ని చిట్టాలు పోల్చి చూస్తే అన్నీ నకిలీ చిట్టాలు అని తెలిసిపోయింది.

"చిత్రగుప్తీ! అని కోపంతో రంకెలేశాడు యమధర్మరాజు. ఎలాంటి అలజడి లేక పోవడంతో చుట్టూ కలియదిరిగాడు. ఎక్కడా చిత్రగుప్తి జాడ కనిపించలేదు. ట్రంక్ పెట్టె తెరచి చూస్తే ఒక వజ్రం కూడా లేదు. విషయం పూర్తిగా అర్థం అయ్యింది యమధర్మరాజుకి.

"యముండ!" ఆవేశం ఆపుకోలేక అరిచాడు. ఆ అరుపులకి హోటల్ భవనము మారు మ్రోగిపోయింది.

"చిత్రగుప్తీ, మమ్ములనే మోసం చేస్తావా? నీవు అంతకంతకు శిక్ష అనుభవవిస్తావ్!" అని తన కోపాన్నివెళ్లగక్కాడు.

"పూర్తిగా నమ్మిన మనుషులే ఇలా మోసం చేస్తే.. పాపం ఆ చిత్రగుప్తుడి పరిస్థితి ఏంటో?" మనసు చిత్రగుప్తుని పైకి మళ్లింది యమధర్మరాజుకి.

బట్టలన్నీ చినిగి, మాసిన గడ్డంతో ఉన్న చిత్రగుప్తుడు నయాగరా ఫాల్స్‌లో ఉన్నాడు. చిత్రగుప్తుడి దగ్గర ఉన్న ధనాన్నిచూసి, ఫ్లోరిడా క్యాసినోలో ఎవరో మోసం చేసి నయాగరా ఫాల్స్‌ని అమ్మి ధనమంతా దోచుకున్నారు.

"ఇది నేను కొన్నాను, అందరూ నాకే పైకం ఇవ్వండి" అని టికెట్ కౌంటర్ దగ్గర సెక్యూరిటీ సిబ్బందితో గొడవపడటం కనిపించింది యమధర్మరాజుకి.



**"చిత్రగుప్తా, మనుషుల్లో అక్కడక్కడా మంచి వారు కూడా ఉంటారు. అలాంటి వారు ఒక్కరయినా కనపడక పోతారా అని చూస్తున్నాను. అదిగో ఆ గళ్ళ చొక్కా యువకుడిని చూడుము. వారి కళ్ళలో నేను జాలిని చూసితిని. వారు మన దున్నపోతుని ముందుకు తోసినట్టు నటిస్తున్నారు కానీ దున్నపోతు కళ్ళలో దుఃఖాన్ని చూస్తున్నాడు.**

వెంటనే గాల్లో తన పాశాన్ని ఆడించి ఒక శ్లోకం చదివి చిత్రగుప్తుని సెక్యూరిటీ గార్డుల చేతుల్లో నుండి తన దగ్గరికి రప్పించాడు. అసలు విషయం చెప్పి నువ్వు, నేను మోసపోయాము అని చెప్పాడు యమధర్మరాజు. అంతా తెలుసుకొని తన బుద్ధి తక్కువ పనికి క్షమించమని యమధర్మరాజు కాళ్ల పై బడ్డాడు చిత్రగుప్తుడు. చిత్రగుప్తి చేతిలో తాను మోసపోయిన తీరుని కూడా చెప్పి తర్వాత తన మహిమతో చిత్రగుప్తునికి పూర్వ వైభవం తెప్పించాడు యమధర్మరాజు.

"స్వామీ, ఇదేదో భూతల స్వర్గం అని వస్తే భూతాల స్వర్గంలా దొరికినోళ్ల దొరికినంత దోచుకున్నారు స్వామీ! ఈ భూలోకంలో ఒక్క మంచివాడు కూడా లేడా?" అన్నాడు దించిన తలను పైకి ఎత్తకుండా చిత్రగుప్తుడు.

"ఎందుకు లేరు. ఎక్కడో ఒక దగ్గర ఉండే ఉంటారు. చూద్దాం మనకు కనపడక పోతారా?" అని వెంటనే ఏదో గుర్తుకు వచ్చినట్టు తలను చూపుడు వ్రేలుతో కొట్టుకొని "అయ్యో! పుష్పక విమానం మోజులో పడి దున్నపోతుని మర్చిపోయానే. అది ఎక్కడుందో చూడాలి" అని తన మహిమతో మహిషం ఎక్కడుందో చూసాడు.

గొడ్డు మాంసం వ్యాపారికి ఎవరో అమ్మి వెళ్లారు. దాని శక్తిని అంచనా వేయని అక్కడి కసాయి ఉద్యోగులు దాన్ని ఒక యంత్రం పైకి ఎక్కించడానికి ప్రయత్నిస్తున్నారు. అప్పుడే యమధర్మరాజుకి చిత్రగుప్తుడు అడిగిన ప్రశ్న గుర్తుకు వచ్చింది.

మహిషం మహిమలన్నీ తీసేసాడు యమధర్మరాజు. అక్కడి కసాయి మనుషులు చాలా దున్నపోతులని మిషన్ వైపు తోస్తున్నారు. యమధర్మరాజు దున్నపోతు మాత్రం ముందుకు పోవడానికి మారాం చేసింది. అందరూ తోస్తున్నారు. తన శక్తినంతా ఉపయోగించింది కానీ ఆ మానవ శక్తి

కథ

ముందు ఓడిపోయింది. చివరికి జాలిగా ఎవరన్నా రక్షించలేక పోతారా అన్నట్టు చుట్టూ చూసింది.

"స్వామీ, అలా చూస్తూ నిలబడ్డారు. మన మహిషాన్ని సంహరించదానికి ఆ ముష్కరులు ప్రయత్నిస్తున్నారు. దాన్ని రక్షించండి" ఆందోళనగా అన్నాడు చిత్రగుప్తుడు.

"చిత్రగుప్తా, మనుషుల్లో అక్కడక్కడా మంచి వారు కూడా ఉంటారు. అలాంటి వారు ఒక్కరయినా కనపడక పోతారా అని చూస్తున్నాను. అదిగో ఆ గళ్ళ చొక్కా యువకుడిని చూడుము. వారి కళ్ళలో నేను జాలిని చూసితిని. వారు మన దున్నపోతుని ముందుకు తోసినట్టు నటిస్తున్నారు కానీ దున్నపోతు కళ్ళలో దుఃఖాన్ని చూస్తున్నాడు. చూడు వారు ఎంత ప్రేమగా దున్నపోతుకి ధైర్యం కలిగిస్తున్నారో! అని ఆ యువకుడిని చిత్రగుప్తుడికి చూపుతారు యమధర్మరాజు.

"అవును స్వామీ, నేను కూడా గ్రహించాను. కసాయి వారిలో కూడా మంచి వారు ఉంటారనే విషయం అర్థమయ్యింది ఈ రోజు" అన్నాడు చిత్రగుప్తుడు.

"అవును చిత్రగుప్తా! మనుషులే ఇతర మనుషులకు మోసాలు చేస్తుంటే, ఇంకో వైపు మనుషులపట్లే కాక మూగ జంతువుల పట్ల కూడా దయతో మసులుకునే మనుషులు ఎక్కడో ఒకరు ఉంటారు" అన్నాడు కొంత ఉద్వేగంగా.

దున్నపోతుకు పూర్తి శక్తులు తిరిగి ప్రసాదించాడు యమధర్మరాజు. వెంటనే దున్నపోతు ఒక్క ఉదుటున తన కట్లని తెంచుకుని, ఆ ఒక్క యువకుడిని తప్ప అందరినీ కుమ్మి అక్కడి నుండి సురక్షితంగా బయటపడి యమధర్మ రాజుని చేరింది.

ఇప్పుడూ తన పరివారం అంతా తన దగ్గరికి చేరినందుకు చాలా సంతోషంగా ఉంది యమధర్మరాజుకి.

"చిత్రగుప్తా, నిన్నటి వరకూ ఎంతో అంగరంగ వైభోగంగా ఉన్న ఈ ప్రాంతం, ప్రకృతి కన్నెర్ర చేస్తే ఎంత కకావికలం అయ్యిందో చూడు? ఆ పుష్పక విమానం కూడా పైకి ఎగరకుండా ముడుచుకుని కూర్చుంది. ఇలాంటి తాత్కాలిక సుఖాలు మనకు వద్దు. మన మహిషమే మనతో పాటు చివరి వరకూ వచ్చేది. మనుషులపై మనుషులకు నమ్మకం లేని ఈ భూతల స్వర్గాలు మనకు వద్దు! మన నరకమే మనకు స్వర్గం" అని దున్నపోతుపై ఎక్కి యమపురి వైపు పయనమయ్యాడు యమధర్మరాజు, చిత్రగుప్తునితో కలిసి సంతోషంగా!

కవిత

# దండోర జెండా



**- జూపాక సుభద్ర**

ఓరుగల్లు, ఒంగోలుకు బోయి
తోలుకొచ్చుకున్న వేలుముడి వెన్నెల
ఆ సూపు రూపుల సెలిమల కోసం
నా కండ్ల ఎన్ని ఎడారులను
ఆలింగనం చేసుకోవాల్సి వచ్చిందో
సీకటి సుట్టిన నా గుండె గుడిసెలకి
వురికొచ్చిన అరికిల్ల దండెమ్
ఆ ఎండపొడ కండ్ల పలకరింపులకు
నా మనసంతా నల్ల తామెర్లు అల్లుకున్న
సెరువు దునికిన అలుగు
నా దిగులు పోగల మంగులమ్ పెంకల
పూయించిన పేలాల మెరుపు
మా అవ్వ జేసిన తెల్లజొన్న
రొట్టోలె నవ్వి నా కలలకు పిండి
ఆరబోసిన సందమామై
ఇల్లు అలుకని నా కలలకు ముగ్గేసిన ముద్దు
నా సాహిత్య సామాజిక మక్కజొన్న సేనుకు
మంచె మీని పొద్దు
వేలమందిలో ఎక్కడున్నా ఆ పోకడ
ఉడుకుతున్న సియ్యాల గుమ గుమ
ఉద్యమ తొవ్వల్ల కలిసిన తొలకరి సినుకు
సొదల పదాలను మెద కట్టుట్ల మోతుబరి
అక్షరాలని ఆసువుగా
ఆకాశం లో ఆడించి
కైతమ్మ వొడి నింపినా
వేలు తెగిన విలుకాడు
రెక్కలు ముక్కలైన బాల్యం
బతుకు దెరువును బండలు చేసుకొని
ఎర్రంచులో ఎగిరి
నీలి నీలమైన
దండోరా జెండాకు జేజేలు.

(కృపాకర్ మాదిగ కోసం)

కవిత

# వేమన గ్రంథాలయం



వనపట్ల సుబ్బయ్య

అతను పుస్తకాలను
ప్యాంటు బుషోటుగా తొడుక్కున్నందుకేమో
గదినిండా జ్ఞాన గంధం
ఆ ఇల్లు నడుస్తున్న విజ్ఞాన క్షేత్రం

చెట్టు
గంగరేగుపండ్లను తెంపిచ్చినట్లు
ఒక్కొక్క కావ్యాన్ని చేతికిస్తున్నడు
నాకు మా నాయిన తయిదకంకుల్ని నలిచి
అంగి కీసలో పోసినట్లుంది

ఇటుకలు
సిమెంట్, స్టీలు లేకుండా
అక్షరాలనే కంకర మాల్ కలిపి పునాది కట్టినట్లుంది
అల్మారాలు సజ్జలు గోడలు
విభిన్న గ్రంథాలతో నవ్వుతున్నవి
ఆ ఇల్లు వెలుగు పూలతోట

ఆకాశం
నక్షత్రాలను పరుచుకున్నట్లు
రూములనల్లుకున్న పుస్తకాల కట్టలు
యాభైవేల జ్ఞానదీపాలు
దొంగలు దోయలేని బంగారాలు
ఒక్కో సంకలనం ఒక్కో చరిత్ర

ఏ పూట
ఎవరు ఆ ఇంటికెల్లినా
తినగలిగినంత వచనాలు
తొవ్వుకోవాల్సినంత పరిశోధనలు
తాగవలసినంత శతకాలు
తరించాల్సినంత నవలలు
తలకెత్తుకోవాల్సినంత చరితలు
పులకరించే అనువాదాలు
ఏ దావత్ ల తిన్నా
అంత కడుపునిండదేమో !

పరిశోధనలు
పదునుపెట్టే కొత్త పాళీలకు
సకల సౌకర్యాలతో మూడంతస్థుల భవనం
జ్ఞానాన్ని ధారపోసే
విశాల సహృదయత

ఇంటిముందొక మహా వృక్షం
పచ్చగా పుస్తకాలతో కాపుకాసింది
ఆ కావ్యాలు భావితరాలకు జ్ఞాన కాగడాలు
వర్తమానంలో సృజనకు దారులు
తాతల తండ్రుల ఆత్మలు
పూర్వీకుల జ్ఞానదానాలు

ఒక్క పుస్తకం
వెయ్యి రాకెట్టులపెట్టు
అజ్ఞానాన్ని తొలగించే అక్షరనిధి
ఆ గ్రంథాలయం
ప్రతికవికి ఓ కల్పవృక్షం !

ఇప్పుడు
తీర్థ యాత్రలు బదులు
విజ్ఞాన యాత్రలవసరం
గ్రంథాలయాల సందర్శన అత్యంత అవసరం
మళ్ళీమళ్ళీ పోదాం
యోగి వేమన జ్ఞాన గ్రంథాలయం
డాక్టర్ ఎన్. గోపిసార్ ఇంటికి!



వ్యాసం

# భండారు అచ్చమాంబ - స్త్రీ సంస్కరణ

అచ్చమాంబ సంస్కరణా దృక్పథం తెలియజేస్తూ....



డా॥ వి.త్రివేణి

అనాదిగా మూసపద్ధతిలో కొనసాగుతున్న స్త్రీల జీవితాలలో మార్పును ఆశిస్తూ ఒక సమిష్టి ప్రాతిపదిక దృష్టితో 'సంస్కరణవాదం' ఆరంభం అయింది. స్త్రీలలో అంతర్గతంగా ఉన్న అసంతృప్తులకు, అణగారి ఉన్న ఆలోచనలకు ఒక చక్కటి అవకాశాన్ని కలిగించింది. స్త్రీల సమస్యలను గుర్తిస్తూ, స్త్రీల అభివృద్ధిని కాంక్షిస్తూ సంస్కరణ వాదం బలోపేతమైంది. కుటుంబం ఒక సామాజికరంగంగా పరిణమిస్తున్న ఆ క్రమంలో స్త్రీలను సమాజంలో అంతర్భాగం చేసింది. స్త్రీలలో చైతన్య స్థాయిని పెంపొందించడానికి స్త్రీ విద్యావశ్యకతను నిర్ణయించడం సంస్కరణవాదం లక్షణాలలో మొదటి అంశంగా రూపుదిద్దుకుంది.

తెలుగుదేశమంతటా విస్తరించి ఉన్న బాల్య వివాహాలు, బాల వితంతువులు, సాంఘిక పరమైన కట్టుబాట్లు, కన్యాశుల్కం, అవిద్య మొదలైన అంశాలు స్త్రీల జీవితాలను దుర్భరం చేశాయి. ఈ బాల్యవివాహాల పద్ధతి వల్ల కన్యాశుల్కం ఏర్పడి, దానివల్ల వైధవ్యం, వ్యభిచారం వంటి అవినీతి చర్యలు, శిశుహత్య వంటి క్రూర చర్యలు ప్రారంభం అయ్యాయి. స్త్రీల అభ్యుదయాన్ని కాంక్షిస్తూ అభివృద్ధి పథంలో నడుస్తున్న సంస్కరణ భావాలు వాస్తవిక జీవితాల్లో మార్పు తీసుకొని రావాలన్న ఆకాంక్షతో ఆచరణలో కార్యరూపాన్ని అనుసరించాయి. భారతదేశచరిత్రలో సంస్కరణోద్యమానికి ప్రముఖ స్థానం ఉంది. 19వ శతాబ్దంలో ఆరంభమైన సంస్కరణోద్యమం ద్వారా మత, సాంఘిక, రాజకీయ పరిణామాలు ఏర్పడ్డాయి. తొలిదశలో సతీ సహగమనాన్ని, కన్యాశుల్కాన్ని తీవ్ర సమస్యలుగా భావిస్తూ వ్యతిరేక ఉద్యమాలు బయలుదేరాయి. సతీసహగమనం నిషేధ చట్టం వరకు కొనసాగితే; కన్యాశుల్కం - దాని కాలం అంతరించేంత వరకు ఉద్యమించింది. ఇటువంటి సంస్కరణ భావాలను తొలి తెలుగు కథారచయిత్రి భండారు అచ్చమాంబ చాలా స్పష్టంగా వెల్లడించారు. అచ్చమాంబ ప్రాచీనమైన సతీ ధర్మాలతోపాటు నవీన పాశ్చాత్య విద్యా సంస్కారాలను కలబోసి ఒక నూతనమైన పద్ధతిలో రచనా వ్యాసంగాన్ని ఆరంభించారు. భండారు అచ్చమాంబ 19వ శతాబ్ది అంతంలో, 20వ శతాబ్ది ప్రారంభంలో స్త్రీల జీవితాలను సంస్కరణాత్మక దృష్టితో ప్రతిబింబిస్తూ దాదాపు 12 కథలు రచించారు. కందుకూరి వంటి సంస్కర్తల భావాలతో ప్రభావితమైన అచ్చమాంబ స్త్రీ చైతన్యంకోసం 'బృందావనీ స్త్రీ సమాజము' పేరుతో స్త్రీల సమాజాన్ని స్థాపించారు. సంఘ సేవకురాలిగా, కథా రచయిత్రిగా పేరుగాంచిన అచ్చమాంబ 'అబలా సచ్చరిత్ర రత్నమాల' అనే గ్రంథాన్ని రచించి ప్రసిద్ధ భారతీయ స్త్రీల ప్రగతిని, ప్రతిష్ఠను కీర్తించారు. ఆదర్శ మహిళగా మాటలో సూటిదనం, దయాగుణం, జాతీయభావం అభివ్యక్తమవుతాయి.

**తొలి తెలుగు కథా రచయిత్రి...**

భండారు అచ్చమాంబను తొలి తెలుగు కథారచయిత్రిగా పేర్కొంటూ ప్రముఖ విమర్శకులు, పరిశోధకులు వెలిబుచ్చిన అభిప్రాయాలను తెలుసుకుందాం.

1. 'హిందూ సుందరి' పత్రికలో 1902లో అచ్చయిన 'స్త్రీ విద్య' కథను ప్రస్తావిస్తూ 'నూరేళ్లపంట' కథా సంకలనంలో భార్గవీరావు గారు ముందుమాట రాస్తూ - '1902లోనే బందరులో తొలి మహిళా సమాజాన్ని బృందావన స్త్రీ సమాజాన్ని స్థాపించిన అచ్చమాంబగారు మొదటి రచయిత్రి అని గర్వంగా చెప్తూ వారి రచన 'స్త్రీ విద్య'ను మొదటి కథగా వేసుకున్నాము. గురజాడ వారి 'దిద్దుబాటు' మొదటికథ అనుకోవడం పొరబాటని సవినయంగా మనవి చేస్తున్నాము' అని నిర్ధారించారు. ఇతివృత్త నేపథ్యాన్ని బట్టి చూసినా ఈ రెండు కథల్లో స్త్రీ విద్య ప్రధానంగా ఉండటం విశేషం.

వ్యాసం

2. 'హిందూసుందరి' పత్రికలో 1902 నవంబరులో అచ్చయిన అచ్చమాంబ కథ 'ధన త్రయోదశి'ని వివరిస్తూ ప్రముఖ స్త్రీవాద పత్రిక భూమిక సంపాదకీయంలో కొండవీటి సత్యవతి 'తెలుగు సాహిత్య చరిత్రలో ఆనాటి రచయిత్రులకు జరిగిన అన్యాయం అంతా ఇంతా కాదు. తెలుగులో తొలి ఆధునిక కథ రాసిన భండారు అచ్చమాంబకు జరిగిన అన్యాయం గురించి కె.లలిత బయటపెట్టే వరకు ఎవరికీ తెలియదు. 1902లోనే 'ధన త్రయోదశి' కథ రాసిన భండారు అచ్చమాంబను వెనక్కి నెట్టేసి 1911? (1910)లో గురజాడ రాసిన దిద్దుబాటు తొలి ఆధునిక కథగా సాహిత్యకారులు స్థిరీకరించారు' అని ఆవేదన వ్యక్తం చేశారు.

3. కథానిలయం ట్రస్ట్ వారు 2008లో 'తొలి తెలుగు కథలు - ఏడు అభిప్రాయాలు' అనే పుస్తకంలో అచ్చమాంబ కథలను ప్రచురించింది. ఇందులో మొదటి రెండు కథలు 1902లోనే అచ్చమాంబ రాసినవి 'ధన త్రయోదశి, స్త్రీవిద్య'. వీరి నివేదికను బట్టి తొలి తెలుగు కథా రచన చేసినవారు అచ్చమాంబయే అని పేర్కొనవచ్చు.

4. 2009, జూలై 13న ఆంధ్రజ్యోతి పత్రిక 'వివిధ' సాహిత్య వేదికకు రాసిన వ్యాసంలో డా. ముదిగంటి సుజాతారెడ్డి 'తెలంగాణ నుంచే తొలి కథానిక' అని చెబుతూ భండారు అచ్చమాంబ 1898 నుంచే కథా రచనారంభం చేశారని, ఆమె రాసిన 'ప్రేమ పరీక్షణము' 'ఎరువు సొమ్ము పరువు చేటు' కథలు రాయసం వేంకట శివుడు నిర్వహించిన 'తెలుగు జనానా' పత్రికలో అచ్చయ్యాయని, కాని ఇంకా ఆ పత్రికా సంచికలు దొరకవలసి ఉందని తెలియజేశారు. 1901 నుంచి 1904 వరకు సేకరించిన అచ్చమాంబ పది కథలను సంగిశెట్టి శ్రీనివాస్ 'భండారు అచ్చమాంబ - తొలి తెలుగు కథలు' అనే పేరుతో గ్రంథ రూపంలో వెలువరిస్తున్నారని స్పష్టం చేశారు.

5. 2010లో సంగిశెట్టి శ్రీనివాస్ 'భండారు అచ్చమాంబ - తొలి తెలుగు కథలు' అనే పేరుతో అచ్చమాంబ రాసిన పదికథలను గ్రంథరూపంలోకి తీసుకొచ్చారు. 1. గుణవతియగు స్త్రీ, 2. లలితా శారదులు, 3. జానకమ్మ, 4. దంపతుల ప్రథమ గృహం, 5. సత్పాత్రదానము, 6. స్త్రీ విద్య, 7. ధన త్రయోదశి, 8. భార్యాభర్తల సంవాదము, 9. అద్దమును సత్యవతియు, 10. బీద కుటుంబము కథలను ఈ పుస్తకంలో ప్రచురించారు. ఇంకా రెండు కథలు 'ప్రేమ పరీక్షణము, ఎరువుసొమ్ము పరువుచేటు' రాయసం వేంకటశివుడు నిర్వహించిన 'తెలుగు జనానా' పత్రికలో అచ్చయ్యాయని, ఇంకా ఆ కథలు దొరకవలసి ఉందని పేర్కొన్నారు.

ఆధునిక సాహిత్యంలో కథ వచన ప్రక్రియగా ఒక ప్రత్యేకమైన రూపాన్ని ధరించి, సుస్థిరమైన స్థానాన్ని సంపాదించుకొంది. ఇరవయ్యో శతాబ్దిలో ఆరంభమైన కథా ప్రక్రియకు వందేళ్ళకు పైబడి చరిత్ర ఉంది. తెలంగాణ కథ భండారు అచ్చమాంబతో ప్రారంభం అవుతుందని, నూట ఇరవై ఏండ్ల చరిత్ర తెలంగాణ కథకుందని ప్రముఖ తెలంగాణ రచయిత్రి డా. ముదిగంటి సుజాతారెడ్డి స్పష్టం చేశారు. భండారు అచ్చమాంబ జననం తెలంగాణ ప్రాంతం కావటం, తొలి తెలుగు కథలు రాయటం, అందులోను ఆమె మహిళ కావటం గమనార్హం. కావున తెలంగాణ (తెలుగు) తొలితరం కథా రచయిత్రుల చరిత్ర భండారు అచ్చమాంబతోనే ఆరంభమవుతుంది. ఆధునిక తెలుగు కథా సాహిత్యంలో గురజాడ కథను, సాంఖ్యాయన కథలను పూర్వపక్షం చేస్తూ తెలంగాణ పరిశోధకులు, విమర్శకుల ద్వారా అచ్చమాంబ కథలు మొదటి స్థానంలో నిలిచాయి. తెలంగాణ కథా సాహిత్యంలోనే కాదు సమస్త తెలుగు కథా చరిత్రలోనూ మొట్టమొదటి రచయిత్రిగా పేర్కొనదగినవారు భండారు అచ్చమాంబ.

భండారు అచ్చమాంబ నైజాం సరిహద్దులోగల మునగాల సంస్థానంలోని నందిగామలో 1874 సంవత్సరంలో జన్మించారు. తల్లిదండ్రులు గంగమ్మ, కొమర్రాజు వెంకటప్పయ్య, సోదరుడు కొమర్రాజు లక్ష్మణరావు; అచ్చమాంబ ఆరేండ్ల వయస్సులో తండ్రి మరణానంతరం తల్లితో, సోదరుడితో తన సవతితల్లి కొడుకైన కొమర్రాజు శంకరరావు ఉంటున్న నల్లగొండ జిల్లాలోని దేవరకొండ ప్రాంతానికి వచ్చారు. ఎనిమిదేళ్ల వయస్సులో 1882లో తన మేనమామ భండారు మాధవరావుతో అచ్చమాంబకు వివాహం జరిగింది. తన భర్త ఉద్యోగం రీత్యా వారి కుటుంబం మారిపోయింది. ఆ సందర్భంలోనే నాగపూర్, దిలాస్‌పూర్ ప్రాంతాలలో వారి కుటుంబం ఉండవలసి వచ్చింది. ఒక ఉపాధ్యాయుడు తమ ఇంటికి వచ్చి సోదరుడికి పాఠాలు బోధించేటప్పుడు పక్కనే కూర్చొని శ్రద్ధగా విని అభ్యాసం చేశారు. అలవోకగా తెలుగు, సంస్కృతం, మరాఠీ, హిందీ, గుజరాతీ భాషలను నేర్చుకొన్నారు. సంప్రదాయాభిప్రాయాలు గల తన భర్త అచ్చమాంబ చదువుకోవడానికి అభ్యంతరం వ్యక్తం చేసినా, ఆయన ఇంట్లో లేని సమయంలో అనేక గ్రంథాలు చదివేవారు. ఆయా భాషల్లో గల అపారమైన సాహిత్యాన్ని ఆకళింపు చేసుకున్నారు. భర్త, సోదరుడితో పాటు ప్రతి సంవత్సరం తెలుగు ప్రాంతాలలో పర్యటించి

**తెలుగుదేశమంతటా విస్తరించి ఉన్న బాల్య వివాహాలు, బాల వితంతువులు, సాంఘిక పరమైన కట్టుబాట్లు, కన్యాశుల్కం, అవిద్య మొదలైన అంశాలు స్త్రీల జీవితాలను దుర్భరం చేశాయి. ఈ బాల్యవివాహాల పద్ధతి వల్ల కన్యాశుల్కం ఏర్పడి, దానివల్ల వైధవ్యం, వ్యభిచారం వంటి అవినీతి చర్యలు, శిశుహత్య వంటి క్రూర చర్యలు ప్రారంభం అయ్యాయి.**

వ్యాసం

ఉపన్యాసాలు, సభలు, సమావేశాలు నిర్వహించేది. ఆమె తన ప్రసంగాలతో మహిళా లోకంలో తిరుగులేని మార్పు తీసుకొచ్చింది.

**పది కథలు - ప్రధానాంశాలు...**

'భండారు అచ్చమాంబ - తొలి తెలుగు కథలు' అన్న సంపుటి ద్వారా పదికథలు మనకు అందుబాటులోకి వచ్చాయి. ఈ కథలోని ప్రధానాంశం స్త్రీ చైతన్యం, స్త్రీ విద్య, అనేక రంగాలలో స్త్రీ అభివృద్ధి - ఆలోచన విశ్లేషణా స్థాయి.

1. గుణవతియగు స్త్రీ - తెలుగు జనానా - 1901, మే సంచిక : ఈ కథలో దశకుమార చరిత్రలో ఉన్న కథను తీసుకొని నేటి జీవన విధానానికి సంబంధించిన కథగా మలిచారు. సంసారాన్ని ఎట్లా పొదుపుగా చేయవచ్చునో ఈ కథలో తెలుస్తుంది. ప్రాచీన కథాంశం అయినా నిత్యజీవనానికి పనికి వచ్చే సారాంశం ఇది. 'గుణవతియగు స్త్రీ' అన్న శీర్షికా నామమే ఇందులో పరమార్థాన్ని బోధిస్తుంది.

2. లలితా శారదులు - తెలుగు జనానా - 1901 : 'లలితా శారదులు' అనే ఇద్దరు స్నేహితుల మధ్యసాగిన వ్యవహారమిది. లలితలో ఈర్ష్యం, గర్వం, దురభిమానం వంటివి కనిపిస్తే, శారదలో మంచితనం కనిపిస్తుంది. అయితే శారద తన సద్గుణాలతో లలితలో మార్పు తేవడానికి ప్రయత్నించడం అనేది ఇందులోని ప్రధానాంశం.

3. జానకమ్మ - తెలుగు జనానా - 1902 : ఈ కథ స్త్రీకి విద్య ఎంత అవసరమో చాటిచెబుతుంది. చదువుకొన్న స్త్రీకి వివాహ సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకావని, కట్నకానుకలు లేకుండానే వరుడు లభిస్తాడని రచయిత్రి ఈ కథ ద్వారా అందించే సందేశం. అందుకే తల్లిదండ్రులు కూతురును బరువుగా భావించకుండా విద్యాబుద్ధులు నేర్పించాలని కోరారు. ఇది పూర్తిగా సంభాషణా ధోరణిలో సాగినకథ.

4. దంపతుల ప్రథమ కలహం - హిందూ సుందరి - 1902 : భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకొని అన్యోన్యంగా జీవించాలని, కుటుంబం మొత్తం సామరస్యపూర్వక వాతావరణాన్ని కల్పించుకోవాలని తెలియజెప్పే కథ. ఇది కూడా సంభాషణా ధోరణిలో సాగింది.



5. సత్పాత్రదానము - హిందూ సుందరి - 1902 : ఈ కథలోని గుడ్డివాని భాష తెలంగాణ యాసలో కనిపిస్తుంది. రచయిత్రి ఈ కథ జరిగిన చోటును హైదరాబాదుగా పేర్కొన్నారు. ఇందులో నిజాం పాలనలోని భూస్వామ్య విధానం, భూమిని కౌలుకు తీసుకొని వ్యవసాయం చేసే నేపథ్యం ఉంది.

6. స్త్రీ విద్య - హిందూ సుందరి - 1902 : ఈ కథ స్త్రీ విద్యావశ్యకతను తెలుపుతుంది. ఇది భార్యాభర్తల సంవాదరూపంలో కొనసాగుతుంది. స్త్రీలు చదువుకోకుండా అజ్ఞానాంధకారంలో ఉన్నట్లైతే మూఢత్వంలో ఉంటారనే విషయాన్ని ఈ కథలో ఒక పురుషపాత్ర ద్వారా రచయిత్రి చెప్పిస్తారు. శాస్త్రాలలో స్త్రీలు చదువుకోకూడదు అనే మాటను ఖండిస్తూ స్త్రీ విద్యాభివృద్ధికోసం పురుషుల ప్రోత్సాహం ఎంతైనా అవసరమని తెలియజేశారు.

7. ధన త్రయోదశి - హిందూ సుందరి - 1902 : ఈ కథలో గల భార్యాభర్తలిద్దరిని స్వయంకృషి మీద విశ్వాసంగల పాత్రలుగా చిత్రించారు. వీరు దారిద్ర్యంలో కొట్టు మిట్టాడుతున్నా ఉదాత్తగుణాలు మాత్రం వీరినుంచి వీడలేకపోవడం అనేది ఈ కథలో కన్పించే విశేషం.

8. భార్యాభర్తల సంవాదము - హిందూ సుందరి - 1903 : 'స్త్రీ విద్య' కథలో లాగానే ఈ కథలో కూడా భార్యాభర్తల సంవాద రూపంలో కథనం సాగింది. స్త్రీలు బంగారు ఆభరణాల కంటే సద్గుణాలనే భూషణాలను ధరించాలని ఈ కథ తెలియచెబుతుంది.

9. అద్దమును సత్యవతియు - హిందూ సుందరి - 1903 : ఈ కథ

**భండారు అచ్చమాంబ నైజాం సరిహద్దులోగల మునగాల సంస్థానంలోని నందిగామలో 1874 సంవత్సరంలో జన్మించారు. తల్లిదండ్రులు గంగమ్మ, కొమర్రాజు వెంకటప్పయ్య, సోదరుడు కొమర్రాజు లక్ష్మణరావు; అచ్చమాంబ ఆరేండ్ల వయస్సులో తండ్రి మరణానంతరం తల్లితో, సోదరుడితో తన సవతితల్లి కొడుకైన కొమర్రాజు శంకరరావు ఉంటున్న నల్లగొండ జిల్లాలోని దేవరకొండ ప్రాంతానికి వచ్చారు.**

వ్యాసం

ద్వారా ఒక చిన్న సంఘటన నుంచి ఒక గొప్ప సందేశాన్ని రచయిత్రి ఉపదేశించారు. ఈ జగత్తంతా ఒక అద్దమని, దాన్ని కోపంగా చూస్తే కోపంగా, సంతోషంగా చూస్తే సంతోషంగా ప్రతిబింబిస్తుందని వర్ణించారు. అతిచిన్న వయస్సుగల మూడు ఏండ్ల సత్యవతి పాత్రను చలాకీగా, సరస సంభాషణగా రచించారు.

10. బీద కటుంబము - సావిత్రి - 1904 : ఈ కథలో స్వయంకృషితో,

**స్త్రీ చైతన్యం కోసం అచ్చమాంబ ఎంతగానో పాటుపడ్డారు. తెలుగు దేశమంతటా పర్యటించి మహిళాభ్యుదయంపైన ఎన్నో ఉపన్యాసాలు చేశారు. బందరులో, కాకినాడలో 'బృందావనీ స్త్రీ సమాజము' పేరుతో స్త్రీల సమాజాన్ని స్థాపించారు. ముట్నూరు కృష్ణారావు, కొండా వెంకటప్పయ్య వంటి వారు ఆమె కృషిని ప్రశంసించారు. గొప్ప సంఘ సేవకురాలుగా పేర్గాంచారు. సమాజ సేవ చేసే క్రమంలో ప్లేగువ్యాధి గ్రస్తులను సంరక్షిస్తూ, అదే వ్యాధికి గురై అచ్చమాంబ 1905లో మరణించారు. తన ముప్పైయేటలోనే అచ్చమాంబ మరణించడం విచారకరం.**



సద్గుణాలతో దారిద్ర్యాన్ని ఎట్లా జయించవచ్చునో తెలుస్తుంది. ఇది ఉత్తమ పురుషలో సాగిన కథనం.

**కథా కథనశైలి...**

అచ్చమాంబ కథల్లో గ్రాంథిక భాష కన్పిస్తున్నా, దీర్ఘ సమాసాలుగాని, జటిల పదాలుగాని ప్రయోగించబడలేదు. కథనం ఆద్యంతం ఆసక్తిగా కొనసాగింది. ఈ కథలు పూర్తిగా సామాజిక నేపథ్యం గలవి. కొన్ని కథల్లో జీవిత సత్యాలుంటే, మరికొన్ని కథల్లో నీతి బోధలున్నాయి. ఇవి వ్యక్తిత్వ నిర్మాణానికి, జీవితార్థానికి పనికి వచ్చే విషయాలు. ఆమె భావాల్లో ఎక్కడా కాలదోషం కన్పించదు. కథాంశం ఆధునిక సామాజిక ప్రయోజనానికి చెందింది. సంభాషణలు అత్యంత సరళ సుందరంగా ఉన్నాయి. కథలన్నింటిలో ప్రథమ పురుషలో కథనం సాగినా పదో కథలో మాత్రం ఉత్తమ పురుషలో సాగింది. ఈ లక్షణం ఆధునిక కథానిక స్వరూప స్వభావానుగుణంగా ఉంది. ఏకాంశ ప్రాధాన్యంతో పాటు, శిల్పం దృష్ట్యా ఎక్కడా విభిన్నత గోచరించదు. భాషలో మాత్రం గ్రాంథికం కన్పించినా, కథా లక్షణాలకు ఎలాంటి ఆటంకాలు కలుగవనే భావించాలి. తర్వాతి కాలంలో గ్రాంథిక భాషలో రచించిన కథా రచయితల (అడవి బాపిరాజు) కథలను కథానికలుగా, రచయితలను కథా రచయితలుగా అభివర్ణించడం జరిగింది. కావున అచ్చమాంబ కథలను కూడా సమగ్ర కథాలక్షణాలతో కూడిన కథానికలుగా స్వీకరించాల్సిన బాధ్యత మనమీద ఉంది. తెలంగాణలో పుట్టి, మహారాష్ట్రలో జీవితం కొనసాగించడం ద్వారా ఆమెలో మిశ్రమ భావజాలం ఏర్పడింది. ఇటు వీరేశలింగం సంఘ సంస్కరణోద్యమం, అటు మహారాష్ట్రలోని జన జాగరణ దేశీయాభిమానం పట్ల ఆమె ప్రభావితురాలయ్యారు. వీటన్నింటికి భిన్నంగా ఆమె కథల్లో తెలంగాణా పదజాలం, తెలంగాణా జీవన విధానం వంటి అంశాలు ప్రతిబింబిస్తాయి.

ఈర్ష్య, గర్వం, దురభిమానం వంటి

**'పురుషుల కంటే స్త్రీలు ఎందులోనూ తీసిపోరు, నిర్లక్ష్యానికి, నిరాదరణకు, అణచివేతకూ గురైన స్త్రీలు లోకజ్ఞానం లేక, విద్యలేక ఇళ్లలో మగ్గిపోయారు అంతే తప్ప శారీరకంగా, మానసికంగా, మేధోపరంగా వారు ఎందులోనూ తక్కువకాదు'. అనే అభిప్రాయాన్ని చాలా స్పష్టంగా, బలంగా వందేళ్ళకు ముందే వెల్లడించారు అచ్చమాంబ. అతి పిన్న వయసులో ఆమె చేసిన కృషి అద్వితీయం. అమోఘం.**

దుర్గుణాలను వదిలి సద్గుణాలను అలవరుచుకోవాలని, స్వయంకృషితో, సోమరితనాన్ని వదిలి దారిద్ర్యాన్ని అధిగమించాలని, పొదుపును పాటించి సంసారాలను సంరక్షించుకోవాలని, భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకొని అన్యోన్యంగా జీవించాలని, కుటుంబం మొత్తం సామరస్య పూర్వక వాతావరణాన్ని కల్పించుకోవాలని రచయిత్రి తన కథల ద్వారా ఉపదేశించారు. ఈ కథల నేపథ్యమంతా సామాజిక చైతన్యాన్ని ఆశిస్తుంది. వ్యక్తిత్వ నిర్మాణానికి (వికాసానికి), జీవితార్థానికి పనికి వచ్చే విషయాలను నీతి బోధకాలుగా, జీవిత సత్యాలుగా వెల్లడించారు. కథా సాహిత్యం ద్వారా సామాజిక ప్రయోజనాన్ని అభిలషించారు.

భండారు అచ్చమాంబ స్త్రీ విద్యావశ్యకతను తెలిపే సంభాషణ స్త్రీ విద్య కథలో లభిస్తుంది. భాషలో సరళతను, భావ ప్రాధాన్యతను ఇందులో ప్రత్యేకంగా గమనించవచ్చు.

"విద్య వలన బుద్ధి వికసించును. అనేక సద్గ్రంథములలోని యమూల్యంబులగు నుపదేశ వాక్యంబులు మనసున నాటి మనుజుల నుదాత్తవంతులనుగా జేయును. వారి యందలి దుర్గుణ పుంజములు పోయి

వ్యాసం

సద్గుణ పరంపర లాస్థానముల లంకరించును. లోకానుభవమును గనుటకు వారలు విశేష యోగ్యులగుదురు. అనేక లోక వార్తల నెఱుగ గలిగిన వారలగుదురు. కొన్నిపుస్తకముల పఠనము వలన మనమునకాహ్లాదము కలుగును. ఇందువలన సంసారము నందలి యసంఖ్యాకములగు దుఃఖముల నొక్కింత మఱిచి జనులానందింపగలరు. విద్యవలన నిట్టి లాభములింకను బెక్కులు కలవు. నీవు పట్టుదలతో చదువునేర్చి కొంత చదువుకొనిన పిదప భోజన శయనాదులనైన నొల్లక చదువునందే యభిరుచి కలిగియుండువని నేను దృఢముగా జెప్పగలను. అన్ని యానందములలో విద్యానందమే శ్రేష్ఠమనిన వాక్యము నిజమని నీవే తెలుసుకొనెదవు. ఇది యిటుండనిమ్ము ప్రపంచము నందెల్లప్పుడును పత్ని పతికి సహాయురాలై యుండవలయును.... ప్రస్తుతము పురుషుల కంటెను స్త్రీలు విశేష జ్ఞాన సంపన్నులగుట యధిక యావశ్యకము, ఏలన నికముందు పుట్టబోవు వారి నున్నత పదవికి తెచ్చుట స్త్రీలయధీనము లోనిదై యున్నది. తల్లి విద్యాహీనము దుర్గుణవతియునైనచో నామెసంతాన మంతయు నటులనే యగుటయు, తల్లి విద్యావతియు సద్గుణవతియునైనచో నామె సంతానము మిక్కిలి యోగ్యతను గాంచగల్గుటయు సహజము.''

(స్త్రీ విద్య - బండారు అచ్చమాంబ).

**తెలంగాణ పదాలు...**

'కౌలు' అనే పదం కేవలం నిజాం రాష్ట్రాంధ్ర ప్రాంతం (తెలంగాణ)లోనే వాడుకలో ఉండేది. భూస్వామ్య విధానం పూర్తిగా తెలంగాణా ప్రాంతంలోనే నిండి ఉంది. దశలవారీగా వ్యవసాయభూమిని రైతు కూలీలు దుక్కి దున్నడమనే పద్ధతి, 'కౌలు' అన్న పదప్రయోగం 'సత్పాత్రదానము' కథలో కనిపిస్తుంది.

'అక్కడ' అనేదానికి బదులుగా 'ఆడ' అని, 'కడుపు నింపుకొనెదరు' అనే బదులు 'పొట్ట నింపుకొనెదరు' అనే మాటలు కేవలం తెలంగాణ మాండలికంలోనే కనిపిస్తాయి. 'కచ్చె' అంటే 'మొండి', 'పూర్వము నీవంటి యొక కచ్చెపిల్ల యుండెను' అని 'దంపతుల ప్రథమ కలహము' కథలోని వాక్యప్రయోగం. కక్షకు వికృతి కచ్చె, కక్ష సంస్కృత నామం. 'కచ్చె' అనేది తెలంగాణ పదం - 'నీయబ్బసొమ్మా' అన్నది కూడా తెలంగాణ పదప్రయోగం. 'ఈ తేప' అంటే 'ఏడాది (సంవత్సర కాలం)', ఉత్త అంటే 'ఏమీ లేక కేవలం' అనే అర్థంలో మనం ఉపయోగిస్తాం. ఇవి అచ్చమైన తెలంగాణ పదాలు.

మాటకు ముందు 'మంచిది' అని వాడటం తెలంగాణ వారికి అలవాటు. ఈ ఊతపద ప్రయోగం అచ్చమాంబ కథల్లో కనిపిస్తుంది. 'మంచిది కాని నేను పంపిన పుస్తకములు నీకు ముట్టినయి గదా!', 'మంచిది మొట్టమొదట నీవు వెక్కిరించి...' ఇందులో 'ముట్టినయి' అనేది తెలంగాణ పదం. 'ఒకసారి'కి బదులు 'ఒకపారి' అని ఉపయోగించారు. 'ఒకపారి' అనే పదం తెలంగాణ వ్యాప్తిలో ఉంది.

ఇక 'వెళ్లుట' అనే దానికి బదులు 'పోవుట' అని వాడటం దాదాపు అన్ని కథల్లో కనిపిస్తుంది. పోయెను, పోవుచుండెను, దగ్గరికిపోయి, అచ్చటికి పోయిన పిమ్మట, పనికి పోవుచుండెను, పోవుచుండగా - అనే రూపాలు ప్రతి కథల్లో ఉన్నాయి. ఈ ఆధారాలన్నింటి ప్రకారంగా తెలంగాణ నుంచే తొలి కథానిక వెలువడిందని, తొలి తెలుగు కథా రచయిత్రి 'భండారు అచ్చమాంబ' అని ధ్రువీకరించి, కథా చరిత్రను తిరగరాయచ్చు.

**స్త్రీల చరిత్రా గ్రంథం...**

నాటి కాలంలో విద్యావంతులైన స్త్రీలు సమాజపు కట్టుబాట్లను, పతివ్రతా ధర్మాలను చాటిచెప్పే వృత్తాంతాలను తీసుకొని రచనలు చేశారు. కాని అచ్చమాంబ అభ్యుదయ మార్గంలో ఆలోచించి, ప్రాచీనమైన పతివ్రతా ధర్మాలతో పాటు నవీన పాశ్చాత్య విద్యాసంస్కారాలను కలబోసి ఒక నూతనమైన పద్ధతిలో రచనా వ్యాసంగాన్ని ఆరంభించారు. అచ్చమాంబ జీవిత చరిత్ర రచించిన పులుగుర్త లక్ష్మీనరసమాంబ, అచ్చమాంబనొక ఆదర్శ మహిళగా అభివర్ణించడంలో ఈ విషయం తెలుస్తుంది. మొసలికంటి రామాబాయమ్మ సంపాదకత్వంలో వెలువడిన 'హిందూ సుందరి' పత్రికలోనూ, పులుగుర్త లక్ష్మీ నరసమాంబ సంపాదకత్వంలో వెలువడిన 'సావిత్రి' పత్రికలోనూ అచ్చమాంబ రచనలు చాలా అచ్చయ్యాయి. అచ్చమాంబ 1901లో రచించిన 'అబలా సచ్చరిత్ర రత్నమాల' అన్న గ్రంథంలో ప్రసిద్ధ భారతీయ స్త్రీల కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపజేశారు. ధీర, వీర వనితల ఉదాత్త చరిత్రల వ్యాస సమాహారం ఇది. ఈ గ్రంథం ఆనాటి మహిళల్లో స్ఫూర్తిని, రచనా ప్రేరణను కలిగించింది. ప్రప్రథమంగా తెలుగు భాషలో స్త్రీల చరిత్రను రచించినవారుగా గణతికెక్కారు. ఆమెలో గల నిర్మొహమాటం, సూటిదనం, జాతీయతాగుణం ఈ గ్రంథం ద్వారా ప్రదర్శితమౌతుంది.

**ఈర్ష్య, గర్వం, దురభిమానం వంటి దుర్గుణాలను వదిలి సద్గుణాలను అలవరుచుకోవాలని, స్వయంకృషితో, సోమరితనాన్ని వదిలి దారిద్ర్యాన్ని అధిగమించాలని, పొదుపును పాటించి సంసారాలను సంరక్షించుకోవాలని, భార్యాభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకొని అన్యోన్యంగా జీవించాలని, కుటుంబం మొత్తం సామరస్య పూర్వక వాతావరణాన్ని కల్పించుకోవాలని రచయిత్రి తన కథల ద్వారా ఉపదేశించారు.**

వ్యాసం

'పురుషుల కంటే స్త్రీలు ఎందులోనూ తీసిపోరు, నిర్లక్ష్యానికి, నిరాదరణకు, అణచివేతకూ గురైన స్త్రీలు లోకజ్ఞానం లేక, విద్యలేక ఇళ్లల్లో మగ్గిపోయారు అంతే తప్ప శారీరకంగా, మానసికంగా, మేథోపరంగా వారు ఎందులోనూ తక్కువకాదు'. అనే అభిప్రాయాన్ని చాలా స్పష్టంగా, బలంగా వందేళ్ళకు ముందే వెల్లడించారు అచ్చమాంబ. అతి పిన్న వయసులో ఆమె చేసిన కృషి అద్వితీయం. అమోఘం.

ఆమె జీవించింది ముప్పయ్యేళ్ళు. ఊహ తెలిసి, లోకం పోకడ తెలుసుకునే సరికి పదిహేనేళ్ళు పడుతుంది. మిగతా పదిహేనేళ్ళకే ఒక బృహత్ప్రణాళికకు రూపమివ్వడం మామూలు విషయం కాదు. 'అబల సచ్చరిత్ర రత్నమాల' అనే గ్రంథం మూడు సంపుటాలుగా వెలువరించాలని ఆమె అనుకున్నారు. భారతీయ మహిళా రత్నాల జీవిత చరిత్రలు మొదటి సంపుటంలో పొందుపరిచారు. వేద పురాణాలలోని మహిళల ఔన్నత్యం, రెండవ సంపుటిలో, ఇతర దేశాల మహోన్నత మహిళల గూర్చి మూడవ సంపుటిలో రాయాలనుకున్నారని స్త్రీదరహాసం దోచిన ఇతిహాసం అనే పుస్తకాన్ని రచించిన దేవరాజు మహారాజు తెలియజేశారు. కాని ఆమె ముప్పయవ ఏట అనారోగ్యానికి గురి అయ్యారు. చాలా కాలం వరకు కోలుకోలేని స్థితిలో ఉన్నారు. చివరకు మరణించడం వల్ల ఆమె పథకం పూర్తికాలేకపోయింది. చాలా వరకు విషయ సేకరణ జరిగినా; పరిశోధన, విశ్లేషణ పూర్తయినా రాయాల్సిన దశలో ఆమె కన్నుమూయడం దేశానికి, సమాజానికి ఎంతో లోటు జరిగిందనే చెప్పాలి. ఒక్క సంపుటియే వెలువరించిన ఆమె తొలిచరిత్ర కారిణిగా, తొలి మహిళా చరిత్ర కారిణిగా నిలిచిపోయింది. మొట్టమొదటిసారిగా మహిళల చరిత్రను రికార్డుచేసిన మహిళా చరిత్రకారిణిగా ప్రసిద్ధిచెందారు.

'అబల సచ్చరిత్ర రత్నమాల' మహిళల జీవితాలను ఆవిష్కరించారు. దీనికోసం పంజాబ్, కాశ్మీర్, రాజస్థాన్, గుజరాత్, బెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రా ప్రాంతాలు పర్యటించారు. అక్కడి విశిష్ట మహిళల జీవితాలను గూర్చి ఈ పుస్తకంలో వెల్లడించారు. పండిత రమాబాయి, హర్‌దేవి, కాశీబాయి కనిత్కర్, కమలా సత్యానందన్, కొటికలపూడి సీతమ్మ వంటి వారినెందరినో ఆమె పరిచయం చేశారు. మహిళల జీవితాలను పరిచయడం చేయడంలో అచ్చమాంబ రచన చాలా సరళంగా సాగింది. ఆమె వాస్తవాల్ని చాలా ఖచ్చితంగా నమోదు చేశారని విమర్శకులు, ఇతర చరిత్రకారులూ అభిప్రాయపడ్డారు.

> **"విద్య వలన బుద్ధి వికసించును. అనేక సద్గ్రంథములలోని యమూల్యంబులగు నుపదేశ వాక్యంబులు మనసున నాటి మనుజుల నుదాత్తవంతులనుగా జేయును. వారి యందలి దుర్గుణ పుంజములు పోయి సద్గుణ పరంపర లాస్థానముల లంకరించును. లోకానుభవమును గనుటకు వారలు విశేష యోగ్యులగుదురు.**

## స్త్రీ సమాజం స్థాపన...

ఒకవైపు రచన, మరోవైపు స్త్రీ జనోద్ధరణ జీవిత ధ్యేయాలుగా ఎంచుకున్నారు అచ్చమాంబ. ఓరుగంటి సుందరి రత్నమాంబతో కలిసి 1902లో మచిలీపట్నంలో 'బృందావన స్త్రీ సమాజం' నెలకొల్పారు. తెలుగు ప్రాంతంలో అదే మొదటి స్త్రీ సమాజం! ఒక సంవత్సర కాలంలోనే 1903లో రాష్ట్రం నలుమూలలా తిరిగి, వివిధ ప్రాంతాలలో 'బృందావన స్త్రీ సమాజం' శాఖలు తెరవడానికి కృషి చేశారు. ఆమె ఇంట్లో చదువుకునే అనాథ పిల్లలు ఎప్పుడూ నలుగురైదుగురు ఉండేవారు.

స్త్రీ చైతన్యం కోసం అచ్చమాంబ ఎంతగానో పాటుపడ్డారు. తెలుగు దేశమంతటా పర్యటించి మహిళాభ్యుదయంపైన ఎన్నో ఉపన్యాసాలు చేశారు. బందరులో, కాకినాడలో 'బృందావనీ స్త్రీ సమాజము' పేరుతో స్త్రీల సమాజాన్ని స్థాపించారు. ముట్నూరు కృష్ణారావు, కొండా వెంకటప్పయ్య వంటి వారు ఆమె కృషిని ప్రశంసించారు. గొప్ప సంఘ సేవకురాలుగా పేర్గాంచారు. సమాజ సేవ చేసే క్రమంలో ప్లేగువ్యాధి గ్రస్తులను సంరక్షిస్తూ, అదే వ్యాధికి గురై అచ్చమాంబ 1905లో మరణించారు. తన ముప్పైయేటలోనే అచ్చమాంబ మరణించడం విచారకరం.

## నిలిచిపోయిన రచన ఖన...

అచ్చమాంబ రచనల్లో నేటికీ నిలిచిపోయిన మరో రచన 'ఖన'. ఖగోళ శాస్త్రవేత్త మిహిరుడి భార్య ఖన. ఆమె మిహిరుడంతటి ప్రజ్ఞాశాలి. పురుషాధిక్య ప్రపంచం ఆమెకు సరైన గుర్తింపు నివ్వలేదన్న వ్యథతో అచ్చమాంబ ఎన్నో ఆధారాలు సంపాదించి, పురాతన గ్రంథాలు శోధించి ఖగోళ శాస్త్రజ్ఞురాలైన ఖన జీవితాన్ని వెలుగులోకి తెచ్చారని, స్త్రీ ఆత్మ గౌరవాన్ని ఇనుమడింపజేశారని కొందరు పరిశోధకులు, విమర్శకులు అభిప్రాయపడుతున్నారు.

## అలభ్య రచన - శతకం...

అచ్చమాంబ ఒక శతకం రాశారు. కాని అది ఈ తరానికి అందలేదని దేవరాజు మహారాజు తెలిపారు.

భండారు అచ్చమాంబ నాడు సామాజికంగా ఉన్న అవరోధాలెన్నింటినో దాటారు. ఆధునిక భావజాలంతో రచనా వ్యాసంగాన్ని ప్రారంభించారు. కథా వస్తువులో నవ్యతను తీసుకొచ్చారు. ముఖ్యంగా స్త్రీ చైతన్యాన్ని కాంక్షించారు. అనేక స్త్రీ అభివృద్ధి కార్యకలాపాలలో పాల్గొన్నారు. స్త్రీ స్వేచ్ఛ, స్త్రీ సమానత విద్యతోనే సమకూరుతుందని గ్రహించారు. కథా నిర్మాణంలో ఇదే అంశాన్ని ప్రస్తావించారు. తొలి తెలుగు కథా రచయిత్రిగా నిలిచిపోయారు.

ముఖాముఖి

# నా సాహిత్య యాత్రలో విమర్శకుల నిర్లక్ష్యాన్ని ఎదుర్కొన్నాను... నిఖిలేశ్వర్



డా॥ బాణాల శ్రీనివాసరావు

ఇటీవలే కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన ప్రముఖ తెలుగు (దిగంబర) కవి నిఖిలేశ్వర్. ఆయన సాహితీ ప్రస్థానంలో ఎన్నో మేలు రాళ్లు, మైళ్ళు రాళ్ళు ఉన్నాయి. తంగేడు నిఖిలేశ్వర్‌ని అభినందిస్తుంది. ఆయనతో నేటి కవి బాణాల శ్రీనివాస్‌తో ఈ పక్షం ముఖాముఖి పాఠకుల కోసం....

**మీ సాహిత్య ప్రయాణం కుంభం యాదవరెడ్డి నుంచి మొదలై ప్రముఖ సాహితీవేత్త నిఖిలేశ్వర్‌గా, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన తెలుగు కవిగా నిరంతరం రచనలు చేస్తున్నారు. ఈ 60 సం.ల సాహితీ ప్రయాణంలో మరచి పోలేని తీపి చేదు జ్ఞాపకాలు వివరించండి సార్?**

నా బాల్యమంతా పేదరికంలోంచి తలెత్తుకొని తిరిగే అస్తిత్వ పోరాటంలో గడిచింది. తరుణ వయస్సులోనే నా సాహిత్య ప్రయాణం మొదలై, ఆయా దశల్లో అనేక రకాల తీపి చేదు అనుభవాలు పొందాను. గత ఆరు దశాబ్దాల జీవితానుభవాలను ప్రస్తుతం 'నిఖిల లోకం' శీర్షికన స్వీయ చరిత్ర రాస్తున్నాను.

మీ కోసం కొన్ని మాత్రం వివరిస్తాను. నా సాహిత్యయానంలో మరచిపోలేనివి- దిగంబర కవులు మూడో సంపుటి ఆవిష్కరణ 1968లో విశాఖపట్నంలో



జరిగింది. నేను, నగ్నముని చెరబండ రాజు జ్వాలాముఖి విశాఖ వెళ్ళినపుడు, స్థానికంగా మాకు ప్రసిద్ధ రచయితలు పురిపండా, రావిశాస్త్రి, బలివాడ కాంతారావు, కాళీపట్నం, చలసాని ప్రసాద్ తదితరుల ఆదరణ, స్నేహం లభించింది. తర్వాత 1970 జనవరిలో విశాఖలోనే జరిగిన శ్రీశ్రీ షష్టి పూర్తి ఉత్సవాల సందర్భంగా 'విద్యార్థుల సవాల్' కరపత్రానికి స్పందిస్తూ - అక్కడి పాన్‌గల్ హాలులో సాగిన ఉత్తేజకరమైన చర్చా గోష్టి ఊపునిచ్చింది.

1970 అక్టోబర్ ఖమ్మంలో 'విరసం' ఆవిర్భావ సభలు, 1982లో గుడివాడలో జనసాహితి వార్షిక సదస్సులు నా ప్రయాణంలో ముఖ్యమైన మజిలీలు - ఇక శ్రీశ్రీ గారితో కలిసి పౌర హక్కుల సభల పర్యటన, తర్వాత OPDR పక్షాన శ్రీకాకుళంలో అఖిల భారత స్థాయి నిజనిర్ధారణ కమిటీ అనుభవాలు.. 1969లో కలకత్తాలో నేనూ చెరబండ రాజు పాల్గొన్న అఖిల భారత కవితా సదస్సు, భోపాల్‌లోని భారత్ భవన్, భువనేశ్వర్ కోణార్క్ ఉత్సవాలు, సాహిత్య అకాడమీ నిర్వహించిన ప్రపంచ కవితా దినోత్సవంలో కవితా పఠనం మొదలైనవన్నీ మధుర స్మృతులే! ఇక చేదు జ్ఞాపకాల పుటలు తెరిస్తే - 1971లో హఠాత్తుగా పోలీసులు వచ్చి పి.డి. యాక్ట్ కింద మమ్మల్ని అరెస్ట్ చేసి, సికింద్రాబాద్ జైలులో నిర్బంధించడం -

1973లో తెనాలిలో విరసం కార్యవర్గం సమావేశంలో చారు వర్గీయుల ప్రాబల్యం వల్ల, ఆనాటి ప్రత్యేక సంచికలోని నా సంపాదకీయాన్ని తొలగించారు. అప్పుడు నేను నిరసనగా నా కార్యదర్శి పదవికి రాజీనామా చేసాను. సాహిత్య సాంస్కృతిక ప్రజా సంఘాల ముఠా తగాదాలు - రాజకీయ పంథా విభేదాలు, నన్ను తీవ్రమనస్తాపానికి గురి చేసాయి.

**మీ కుటుంబ నేపథ్యం గురించి చెప్పండి - ఆనాటి మీ రైతాంగ కుటుంబంలో సాహిత్యంతో సంబంధం వున్న వాళ్లు వున్నారా?**

ప్రస్తుతం యాదాద్రి జిల్లాలో వున్న వీరెల్లి (వీరవల్లి)లో నేను 1938లో ఒక పేద రైతు కుటుంబంలో జన్మించాను.

ముఖాముఖి

ఏడాది తిరగానే మా నాన్నను కోల్పోయాను. స్వంతంగా వ్యవసాయం లేనందువల్ల మా అమ్మ కుంభం (సురవరం) నరసమ్మ ఆనాటి నిజాం రాజ్యంలోని హైద్రాబాద్‌కు చేరుకుంది. నన్ను పెంచి పోషించి విద్యాబుద్ధులు చెప్పించే ఆశయంతోనే ఆమె తన జీవితాంతం శ్రామికురాలిగా జీవించింది.

నా విద్యాభ్యాసం సికింద్రాబాద్ వీధి బడుల నుంచి, ప్రభుత్వ పాఠశాలల మీదుగా ఉస్మానియా యూనివర్సిటీ దాకా కొనసాగింది. ఇక మా రైతాంగ కుటుంబంలో ఆనాడు అందరూ - నిరక్షరాస్యులే! సాహిత్యమనే ప్రసక్తికి అవకాశమే లేదు.

**వృత్తి పరంగా మీరు ఆంగ్ల ఉపాధ్యాయులు - ప్రవృత్తి పరంగా తెలుగు సాహితీవేత్తలు - రెండింటినీ ఎలా సమన్వయం చేయగలిగారు..?**

భాషాపరంగా నేను హైస్కూలులో తెలుగు మాధ్యమంలోనే చదివినా, ఆరోజుల్లోనే సాయంకాలం పూట హిందీ ప్రచార సభ తరగతులకు హాజరవుతూ - భూషణ్ పరీక్షలో ప్యాస్ కాగా - హిందీ సాహిత్యంతో అనుబంధం ఏర్పడింది. ఆ తర్వాత మా హైద్రాబాద్ సాయం కళాశాల (నిజాం కాలేజి)లో ఇంగ్లీషు లిటరేచర్‌తో డిగ్రీ చదువు - ఆనాటికే ఇంగ్లీషు సాహిత్య అధ్యయనం - అయితే చిన్న నాటి నుంచి తెలుగు సాహిత్య పఠనం - సమాంతరంగా కొనసాగినందు వల్ల - మాతృ భాషలోనే కవిత్వం - కథ - విమర్శనా ప్రక్రియల్లో నా రచనా వ్యాసాంగం సాగిపోయింది. హిందీ, ఇంగ్లీషు (కొంత ఉర్దూ) సాహిత్యాల మూలంగా నా అవగాహన నా అభివ్యక్తి మరింత విస్తృతం కాదలిగింది - మౌలికంగా ఇంగ్లీషు, హిందీలో కూడా రచనలు చేశాను.

**దింగబరకవులు మొదటి సంకలనం మీ కవిత "ఆత్మయోని"తో ప్రారంభ మవుతుంది - మిగతా రెండు సంకలనాలలో మీ బలమైన కవితలు ఏవి? మిగతా దిగంబరుల గురించి మీ అభిప్రాయం?..**



**1970 అక్టోబర్ ఖమ్మంలో విరసం ఆవిర్భావ సభలు, 1982 లో గుడివాడలో జనసాహితి వార్షిక సదస్సులు నా ప్రయాణంలో ముఖ్యమైన మజిలీలు - ఇక శ్రీ శ్రీ గారితో కలిసి పౌర హక్కుల సభ్యుల పర్యటన, తర్వాత OPDR పక్షాన శ్రీకాకుళంలో అఖిల భారత స్థాయి నిజనిర్ధారణ కమిటీ అనుభవాలు. 1969 లో కలకత్తా లో నేనూ చెరబండ రాజు పాల్గొన్న అఖిల భారత కవితా సదస్సు, భోపాల్ లోని భారత్ భవన్, భువనేశ్వర్ కోణార్క్ ఉత్సవాలు, సాహిత్య అకాడమీ నిర్వహించిన ప్రపంచ కవితా దినోత్సవంలో కవితా పఠనం మెదలైనవన్నీ మధుర స్మృతులే!**

దిగంబరకవుల సంకలనంలోని కలలోని మా అందరి కవితలన్ని స్థాయి బేధాలతో శక్తివంతమైనవే! ఆరుగురికి ఎవరికి వారి శైలి - అభివ్యక్తి - భాష - శిల్పం ఉన్నాయి. ఆగ్రహం - ఆవేదనతో ఆరుగురు దిగంబరకవులు సమిష్టి ఘోషగా తమ ఆశయాన్ని నెరవేర్చారు. ఇక దిగంబరకవుల సంకలనంలో నా బలమైన కవితల విషయముకొస్తే "నీవు చెప్పింది అబద్ధంకాదు, నా దేశంలో నేను ఏకాకిని, సమాధులు చుట్టూ మంటలు, ఆహ్వానిస్తున్నాను, ఈ మట్టిలోంచి, హింస" లాంటి కవితలను పేర్కొనవచ్చు.

**మీ 'అగ్నిశ్వాస' కవితా సంపుటికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు వచ్చింది దానిమీద మీ స్పందన ఏమిటి?**

"అగ్నిశ్వాస"లో ఎక్కువగా 2015-17 మధ్య రాసిన కవితలున్నాయి. మత ఛాందస టెర్రరిజాన్ని ఎదుర్కోవల్సిందేనన్న పిలుపుతో సహా ఆయా సన్నివేశాలు, వ్యక్తులు - సామాజిక పరిణామాలపై తాత్వికంగా కొన్ని సూటిగా రాసిన కవితలున్నాయి. అయితే 2004-2014 మధ్య వచ్చిన జ్ఞాపకాల కొండ, యుగస్వరం, ఖండతారాల మీదుగా, కాలాన్ని అధిగమించి, సంపుటలలో ఏదో ఒకదానికి ఈ అవార్డు అప్పుడే వచ్చివుంటే మరింత ఆనందంగా ఉండేది. ఇక నా సాహిత్య యాత్రలో ఎన్నో మజిలీల దాటుతూ, ప్రజాభిమానం పొందిన నేపథ్యంలో, ఈ అవార్డు సాహిత్యపరంగా ఒక అదనపు గుర్తింపు అని భావిస్తున్నాను..

**దిగంబర ఉద్యమం నుంచి విరసం, జనసాహితి వరకు మీ పాత్ర గణనీయమైనది. ప్రభుత్వ కార్యకలా పాలను వ్యతిరేకిస్తూ కవిత్వం రాస్తున్నారు - మరి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే అవార్డు మీద మీ అభిప్రాయం..**

కేంద్ర ప్రభుత్వం సాంస్కృతిక వ్యవహారాలశాఖలో 'సాహిత్య అకాడమీ' స్వయం ప్రతిపత్తి గల సంస్థ. ఒక అటానమస్ బాడీగా ఈ కేంద్ర సాహిత్య అకాడమీ 1955 నుంచి భారతీయ భాషా సాహిత్యాలకు ఏటా అవార్డులు ఇస్తున్నది. ప్రజాస్వామికంగా ఎన్నికలు జరిపి, జనరల్ కౌన్సిల్ ద్వారా స్వతంత్రంగా అకాడమీ

తన కార్యకలాపాలు నిర్వహిస్తున్నది. 1988 నుంచి అకాడమితో నా అనుబంధం - ఆచార్య భద్రిరాజు కృష్ణమూర్తి గారు తెలుగు సలహా సంఘానికి (1992-97) కన్వీనర్‌గా ఉన్నపుడు నేను కూడా ఒక సభ్యుడిగా వున్నాను. గ్రౌండ్ లెవల్ నుంచి ఆయా భాషల రచయితల సూచనలు, ప్రచురణలను స్వీకరించి, వడబోసి - చివరగా ముగ్గురు సభ్యుల జ్యూరి నిర్ణయం మేరకు అవార్డును ప్రకటిస్తారు. ఈ ప్రక్రియలో పాలక పక్షాలకు లేదా మంత్రులకు ఎలాంటి ప్రమేయం వుండదు. సీనియర్ సాహితీవేత్తలు - విద్యావేత్తలు పరిశీలించి నిర్ణయించి ప్రకటించే అవార్డు కాబట్టి నేను స్వీకరిస్తున్నాను. ఇంగ్లీషుతో సహా 24 భారతీయ భాషలకు అకాడమీ సేవ చేస్తున్నది. హింది, ఇంగ్లీషు ద్వైమాసిక పత్రిలకను వెలువరిస్తున్నది. ఈ అవార్డు వచ్చినా వ్యక్తిగతంగా నేను ప్రజల పక్షాన ప్రతిపక్షంలో ఉన్నాను ఏ నాటికైనా ఈ అగ్నిశ్వాస / నా అంతరంగిక భాష / శ్రమ జీవుల పోరాటాల ధ్యాస.

**కవిత, కథానిక, విమర్శ, రాజకీయ వ్యాసాలు, అనువాదాల వంటి ప్రక్రియల్లో మీరు రచనలు చేసారు. ప్రజా ఉద్యమాల్లో క్రియాశీలంగా (Activist Poet) పని చేసారు. మీ సాహిత్య కృషి పట్ల విమర్శకుల అంచనాలు ఎలా వున్నాయి?**

నా సాహిత్య యాత్రలో విమర్శకుల నిర్లక్ష్యాన్ని ఎదుర్కొన్నాను. విమర్శక మిత్రులు కొందరు దిగంబర కవిత్వం దగ్గర ఆగిపోయి నా సాహిత్యాన్ని కుదించేసారు. కె. యాదవ రెడ్డి మొదలు నిఖిలేశ్వర్‌గా గత 60 సంవత్సరాల కాలంలో నేను చేసిన రచనల వైవిధ్యాన్ని వీరు గుర్తించడంలేదు. మిత్రులు దర్భశయనం, డా. జతిన్, ఎ.ఎన్. నాగేశ్వర రావు, రాఘవ శర్మ లాంటి వారు తప్ప మిగతా విమర్శకుల్లో, సమీక్షకుల్లో సహనం లేదు. నిశితంగా చదివి అంచనా వేసే వోపికా లేదు. ఆశ్రిత పక్షపాతం, ప్రాయోజిత ప్రశంసా పూర్వక విమర్శ ఈ నాటికి కొనసాగుతూనే వుంది. అందువల్ల సాహిత్య రంగంలో ప్రస్తుతం వస్తున్న కొందరి నిస్సారమైన కవిత్వం పట్ల, దూరదృష్టి లేని రచనల గురించి నిశిత విమర్శ లోపించింది.

**హిందీ, ఇంగ్లీషులో కూడా మీరు రచనలు చేసారు - వాటి గురించి?**

కవితాపరంగా హిందీలో "ఇతి హాస్ కే మోడ్ పర్", ఇంగ్లీషులో 'లైఫ్ ది ఎడ్జ్ ఆఫ్ నైఫ్' (Life the edge of knife) వివిధా శీర్షికన తెలుగు కవితలు-కథలు - చలం నాటిక "మృత్యువు"తో పాటు విమర్శను హిందీలోకి అనువదించగా ఢిల్లీ పబ్లిషర్ పుస్తకంగా ప్రచురించారు.

**మీరు విరివిరిగా అనువాదాలు కూడా చేసారు. వివిధ భాషాలతో ఉన్న అనుభవం ఎలాంటిది? మీ కథా రచనల గురించి?**

కవిత్వంతో పాటు నా జీవనయానంలో అనువాద క్రియకలాపాలు తోడుగా ఉన్నాయి. హిందీ, ఇంగ్లీషు, ఉర్దూలతో పాటు ఇతర భాషా సాహిత్యాన్ని అనువదించాను. "అనుసృజన" ప్రచురణ నా కవితనువాదాలకు నిలువెత్తు నిదర్శనం. ఇతరత్రా నేను చేసిన

> **నా సాహిత్య యాత్రలో విమర్శకుల నిర్లక్ష్యాన్ని ఎదుర్కొన్నాను. విమర్శక మిత్రులు కొందరు దిగంబర కవిత్వం దగ్గర ఆగిపోయి నా సాహిత్యాన్ని కుదించేసారు.కె.యాదవ రెడ్డి మొదలు నిఖిలేశ్వర్ గా గత 60 సంవత్సరాల కాలంలో నేను చేసిన రచనల వైవిధ్యాన్ని వీరు గుర్తించడంలేదు.**

అనువాదాలన్నీ కొంత ఆర్థికంగా ఆదుకున్నాయి - నా అనుభవంలో గ్రహించిన వాస్తవం. బహుళ భాషాలున్న భారతదేశానికి ఇతర దేశాల ఖండాంతరాల సాహిత్యానికి పరస్పర అనువాదాలే సజీవమైన వాహికలు. అసలు అనువాదాలు లేకుండా ప్రపంచ సాహిత్య పరిచయం అసాధ్యం! ఇక "నిఖిలేశ్వర్ కథలు" గురించి వివరంగా చెప్పవలసిందే! అయితే 2000 తరువాత నేను కథలు రాయలేదు.

**విమర్శనా రంగంలో కూడా మీకొక స్థానం ఉంది. సాహిత్య విమర్శను మీరు ఏ దృష్టిలో చూస్తున్నారు?**

ఆనాటి వచన కవిత ప్రక్రియ ఉద్యమం (కుందుర్తి గారి కృషిమూలంగా) నాటి నుంచి నేను నా సమకాలీన కవుల రచనలపై పరిశీలన వ్యాసాలు రాసాను. తదుపరి ఆయా దశల్లో ఆయా ప్రక్రియల్లో వచ్చిన రచనలపై విమర్శనాత్మక రచనలు చేసాను - ఆ రచనలన్నీ 'మారుతున్న విలువలు - సమకాలీన సాహిత్యం', 'కవిత్వ శోధన', 'ఆవహించిన అక్షరం' ప్రచురణలుగా వచ్చాయి - 1995 నాటి సాహిత్య వ్యాసాలు "ప్రపంచ సాహిత్యంలో తిరుగుబాటు ఉద్యమాలు" - రివైజ్డ్ - ఎడిషన్‌గా రానున్నది. సాహిత్య విమర్శలో ప్రధానంగా వస్తురూపాలు - శైలిని పరిగణలోకి తీసుకున్నా, తాత్వికంగా చారిత్రక గతి తార్కిక, మార్క్సియన్ సౌందర్య శాస్త్ర దృష్టితో చూసినప్పుడే నిగ్గు తేల్చగలమనుకుంటాను!



## Hostility: A Diplomat's Diary on Pakistan-India Relations




భారత్-పాక్ మధ్య సంబంధాల విషయంలో దౌత్యవేత్తల పాత్ర ఎంతో కీలకం. భారత్ లో పాకిస్తాన్ రాయబారిగా వ్యవహరించిన అబ్దుల్ బాసిత్, తన అనుభవాలను Hostility: A Diplomat's Diary on Pakistan-India Relations పుస్తకంలో పొందుపరిచారు. 2014-17 వరకు ఢిల్లీలో పాక్ రాయబారిగా పనిచేసిన అబ్దుల్ బాసిత్, పలు వివాదాస్పద అంశాల్లో భారత్-పాక్ మధ్య సంబంధాల్లో నెలకొన్న ప్రతిష్టంభనను, దాన్ని పరిష్కరించిన విధానాలను ఇందులో వివరించారు.




## Soumitra Chatterjee: A Life in Cinema, Theatre, Poetry & Painting

బెంగాల్ చిత్ర సీమలో తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సౌమిత్ర ఛటర్జీ జీవిత చరిత్రను Soumitra Chatterjee: A Life in Cinema, Theatre, Poetry & Painting పుస్తకంలో వివరించారు రచయితలు అర్జున్ సేన్‌గుప్త మరియు పార్థా ముఖర్జీ. ఆరు దశాబ్దాల సుదీర్ఘ నట జీవితంలో 300లకు పైగా చిత్రాల్లో నటించిన సౌమిత్ర ఛటర్జీ వ్యక్తిగత, సినీ విశేషాలను, అత్యుత్తమ దర్శకుడు సత్యజిత్ రే వంటి వారితో అనుబంధాలను ఇందులో వివరించారు.

## Wanderers, Kings, Merchants: The Story of India through its Languages




భారతదేశంలో ఉన్న ప్రతి ఒక్కరూ, రెండూ లేదా అంతకంటే ఎక్కువ భాషలు మాట్లాడటం సర్వసాధారణం. అయితే దీనికి దారితీసిన పరిస్థితులు, భారతదేశ 'భాషా చరిత్ర'ను Wanderers, Kings, Merchants: The Story of India through its Languages పుస్తకం ద్వారా వివరించారు రచయిత పెగ్గీ మోహన్. భారత దేశంలోకి వివిధ భాషలు ప్రవేశించడానికి కారణాలు, దేశ చరిత్రపై వాటి ప్రభావాన్ని ఈ పుస్తకంలో వివరించారు.




## Second World War Sandwich

రెండో ప్రపంచ యుద్ధంలోని కీలక సంఘటనను Second World War Sandwich పుస్తకంలో పొందుపరిచారు రచయిత డిగోంటా బోర్దాలాయ్. 1944 లో రెండో ప్రపంచ యుద్ధ సమయంలో నాగాలాండ్ లో జపాన్ సైన్యం, బ్రిటిష్ సైన్యం మధ్య జరిగిన ఘర్షణలను ఈ పుస్తకంలో వివరించారు. బ్రిటిష్ సైన్యంలోని నలుగురు సామాన్య వ్యక్తులు చేసిన సాహసాలను ఇందులో వివరించారు.

వ్యాసం

# పుస్తకాల మనిషి కపిలవాయి లింగమూర్తి

**సాహిత్యమే జీవితంగా గడిపిన మహామనీషి....**



ఆమ్ గోత్. వెంకట్ పవార్

ఒక్క పల్చటి శరీరం. ఎముకల్ని కప్పి ఉంచడానికి ఉన్న చర్మం తప్ప అధికమైన శరీరభాగం, శరీరభారం లేని అతి సాధారణ మనిషి అతను. ముఖంపై చెరగని చిరునవ్వు అతని సొంతం. ఆ చిరునవ్వులో మాలిన్యం లేదు. ఈర్ష్య లేదు. అతని పాదాలు తిరగని పాలమూరు గ్రామాలు లేవు. తను నడయాడిన పాలమూరు పల్లెలన్ని చరిత్రలుగా నిలిచినవి. రవాణా సౌకర్యాలు సరిగ్గా లేని రోజుల్లో అతని కాళ్ళు బండి గిర్రలై అనేక ప్రాంతాలను చుట్టి తను సేకరించిన వాటిని పుస్తక రూపంలో మలిచారు. కరెంటు వెలుగులు లేని రోజులలో కందిలి వెలుగులని ఆసరా చేసుకుని గుట్టలు, గుళ్ళు తిరిగి సమాజానికి అక్షర వెలుగులని పంచిన కాంతిరేఖ అతను.

ఇతరుల పట్ల కఠినంగా మాట్లడటం, ఇతరులని విమర్శించడం ఎరుగని గొప్ప సాత్వికుడాయన. తాను ఎక్కడికి వెళ్లినా కంటపడ్డ శాసనాలు, స్తంభాలు, చారిత్రక స్థలాలు, తాళపత్ర గ్రంథాలు, చెవినపడ్డ మౌఖిక కథనాలు, గాథలు అన్నింటినీ సేకరించి వాటిలోని విషయాలను, చరిత్రను పుస్తకం రూపంలో తెచ్చే వరకు విశ్రమించని అక్షర సైనికుడతను. పుస్తకాలే లోకంగా పుస్తక రచన, పుస్తక పఠనం, పుస్తకాల భద్రత అను మూడింటిని ఒకచోట చేర్చి పుస్తకానికి ఆయన పర్యాయపదంగా మారి మనిషే ఓ పుస్తకంగా వెలుగొందారు.

సాహిత్య అన్వేషి పెద్దలు డా॥ కపిలవాయి లింగమూర్తి గారు 1928 మార్చి 31 నాడు ఉమ్మడి మహబూబ్ నగర్ ,ప్రస్తుత నాగర్ కర్నూల్ జిల్లాలోని బల్మూరు మండలం జినుకుంట గ్రామం నందు జన్మించారు. తల్లి మాణిక్యాంబ తండ్రి వెంకటాచలం గారు. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోయిన కపిలవాయి గారు తన బాల్యాన్నంతా అమ్రాబాద్‌లోని అమ్మమ్మ గారింట్లో గడిపారు. మేనమామ చేపూరు పెదలక్ష్మయ్య గారి సాన్నిహిత్యంలో వృత్తి విద్యను, సాధారణ విద్యను అభ్యసించారు.



45 సంవత్సరాల వయసులో ప్రారంభించిన సాహితీసేద్యం 45 సంవత్సరాల పాటు సుదీర్ఘంగా కొనసాగించిన సుప్రసిద్ధ సాహిత్యవేత్త. తుదిశ్వాస వదిలే వరకు అక్షరాన్ని అమితంగా ప్రేమించిన అక్షర పిపాసి. అతనికి తీరని దప్పిక, ఆకలిలాంటివి ఏవైనా ఉన్నయంటే అవి కేవలం చదవడం, రాయడం మాత్రమే. అతను చేసే భోజనమే కాదు అతని కలం నుండి జాలువారిన రచనలు, మాటలు కూడా సాత్వికమే.ఆయన సాహిత్య కీర్తిపతాక తెలుగు నేలపై చిరస్థాయిగా నిలిచి ఉంది.

మన చుట్టూ ఉన్న, మనకు తెలియని చరిత్రను తవ్వి మనకందించిన మనకాలపు గొప్ప పరిశోధకులు. తెలుగు సాహిత్యం, పరిశోధనల్లో ఆదిరాజు వీరభద్రరావు, బిరుదురాజు రామరాజు, బి.ఎన్.శాస్త్రి, సురవరం ప్రతాపరెడ్డి, గడియారం రామకృష్ణ శర్మ, తెలకపల్లి రామచంద్ర శాస్త్రి, కేశవపంతుల నరసింహ శాస్త్రి, కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి లాంటి దిగ్గజాల సరసన చెప్పుకోదగిన వారు కపిలవాయి గారే.

సుధీర్ఘ సాహిత్య జీవితంలో (45 సంవత్సరాలు) శతాధిక గ్రంథాలను ఎలా రాయగలిగారో మన ఊహకు కూడా అందని విషయం. ఒక రోజులో ఏదీ రాయకుండా, చదవకుండా అన్న పానీయాలు కూడా ముట్టుకోరంటే సాహిత్యంపై అతనికున్న మక్కువ, ప్రేమ ఏపాటిదో మనం గుర్తించవచ్చు. నిరంతరం అక్షరాలను అల్లుకుంటూ సృజన సాహిత్యాన్ని పుస్తకాల దండలుగా ధరించినారు. 90 ఏళ్ల వయసులోను కళ్ళద్దాల అవసరం లేకుండానే రోజులోని అత్యధిక సమయం కేవలం చదవడానికి, రాయడానికే కేటాయించారు.

తనకు ప్రాచీన గ్రాంథిక పాండిత్యం ఉన్నా తను రచించిన పుస్తకాల ద్వారా సామాన్య ప్రజలకు, పరిశోధకులకు చేరువ కావాలనే తపనతో తన రచనల్లో సరళమైన వాడుక భాషను వినియోగించారు. పద్యం, గద్యం, గేయం, వచనాలు, శతకం, కథ, నవల, కావ్యం, ద్విపద, నాటకం, చరిత్ర, ఉదాహరణం, బాలసాహిత్యం, సంకీర్తనం, బుర్రకథ, హరికథ, సంకలనం, అనువాదం, స్థలపురాణం, పీఠికలు ఇలా సాహిత్యంలోని అన్ని ప్రక్రియలను ముద్దాడిన అక్షర ప్రేమికుడు.

సాహిత్యంలో ఏదో ఒక ప్రక్రియకు పరిమితం అయ్యుంటే వారు కూడా ఎక్కడో ఒక దగ్గర ఆగిపోయేవారు. కానీ..! అలాకాక మారుతున్న కాలానుగుణంగా సాహిత్యంలో వస్తున్న మార్పులకనుగుణంగా తాను మారుతూ అనేక ప్రక్రియలను రాసి సాహిత్య చరిత్రలో శిఖరాగ్ర స్థానం చేరుకోగలిగారు.ఇది అందరికీ సాధ్యమయ్యే పనికాదు. ఆయన రాసిన అనేక పుస్తకాలు సాహిత్యకారులకు ప్రామాణికంగా నిలిచాయి. కీర్తి ప్రతిష్టలు, అవార్డులు, సన్మానాలు, శాలువాల మీద ధ్యాస లేని జీవితం వారిది. వందల అవార్డులు, సన్మానాలు, బిరుదులు వారిని వెతుక్కుంటూ వారి ఇంటి గడపను తొక్కినయి.

**ఇతరుల పట్ల కఠినంగా మాట్లడటం, ఇతరులని విమర్శించడం ఎరుగని గొప్ప సాత్వికుడాయన. తాను ఎక్కడికి వెళ్లినా కంటపడ్డ శాసనాలు, స్తంభాలు, చారిత్రక స్థలాలు, తాళపత్ర గ్రంథాలు, చెవినపడ్డ మౌఖిక కథనాలు, గాథలు అన్నింటినీ సేకరించి వాటిలోని విషయాలను, చరిత్రను పుస్తకం రూపంలో తెచ్చే వరకు విశ్రమించని అక్షర సైనికుడతను. పుస్తకాలే లోకంగా పుస్తక రచన, పుస్తక పఠనం, పుస్తకాల భద్రత అను మూడింటిని ఒకచోట చేర్చి పుస్తకానికి ఆయన పర్యాయ పదంగా మారి మనిషే ఓ పుస్తకంగా వెలుగొందారు.**

నాగర్ కర్నూల్ జాతీయోన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా, పాలెంలోని శ్రీ వెంకటేశ్వర ప్రాచ్య కళాశాల యందు ఉపన్యాసకులుగా పనిచేసి ఎందరో శిష్యులను తీర్చిదిద్దినారు. సాహిత్య పరిశోధనల కోసం అనేక పుస్తకాలను, తాళపత్ర గ్రంథాలను సేకరించి తన ఇంటినే గ్రంథాలయంగా మార్చి భద్రపరిచారు. ఈ గ్రంథాలయం భవిష్యత్ పరిశోధకులకు ఒక సాహిత్య భాండాగారంగా నిలిచిపోయింది. వారు స్వయంగా స్వర్ణకారులు, శిల్పులు, చిత్రకారులు కూడా.

ఎన్నో ఏళ్ల నుండి వారిని ఆహ్వానిస్తూ వారి ఇంటికి చేరిన పెళ్లి పత్రికలు, దుకాణాల ప్రారంభోత్సవ ఆహ్వాన కరపత్రాలు, వారి సాహిత్యాన్ని ప్రేమించి, అభినందిస్తూ రాసిన ఉత్తరాలు అలాగే భద్రపరిచి ఉంచారు. వీటి సహాయంతో మనం ఏకంగా పుస్తకాలే రాసేయవచ్చు. చేతికి అందిన ప్రతి కాగితాన్ని భద్రపరచడం వారికున్న మంచి అలవాటు.

డా॥ కపిలవాయి లింగమూర్తి గారి జీవితం, సాహిత్యంపై పరిశోధనలు చేసి









వ్యాసం

ఎం.ఫిల్, పి.హెచ్.డిలు పొందినవారు ఉన్నారు. ఇంకా ఎంతో మంది పరిశోధక విద్యార్థులు ఎం.ఫిల్, పి.హెచ్.డిలు సాధించడంలో వారే సూత్రధారిగా మార్గదర్శనం చేసిన నేపథ్యం ఉంది.

వారి జీవితంలో కుటుంబ సభ్యులను కోల్పోయి దుఃఖ సాగరంలో కూరుకుపోయి కూడా గుండె నిబ్బరంతో సాహితీక్షేత్రాన్ని సాగు చేశాడు. తను అనారోగ్యం పాలై హాస్పిటల్ బెడ్ పై ఉండి మాట్లాడలేని స్థితిలో ఉన్నప్పుడు కూడా పలకపై రాస్తూ తన పుస్తకాల గురించి అడిగేవారు. ఇతరుల సాహిత్య సందేహాలను కూడా నివృత్తి చేసిన నిత్య అక్షరశిల్పి. సాహిత్యంలో ఉన్నత శిఖరాలను అధిరోహించినా, వ్యక్తిత్వంలో అతి సామాన్యుడతను. గౌరవం కోసం తాపత్రయ పడే వ్యక్తిత్వం కాదు అతనిది. ఉద్యోగ విరమణ అనంతర జీవితంలో నిత్యం పుస్తకాలు రాయడమో, చదవడమో తప్ప ఇతర వ్యాపకాలు గాని, ధ్యాస గాని లేదు.

"కంచు మోగినట్లు కనకంబు మోగునా" అను వేమన సూక్తిని నిజం చేసిన పండితుడతడు. కంచు వంటి కంఠం లేకున్నా సువర్ణాక్షరాలు తన కలం నుండి జాలువార్చి సాహిత్యపు చరిత్రలో సువర్ణాక్షారాలతో (స్వర్ణశకలాలు) తన చరిత్రను తానే లిఖించుకున్నారు. తను సనాతన, సాంప్రదాయక, ఆధ్యాత్మిక, ప్రభోధాలను అనుసరించినా ఇతర భావాలను, వాదాలను గొప్పగా గౌరవించి ఆలింగనం చేసుకున్న ఉదారవాదం




వారిది.అన్ని వాదాల పుస్తకాలను చదివి సరిచేసేవారు.

**సాహిత్యంలో ఏదో ఒక ప్రక్రియకు పరిమితం అయ్యుంటే వారు కూడా ఎక్కడో ఒక దగ్గర ఆగిపోయేవారు. కానీ..! అలాకాక మారుతున్న కాలానుగుణంగా సాహిత్యంలో వస్తున్న మార్పులకనుగుణంగా తాను మారుతూ అనేక ప్రక్రియలను రాసి సాహిత్య చరిత్రలో శిఖరాగ్ర స్థానం చేరుకోగలిగారు.ఇది అందరికీ సాధ్యమయ్యే పనికాదు. ఆయన రాసిన అనేక పుస్తకాలు సాహిత్యకారులకు ప్రామాణికంగా నిలిచాయి.**

తెలంగాణ కల సాకారమైనాక స్వరాష్ట్రంలో తెలుగు యూనివర్సిటీ వారి తొలి గౌరవ డాక్టరేట్ అందుకున్న సాహితీవేత్తగా చరిత్రలో నిలిచారు. సాహిత్యంలో వారు చేసిన కృషిని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రాథమిక, ఉన్నత స్థాయి, ఇంటర్, డిగ్రీ పాఠ్యపుస్తకాలలో వారి రచనలు చేర్చి యావత్ తెలంగాణ విద్యార్థులు చదివి తెలుసుకునేలా చేయగలిగింది.

దాదాపుగా 90 పుస్తకాలను ప్రచురించారు. ఇంకా 25 దాకా డి.టి.పి పూర్తై అచ్చు కావాల్సి ఉంది. వారి చివరి పుస్తకం "దేవుడు-జీవుడు" కూడా డి.టి.పి పూర్తి అయ్యి అచ్చు కావాల్సి ఉంది. తన మరణాన్ని కూడా తాను ముందే

**తనకు ప్రాచీన గ్రాంథిక పాండిత్యం ఉన్నా తను రచించిన పుస్తకాల ద్వారా సామాన్య ప్రజలకు, పరిశోధకులకు చేరువ కావాలనే తపనతో తన రచనల్లో సరళమైన వాడుక భాషను వినియోగించారు. పద్యం, గద్యం, గేయం, వచనాలు, శతకం, కథ, నవల, కావ్యం, ద్విపద, నాటకం, చరిత్ర, ఉదాహరణం, బాలసాహిత్యం, సంకీర్తనం, బుర్రకథ, హరికథ, సంకలనం, అనువాదం, స్థలపురాణం, పీఠికలు ఇలా సాహిత్యంలోని అన్ని ప్రక్రియలను ముద్దాడిన అక్షర ప్రేమికుడు.**

తెలుసుకుని దాన్ని కూడా అక్షరం ద్వారానే రాసి చూపిన దివ్యజ్ఞాని. "ప్రాణపక్షి ఇది ఎగిరిపోయే ప్రయత్నంలో ఉన్నది. నా హృదయంలో నుంచి బయటికి వచ్చింది." అని తన చివరి ఘడియలని జ్ఞాన నేత్రంతో వీక్షించి తన స్వహస్తాలతో తను ముందే రాసి తెలియపరిచిన గొప్ప మహానుభావుడు. హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న పెద్దాయన 2018 నవంబర్ 6వ తేదీ మధ్యాహ్నం వరకు ఎవరేం అడిగినా..! స్పందించారు. తన శ్వాస ఆగే క్షణాలు దగ్గరయ్యే కొద్దీ పల్స్ రేట్ మెల్లగా తగ్గుతూ.... చాలా నెమ్మదిగా ఒక్కొక్క మెట్టు దిగుతూ సాయంత్రం 6 గంటల 18 నిమిషాలకు ప్రశాంతంగా తుదిశ్వాస విడిచారు. వారి జీవితం మొత్తం ఎంత నిష్కల్మషంగా, ప్రశాంతంగా ఉన్నారో... చివరి శ్వాస వదిలే ముందు కూడా అదే ప్రశాంతత అదే సాత్వికత......

తెలుగు సాహిత్యంలో వారు లేని లోటు పూడ్చలేనిది. వర్ధమాన కవులు, రచయితలు, పరిశోధకులు వారి సాహిత్య వారసత్వం అందుకుని ఎక్కడికక్కడా స్థానిక చరిత్రలను తవ్వి పరిశోధించి మరుగున పడ్డ చరిత్రను, వెలుగులోకి తీసుకొచ్చి భావితరాలకు అందించినప్పుడే వారికి మనం నిజంగా ఘననివాళులు అర్పించినవారమవుతాం.

# ఆ పాట

**దేవనపల్లి వీణా వాణి**



ఆ పాట వింటాను
ఆ పాటే వింటాను
మళ్లీ మళ్లీ వింటాను

ఆ వినటంలో నాకు నిన్నటి రోజు మళ్లీ మొదలైనట్టు
రాలి పోయిన పువ్వులు ఒక్కొక్కటిగా
మళ్లీ కొమ్మలను అతుక్కుంటునట్టు
వెనక్కి వెనక్కి తగ్గి గాలి
మెల్లిగా తడిమినట్టు అనిపిస్తుంది

ఇంకా ఆగి ఆగి నడుస్తున్నట్టు
తూలి పోతున్న అడుగుకు నువ్వు
జతపడి ముడివేసినట్టు
అర్థం అయ్యి కానట్టు  తెలుసుకున్న దేదో
తేలినట్టు తెలుస్తుంది

ఆ పాటే
మళ్లీ మళ్లీ వింటాను
వినాలని గుర్తొచ్చినప్పుడల్లా
వింటాను
విన్న ప్రతి సారీ
ఆ పాటలోని పదాల లాగే
గుప్పించిన ముత్యాలు గుమ్మరించినట్టు
చెవిలో మోగిన కమ్మని వాయిద్యాన్ని వింటాను
ఒక్కటిగా నవ్విన ఒక కలను వింటాను..

ఆ పాటే వింటాను
ఒక కొరత పడ్డ దినం
ముగుస్తున్నప్పుడు

వినడానికి వినడానికి
మధ్య ఉన్న తెరిపి
అగాధాన్ని గుర్తు చేస్తుంది
ఆ పాట అగాధాన్ని పూడ్చడానికి
ప్రయత్నిస్తుంది..!

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునిక్ కోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి.
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి.
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.
- ✓ ప్రచురణకు స్వీకరించిన రచనల్ని పత్రికనుగుణంగా మార్పు చేసుకునే హక్కు సంపాదకవర్గం కలిగి ఉంటుంది.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

కథ

# దీన్ని ఇకనైనా ఆపండి

పతనం వైపు వెడుతున్న ప్రపంచం...



రామా చంద్రమౌళి

ముప్పై ఆరేండ్ల డాక్టర్ ఉషకు చాలా భయంగా, దుఃఖంగా, ఏ భాషకూ అందనంత బాధగా ఉంది.

అప్పుడామె అరబ్ మిడిల్ ఈస్ట్ దేశాలలోని గత ఆరేండ్లుగా ఒక సుదీర్ఘకాలం అంతర్యుద్ధంతో కునారిల్లుతున్న 'యెమన్' దేశపు బాధిత నగరం టయాజ్లోని అనేకమంది బాలబాలికలు హుతీస్కు చెందిన స్నైపర్ల విచక్షణా రహిత పాశవిక మెషిన్గన్ కాల్పుల్లో మరణించిన దాదాపు పదేళ్ళ లోపలి వయసున్న బాలబాలికల శవాల కుప్ప దగ్గర ఒక అంతర్జాతీయ మానవ హక్కుల కార్యకర్తగా, అరబ్ వుమన్ వాయిస్ సభ్యురాలిగా, దోహాలోని కతార్ యూనివర్సిటీ ప్రొఫెసర్గా, ఆ క్షణం అంతర్జాతీయ అనుమతి పొందిన బిబిసి మీడియా సంస్థ ప్రతినిధిగా, పరిశీలకురాలిగా అక్కడ ఉంది. ఆమె భారతదేశ పౌరురాలు. ఈ దేశపు ప్రజల కష్టార్జితమైన డబ్బుతో ఐఐటి వంటి అత్యున్నత విద్యాసంస్థల్లో అందరు విద్యావంతులవలె బాగా చదువుకుని విదేశాలకు ఎగిరిపోయి తమ సౌఖ్యం, తమ సుఖం చూచుకునే వ్యక్తిగా కాకుండా సామాజిక స్పృహతో కొన్ని తరాలుగా ప్రచలితులైన కుటుంబం నుండి వచ్చినందుకు బాధ్యతగా వసుధైక కుటుంబంలో జీవిస్తోందామె.

ఆమెది 'బ్రాడ్ స్పెక్ట్రం' వ్యూయింగ్. సమాజాన్ని తనదైన ఒక ప్రత్యేక కోణంలో చూడ్డంవల్ల ప్రొఫెసర్ ఉష తనను తాను ఒక విలక్షణమైన వ్యక్తిగా రూపొందించుకుంది. ఆ విలక్షణత వల్ల ఆమె ఈ ప్రపంచంలోని అతి దుఃఖిత, అతి పేద, అతి దయనీయ స్థితిలో ఉన్న మెడగాస్కర్, సౌత్ ఆఫ్రికా, అఫ్ఘనిస్తాన్, యెమన్, సూడాన్, మొజాంబిక్, మెక్సికో, నైజీరియా వంటి అనేక దేశాలను సందర్శించి కొన్ని నిర్దిష్టమైన అభిప్రాయాలను ఏర్పర్చుకుంది. అవి... ఈ ప్రపంచం చాలామంది అనుకుంటున్నట్టు సుఖసంతోషాలతో నిండి లేదు. అనేకానేక కారణాల వల్ల అనేక అభివృద్ధి చెందిన దేశాలతో సహా ప్రజలు నిశ్శబ్ద అంతర్ఘర్షణలతో అగ్ని పర్వతాల్లా బ్రతుకుతున్నారు. ప్రధానంగా పేదరికంతో, రాక్షస ప్రవృత్తితో, హింసాకాంక్షతో, యుద్ధాలతో అట్టుడికిపోతున్న దేశాల ప్రజలు ఏండ్ల తరబడి హింసాత్మకమైన దాడుల్లో లక్షలు లక్షలుగా అంతమైపోతున్నారు నిస్సహాయంగా. ఇది నిజంగా అమానవీయ దుస్థితి. ఈ పరిస్థితులకు కారణం కొన్ని దేశాల్లో గుప్తంగా దాగి ఉన్న దురాక్రమణ తత్వం, చిన్న పిల్లలు చేతికి చిక్కిన బొద్దింకలను చీపురు పుల్లల్తో గుచ్చి గుచ్చి చంపే, తూనీగల్ని రెక్కలూ తోకా తుంచి అది విలవిల్లాడుతూంటే కేరింతలుకొట్టే హింసాప్రవృత్తి, రహస్యంగా లోపల దాగి ఉన్న యుద్ధ తృష్ణ, దోపిడీ లక్షణం, ఎదుటి వ్యక్తి బాధపడ్తూ దుఃఖిస్తూంటే పైశాచికానందం పొందే  శాడిస్ట్ సైకాలజీ.. స్నైపర్ లక్షణం.

స్నైపర్ అంటే... బయటికి కనబడకుండా చాటుగా దాగి ఉండి ఆయుధంతో నిరాయుధులపై విచక్షణారహితంగా కాల్పులు జరుపుతూ ఆనందాన్ని పొందేవాడు. ఐతే స్నైపర్ ఎప్పుడూ తుపాకీతోనే కాల్పులు జరుపడు.. బాగా తాగివచ్చి అకారణంగా భార్యా పిల్లలను హింసించే కుటుంబ పెద్దకూడా ఒక స్నైపరే.

బిబిసి అధికారిక వాహనం డాక్టర్ ఉషనూ మరో మానవ హక్కుల కార్యకర్త లూయిస్ మెరీనీ యెమన్ నైరుతి భాగంలో ఉన్న టయాజ్ పట్టణంలో దించి వెళ్ళిపోయింది. టయాజ్ పట్టణానికి స్నైపర్ల నగరం అన్న పేరు కూడా ఉంది. వాళ్ళు అక్కడికి చేరుకోకముందే ఒక గంట క్రితం ఒక స్నైపర్ల దళం విచక్షణా రహితంగా ఒక విశాలమైన పెంటకుప్పలు నిండిన మైదానం వంటి ప్రాంతంలో

ఆడుకుంటున్న నిరుపేద యెమన్ బాలబాలికలపై అతి కిరాతకంగా కాల్పులు జరిపి నిష్క్రమించారు. నేలంతా మృతులైన పిల్లల వెచ్చని రక్తంతో తడిచి దయనీయంగా ఉంది. ఆ దుర్ఘటనను తెలుసుకుని పగిలిన గుండెలతో ఏడుస్తూ అక్కడికి చేరుకున్న వాళ్ళ తల్లిదండ్రులు తమ తమ పిల్లల్ని మృతులుగా కనుగొని ఒక శవాల దిబ్బగా అందరినీ ఒకచోట చేరుస్తున్న దృశ్యం విదారకంగా, కన్నీళ్ళు తెప్పించేదిగా ఉంది.

"వీళ్ళు పాపం అన్నెం పున్నెం ఎరుగని ఈ పసివాళ్ళను ఎందుకు టార్గెట్ చేస్తున్నారో అర్థం కాదు. ఈ హౌతీస్ టెర్రరిస్టులు ఎందుకు ఎంతో భవిష్యత్తున్న ఈ పిల్లలను ఎంచుకుంటున్నారో చంపడానికి" అంది ఉష అప్రయత్నంగానే తన ప్రక్కనే ఉన్న సహ కార్యకర్తనుద్దేశించి. వంగి మరణవేదన అనుభవిస్తున్న ఒక ఆరేండ్ల బాలిక కాల్పుల్లో తెగి వ్రేలాడ్తున్న తన చేయిని ఈడ్చుకుపోతూంటే.. మేరీ ఆసరా పడ్తోంది పాపం. పిల్లల చావుకేకలతో అక్కడి వాతావరణమంతా బీభత్సంగా ఉంది.

ఒక ప్రపంచ విషాదంగా మారిన యెమన్ అంతర్యుద్ధం మొదలైన దగ్గరినుండి దాదాపు లక్ష మంది చనిపోయారనీ, మరో లక్ష మంది దాకా తీవ్రంగా గాయపడి వివిధ హాస్పిటల్లలో చికిత్స పొందుతున్నారని, అనేక లక్షల మంది కకావికలై ప్రపంచ నలుమూలలకు ప్రాణాలను అరచేతుల్లో పట్టుకుని పారిపోయారని ఉషకు తెలుసు. రాజధాని సనా నగరంపై హౌతీస్ స్నైపర్లు 4 డిసెంబర్ 2017న మెరుపుదాడి చేసి అప్పటి యెమన్ ప్రెసిడెంట్ అలీ అహమ్మద్ సాలెహ్ను కాల్చి హత్యచేసిన రోజు మొదలైన భీకర హింసాకాండ అప్రతిహతంగా రావణాసురుని కాష్టంలా కొనసాగుతూనేఉంది.

వీళ్ళను చూస్తూంటే జీవితమంటే కృషిచేస్తే దేన్నైనా సాధించగలిగే తపస్సనిగానీ, సాధనమున పనులు సమకూరు ధరలోన అన్న సిద్ధాంతంగానీ కావనీ.. శత్రుబారినపడకుండా బ్రతుకగలిగడమే ఒక అదృష్టమనీ, నిత్య యుద్ధమనీ, ఒక chance మాత్రమేననీ అనిపిస్తోంది. మనిషిని మనిషి చంపడానికి వ్యక్తిగత శత్రుత్వమేదీ అస్సలు అవసరమే లేదనికూడా అర్థమౌతోంది.

**ఒక ప్రపంచ విషాదంగా మారిన యెమన్ అంతర్యుద్ధం మొదలైన దగ్గరినుండి దాదాపు లక్షమంది చనిపోయారనీ, మరో లక్ష మందిదాకా తీవ్రంగా గాయపడి వివిధ హాస్పిటల్లలో చికిత్స పొందుతున్నారని, అనేక లక్షలమంది కకావికలై ప్రపంచ నలుమూలలకు ప్రాణాలను అరచేతుల్లో పట్టుకుని పారిపోయారని ఉషకు తెలుసు. రాజధాని సనా నగరంపై హౌతీస్ స్నైపర్లు 4 డిసెంబర్ 2017 న మెరుపుదాడి దాడి చేసి అప్పటి యెమన్ ప్రెసిడెంట్ అలీ అహమ్మద్ సాలెహ్ను కాల్చి హత్యచేసిన రోజు మొదలైన భీకర హింసాకాండ అప్రతిహతంగా రావణాసురుని కాష్టంలా కొనసాగుతూనే ఉంది.**

ఎదుట కనీసం ఒక పదిపదిహేను మంది పిల్లల శవాలు అడ్డదిడ్డంగా పడున్నాయి.. ఇంకో ఏడెనిమిది మంది తీవ్రంగా గాయపడి పెడబొబ్బలు పెడ్తున్నారు ఏడుస్తూ. వాళ్ళను వెంటనే ఏదో దవాఖానకు తరలించాలె. కాని ఎలా.?

ఉష తన బిబిసి టీం లీడర్ మైకేల్కు ఫోన్ చేద్దామని స్ఫురించి,

సరిగ్గా ఆ క్షణమే సర్ర్ మని భీకరధ్వనులతో మూడు ఎఫ్-15 యుద్ధ విమానాలు మెరుపువేగంతో చొచ్చుకొస్తూ వరుస బాంబుల వర్షం కురిపిస్తూ దూసుకుపోయాయి లిప్తకాలంలో. ఉష తన శిక్షణ స్పృహతో చటుక్కున నేలను కరుచుకుని అతుక్కుపోయింది. మేరీకూడా. ప్రక్కనున్న మనుషులూ, శవాలపై కాకుండా ప్రక్కనే ఇది వరకే సగం కూలిపోయి మొండి గోడలుగా మిగిలి ఉన్న భవన సముదాయాలను తుత్తునియలు చేసి చెవులు పగిలిపోయే విస్ఫోటనాన్ని సృష్టించాయి. తెలిసింది డాక్టర్ ఉషకు అవి సౌదీ అరేబియా రియాద్లో తన మంత్రివర్గంతో సహా తలదాచుకుని యెమన్ ప్రభుత్వాన్ని నడుపుతున్న అబ్ద్రాబ్బుల్ మన్సూర్ హాది



అని పిలువబడే యెమన్ అధ్యక్షునికి దన్నుగా పని చేస్తున్న ' సౌదీ కూటమి..అంటే అగ్రదేశాలైన అమెరికా, బ్రిటన్, ఆరబ్ ఎమిరేట్స్, బహ్రేన్, కువైట్, కతార్, ఈజిప్ట్ వంటి అనేక శక్తివంతమైన దేశాల సమూహం ఒక యెమన్ అనబడే బక్కదేశ పేద ప్రజలపై భీషణ దాడి చేస్తూ సాగిస్తున్న ధ్వంస చర్య అని... ఏమిటిది.. ఎందుకిలా.. ఇంత అమానుషంగా.. ఎంతో సంస్కారవంతులైన అగ్రరాజ్య ప్రభుత్వాలు వ్యాపారంకోసం, ఆధిపత్యం కోసం సభ్య ప్రపంచ కోటాను కోట్ల సహ మానవుల ముందు ఇంత కర్కశంగా, నిస్సిగ్గుగా హత్యాకాండను కొనసాగిస్తూండడం.. ఎందుకు.?

ఉహూ తన దేశంలోని ప్రజలను షియా, సున్నీ మతస్థులుగా విడగొట్టి, యెమన్ దేశస్థులే ఐన హౌతీలు ఇరాన్ వంటి దేశపు రాజకీయ వ్యూహపు ఉచ్చులో పడి వాళ్ళదగ్గరినుండి కోట్లకొద్ది రూపాయల ఆయుధాలను కొంటూ తమ సోదర సహ దేశవాసులను ఈ విధంగా నిశ్శేషం చేస్తూ పోవడం ఏమిటి.

అగ్రదేశాలన్నీ ఈ యెమన్ దీర్ఘకాలిక యుద్ధంలో ఎవరికివారు ఆయుధాలను అమ్ముకుంటూ, పైకి మృతులపట్ల సానుభూతిని ప్రకటిస్తూ జరుగుతున్నదాన్ని ప్రపంచ విషాదంగా అభివర్ణిస్తూ.



ఈ అపరిశుభ్ర వాతావరణంలో దేశమంతా ఒకవైపు కలరా వంటి మహమ్మారి రోగాలు వేలకు వేలుగా ప్రజలను మృత్యుకుహరంలోకి తరలించుకుపోతూంటే.. 'కరోనా' వంటి అంతుచిక్కని భయంకర రోగం  వేలకు వేల జనాన్ని భూగర్భంలో పూడ్చిపెడ్తూంటే.. ఏమిటిది.. ఏం జరుగుతోందసలిప్పుడు.. ఇక్కడ.

మనుషులు తరతరాలుగా హావ్స్ అండ్ హావ్ నాట్స్ మధ్య జరుగుతున్న పోరాటంలో బానిస సంకెళ్ళను తెంచుకుంటూ, స్వేచ్ఛ కోసం, స్వతంత్రం కోసం పరితపిస్తూనే తమను తాము విముక్తం చేసుకుంటూ.. ఆకాశంలో ఎగిరే పక్షుల్లా రూపొందించుకుంటున్నామనుకుంటున్న తరుణంలో.....

నిజానికి వర్తమాన ప్రపంచంలో ఎక్కడ స్వేచ్ఛ పరిఢవిల్లుతున్నదో అర్థం కావడం లేదు. పెద్ద పాములు చిన్న పాములను చంపేస్తూనే ఉన్నయ్. పీతిరి గద్దలు పక్షి పిల్లలను తన్నుకు పోతూనే ఉన్నయ్. ఆయుధాల రూపంలోనో, ఫార్మా మందుల రూపంలోనో వ్యాపార దేశాలు కూటముల పేరుతోనో అనేక పిట్ట దేశాలపై ఆంక్షలు విధిస్తూ, మాఫియాలుగా ఏర్పడ్తూ, ఇంటర్నేషనల్ బాలిస్టిక్ మిస్సైల్స్ను చంకల్లో పెట్టుకుని భయపెడ్తూనే ఉన్నయ్. రాక్షస హంతకుడైన నార్త్ కొరియా అధ్యక్షుడు కిం జోంగ్ ఉన్ గానీ, చైనా అధ్యక్ష నియంత జింపింగ్ గానీ ఎవరినైనా భయపెట్టడమే గాని భయపడ్డం అనేది ఉందా. ఎక్కడైనా మానవ హక్కులు.. ధర్మపాలన ఉన్నాయా అసలు ఇంత అభివృద్ధి చెందినామని చెప్పుకుంటున్న వర్తమాన వసుధైక సమాజంలో. ఎవనికీ ఈ ప్రపంచంలో 'ప్రేమ' పట్ల విశ్వాసంలేదు. ఉన్నదంతా భయం. భయపెట్టడం.. భయపడ్డం మాత్రమే.

ఇప్పుడు ఒక ప్రపంచ విషాదంగా పరిణమిస్తున్న యెమన్ దేశ దుఃఖం వెనుక ఉన్నదంతా కూడా భయమేనా.

డాక్టర్ ఉష మెల్లగా ఆ శవాల దిబ్బనుండి లేచి నిలబడి... మెల్లగా ప్రక్కనే ఉన్న ఎత్తైన కూలిన గోడలను ఆనుకుని నక్కి నక్కి.... నడుస్తూంది. ఏ శిథిల భవనపు కిటికీ సందులోంచి ఏ స్నైపర్ కాలుస్తాడో అని భయపడ్తూ.

యెమన్ గతంలోకి తొంగి చూస్తే... 1999 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో అలి అబ్దుల్లా సాలెహ్ 92.6% ప్రజల ఓట్లతో అధ్యక్షుడై, మళ్ళీ 2006 ఎన్నికల్లో 77.2% శాతం ఓట్లతో రెండవసారి అధ్యక్షుడై.. సనా నగరాన్ని రాజధానిగా చేసుకుని పరిపాలించి.. 4 డిసెంబర్, 2017లో.. ఒకప్పటి ప్రజాభిమాన నాయకుడే ప్రజల ఆగ్రహానికి గురై.. దేశాన్ని విడిచి పారిపోతూండగా ఒక హౌతీ స్నైపర్ తుపాకీ బుల్లెట్లకు బలై చనిపోవడం... విచిత్రమైన విషాదమేకదా. కాలం బలీయమై చరిత్రను శాసిస్తూ మనుషుల భవిష్యత్తును నిర్మిస్తుందా విధికృతంగా అనిపిస్తూంటుంది అప్పుడప్పుడు.

సుదీర్ఘ మానవ చరిత్రలో ఎందరో నియంతలు కాలగర్భంలో కలిపోయారుగాని ఏ ఒక్కరైనా విధిని ఎదిరించి నిలబడి బుజువు చేసుకున్నారా తమను తాము శాశ్వతులై.

'ఇప్పుడు యెమన్ను అధ్యయనం చేద్దామని వచ్చిన తను ఒక్కసారి సంలీనమైపోయిన ఒకప్పటి నార్త్ యెమన్, సౌత్ యెమన్ ప్రాంతాలన్నింటినీ పర్యటించి.. ఈ అంతర్యుద్ధ కాలంలో 19000 దాడులకు లోనై.. 29 మిలియన్ల జనాభా 24 మిలియన్ల జనాభాగా మాత్రమే శేషమై మిగిలిన ధ్వంస యెమన్ను అర్థం చేసుకోవాలని....

ఒక అంతర్జాతీయ మీడియా వ్యాన్ కనిపించింది ఉషకు అనూహ్యంగా. వెంటనే ఆమె తమ రక్షిత కోడును తెలియజేస్తూ

**సమాజాన్ని తనదైన ఒక ప్రత్యేక కోణంలో చూడ్డంవల్ల ప్రొఫెసర్ ఉష తనను తాను ఒక విలక్షణమైన వ్యక్తిగా రూపొందించుకుంది. ఆ విలక్షణతవల్ల ఆమె ఈ ప్రపంచంలోని అతి దుఃఖిత , అతి పేద, అతి దయనీయ స్థితిలో ఉన్న మెడగాస్కర్, సౌత్ ఆఫ్రికా, అఫ్ఘనిస్తాన్, యెమన్, సూడాన్, మొజాంబిక్, మెక్సికో, నైజీరియా వంటి అనేక దేశాలను సందర్శించి కొన్ని నిర్దుష్టమైన అభిప్రాయాలను ఏర్పర్చుకుంది.**

చేతులను విన్యాసపర్చింది. దాంట్లో యెక్కి 'హమ్మయ్య' అని ఊపిరి పీల్చుకుని, ప్రెసిడెంట్ అబ్దుబ్బుల్ మన్సూర్ హాది రాజధాని సనా నగరాన్ని విడిచి అనివార్య పరిస్థితుల్లో ఏడెన్ నగరాన్ని ఆపద్ధర్మ రాజధానిగా ప్రకటించి... సౌదీ అరేబియా చేతుల్లో కీలు బొమ్మగా మారి రియాదుకు పారిపోయి.. వర్తమానాన్ని శూన్యం చేసిన తర్వాత.

ఉష "వ్యానును ఏడెన్ దిక్కు పోనీయండి" అని అభ్యర్థించింది డ్రైవరును.

★ ★ ★

ఏడెన్ తీరప్రాంత నగరంవైపు ప్రయాణిస్తున్న ఉష మధ్యలో అనేక పట్టణాల్లో ఆగి ఎందరినో సాధారణ పౌరులను కలిసి మాట్లాడింది. ఎవరిని కదిపినా కన్నీళ్ళే పొంగుతున్నాయి అందరిలోనూ. పిల్లల, వృద్ధుల శవాలకు కొదువే లేనట్టు చెల్లాచెదురు మృతదేహాలు అంతటా. అసలు ఎందుకు ఈ మారణకాండ అని లోతుగా గమనిస్తే.. చాలా స్పష్టంగా అర్థమైన విషయమేమిటంటే ఇది రెండు శక్తివంతమైన.. సౌదీ అరేబియా, ఇరాన్ల మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరు. రెండు ఎద్దులు కుమ్ముకుంటున్నపుడు మధ్య లేగదూడల కాళ్ళు విరిగిపోతై. యుద్ధాలెప్పుడూ వ్యూహాత్మకమై బలహీనున్ని బలిచేసి ముగిసిపోతై. హాడి ప్రాణభయంతో సౌదీ నగరం రియాదుకు పారిపోయిన తర్వాత రెండు శిబిరాలుగా విడిపోయి తలపడి సమసిపోని సంక్షోభాన్ని సృష్టించి మిలియన్ల మంది ప్రాణాలను బలితీసుకుంటున్నాయి. సౌదీ మరియు ఇరాన్ తమ తమ రాజకీయ స్నేహితుల్ని కూటములుగా ఏర్పర్చుకుని. లక్షలమంది అమాయకులను హననం చేసిన ఈ దుష్కార్యం, చరిత్ర క్షమించని ఉద్దేశ్య పూరిత నేరం.

రియాద్లో ఉన్న ప్రెసిడెంట్ హాడి ఒక మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసి మొత్తం

> **ఈ అపరిశుభ్ర వాతావరణంలో దేశమంతా ఒకవైపు కలరా వంటి మహమ్మారి రోగాలు వేలకు వేలుగా ప్రజలను మృత్యుకుహరంలోకి తరలించుకుపోతూంటే.. 'కరోనా' వంటి అంతుచిక్కని భయంకర రోగం వేలకు వేల జనాన్ని భూగర్భంలో పూడ్చిపెడ్తూంటే.. ఏమిటిది.. ఏం జరుగుతోందసలిప్పుడు.. ఇక్కడ.**

మంత్రులను ఒక ప్రత్యేక విమానంలో 30 డిసెంబర్, 2020న ఏడెన్ నగరానికి పంపాడు. విమానం ఏయిర్పోర్టులో ల్యాండ్ అవుతుండగా అకస్మాత్తుగా ఒక మిస్సైల్ దాడి జరిగింది. తదాదిగా వరుసగా మూడు క్షిపణులు వచ్చి పడి 30 మందిని హతమార్చి, దాదాపు వందమందిని తీవ్రంగా గాయపర్చాయి. ఈ ఘటన మళ్ళీ ఆరిపోతున్నట్టనిపించిన పరిస్థితిని అగ్నిగుండంగా మార్చింది. ఇది ఇప్పట్లో ఆరిపోయే నిప్పు కాదు.



రాజకీయాలు చాలా నిర్దయగా, వ్యూహాత్మకంగా, స్వార్థపూరితంగా మాత్రమే ఉంటూ నిశ్శబ్దంగా నిర్వహించబడ్తాయని డాక్టర్ ఉష మళ్లీ ఒకసారి రూఢి పర్చుకుంది.

మానవ హక్కులు, పౌర బాధ్యతలు.. ఇవన్నీ వింటానికి మాత్రమే పనికొచ్చే పుస్తకాల్లోని అందమైన మాటలు.

ప్రతి యుద్ధంలోనూ అంతిమంగా బలైపోయేది ఆ యుద్ధానికి సంబంధమే లేని అమాయకులు మాత్రమే.

చరిత్రలో ప్రతి రాజకీయవేత్త తను అధికారంలో ఉండేందుకు ఏ దుష్కార్యాన్నైనా చేస్తాడు. రాజకీయాల్లో ఆధిపత్యమూ, అధికారమే అంతిమ పరమావధి.

ఐతే... ఈ రాజకీయ దుర్మార్గాలు దీర్ఘకాలిక ప్రాతిపదికపై మాత్రమే తమ ప్రభావాన్ని చూపిస్తూ సమాజాలను భ్రష్టు పట్టిస్తాయి.

డాక్టర్ ఉష తన యెమన్ పర్యటనలో అనేకానేక వందల శవాల వీక్షణతో చాలా దుఃఖితయై... భారమైన హృదయంతో సౌదీ అరేబియా రాజధాని రియాదుకు చేరి.. డైరెక్ట్ ఫ్లైట్లో హైదరాబాదుకు చేరుతూ..,

★ ★ ★

మాతృభూమి.

మాతృభూమిపై ఎవరికైనా కన్నతల్లిమీదికంటే అమితమైన ప్రేమే ఉంటుంది.

ఉష విమానం దిగి... బయటికొచ్చి ఉబర్ ట్యాక్సీలో కూర్చుని... గాజు పలకపై జారిపోతున్న గాజు గోళీలా వెళ్తున్న కారులోనుండి రోడ్డుకు ఇరువైపులా వేలాదిగా కనబడ్తున్న గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ ఎన్నికల బాపతు ఫ్లెక్సీల హంగామాను చూస్తూ అనుకుంది ఒక విశ్లేషకురాలిగా.

'మన దేశంలో ఎవరు ఎవరి గురించైనా ఏ సంకోచమూ లేకుండా ఏ అశ్లీల భాషలోనైనా బహిరంగంగా మాట్లాడవచ్చు. ఏ వ్యక్తయినా తనకు నచ్చిన పనిని నిరభ్యంతరంగా ఏ భయమూ లేకుండా చేయవచ్చు. ఇక్కడ స్వేచ్ఛ అనేది విశృంఖలత్వంగా మారి ప్రస్తుతం విచ్చల విడితనంగా వర్ధిల్లుతోంది. వ్యవస్థల పతనాలు బహువిధాలు.

వ్యాసం

# భారత స్వాతంత్ర్యానంతర అభ్యుదయ సాహిత్యంలో స్త్రీల కవిత్వం

**స్వాతంత్ర్యానంతరం బహుముఖాలుగా కదిలిన కవయిత్రుల కవిత్వం గురించి...**



డా॥ ఎస్వీ సత్యనారాయణ

20వ శతాబ్దం ప్రజా ఉద్యమాలది. విముక్తి పోరాటంలో పదునెక్కినది. స్వాతంత్ర్యోద్యమాలతో ప్రజ్వలించినది. అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయ, సాంస్కృతికోద్యమాలతో సుసంపన్నమైనది. సహజంగానే ఆయా ఉద్యమాల ప్రభావం సాహిత్యంపై కనబడుతుంది. అలాగే ఆయా ఉద్యమాలకు సాహిత్యం ఊపును కల్పించింది. కందుకూరి 'సంఘ సంస్కరణోద్యమం', గురజాడ వారి 'సాహిత్య సంస్కరణోద్యమం', గిడుగు వారి 'భాషా సంస్కరణోద్యమం' తెలుగునాట ఉదయించిన అన్ని సాహిత్యోద్యమాలకు కావలసిన పూర్వరంగాన్ని ఏర్పాటు చేశాయి.

తెలుగునాట సంఘ సంస్కరణోద్యమాల ప్రభావంతో, జాతీయోద్యమ ప్రభావంతో శ్రీమతి తల్లా ప్రగడ విశ్వసుందరమ్మ, పి. సీతారామమ్మ, దేవులపల్లి సత్యవతమ్మ, వెలువోలు వసంతాదేవి, దేశిరాజు భారతీదేవి, జె. కామేశ్వరి, ఇనగంటి రత్నమ్మ, పరుచూరి భువనేశ్వరి, ఒలేటి నిత్య కళ్యాణమ్మ, కనపర్తి వరలక్ష్మమ్మ మొదలైన కవయిత్రులు తమ కవితల్లో సామాజిక రుగ్మతలను నిరసించారు. భారత స్వాతంత్ర్యాన్ని ఆకాంక్షించారు. కొందరు ప్రత్యక్షంగా జాతీయోద్యమంలో పాల్గొన్నారు. మరికొందరు తమ రచనల ద్వారా ఉద్యమానికి ఊపిరులూదారు.

రెండవ ప్రపంచ యుద్ధకాలంలో వట్టికొండ విశాలాక్షి, మోటూరి ఉదయం ఫాసిస్టు వ్యతిరేక గీతాలను రచించారు. సోషలిస్టు శక్తుల విజయాన్ని ఆహ్వానించారు. వీరి ఉద్యమ సాహిత్య వారసత్వాన్ని కొనసాగించిన అభ్యుదయ రచయిత్రులు తమ సమకాలీన సామాజిక సమస్యలపై స్పందిస్తున్నారు. సమ సమాజ నిర్మాణాన్ని ఆకాంక్షిస్తూ రచనలు చేస్తున్నారు.

1934 నాటికి 'కమ్యూనిస్టు ఉద్యమం' ఆంధ్ర ప్రాంతానికి విస్తరించింది. 1934 సెప్టెంబర్ లో విజయవాడలోని పటమటలో కాట్రగడ్డ నారాయణరావు గారి తోటలో 'కమ్యూనిస్టు పార్టీ' సమావేశం జరిగింది. పుచ్చలపల్లి సుందరయ్య కార్యదర్శిగా, ఏడుగురు సభ్యులతో కూడిన ఆర్గనైజింగ్ కమిటీ ఏర్పడింది. ఆంధ్ర ప్రాంతంలోని వివిధ జిల్లాల్లో పార్టీ శాఖల్ని నిర్మించాలనీ, రాష్ట్ర వ్యాపితంగా అతివాద భావాలు గల యువజన విద్యార్థుల్ని సమీకరించాలనీ, రాష్ట్ర వ్యాపితంగా కూలి రక్షణ సమితుల్ని ఏర్పరిచి కార్మికుల్లో పనిచేయాలనీ నిర్ణయించారు. అలాగే క్రమంగా వివిధ ప్రజా శ్రేణుల్ని ఉద్యమోన్ముఖం చేయడానికి వీలుగా 'ప్రజాసంఘాల' నిర్మాణానికి వామపక్ష ఉద్యమం పూనుకున్నది. బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలన నుండి విముక్తి తక్షణ కర్తవ్యంగానూ, వర్గరహిత సామ్యవాద సమాజ నిర్మాణం అంతిమ లక్ష్యంగానూ కలిగిన 'వామపక్ష ఉద్యమం వివిధ ప్రజా సమూహాలను సమీకరించసాగింది. ఇందులో భాగంగానే 1987 నాటికి కృష్ణా జిల్లా మహిళా సంఘం ఏర్పడింది.

స్త్రీల సమస్యలపై పాటలను కోరుతూ కాట్రగడ్డ హనుమాయమ్మ విజ్ఞప్తి చేశారు. మంచి పాటకు పది రూపాయలు బహుమతిని ప్రకటించారు. దండమూడి సత్యనారాయణ గారి గీతానికి ప్రథమ బహుమతి (పది రూపాయలు), పోలెంరెడ్డి బుజ్జమ్మ గారి గీతానికి ద్వితీయ బహుమతి (అయిదు రూపాయలు) లభించాయి. ఫాసిస్టు వ్యతిరేక పోరాటానికి స్త్రీలు కదిలిరావాలని ప్రబోధించిన వట్టికొండ విశాలాక్షి గారి 'ప్రబోధము' గీతం విశేష ప్రచారాన్ని పొందింది.

1943 జనవరి - ఫిబ్రవరి మాసాల్లో బెజవాడలో 30 రోజుల పాటు రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యాన మొట్టమొదటి రాష్ట్ర మహిళా రాజకీయ పాఠశాల' నిర్వహింపబడింది. 5 జిల్లాల నుండి 22 మంది మహిళా ప్రతినిధులు హాజరయిన ఈ పాఠశాలలో భారత దేశ చరిత్ర, రాజకీయ భూగోళం, జాతీయ, అంతర్జాతీయ రాజకీయాలు, ప్రసూతి,

వ్యాసం

శిశుపోషణ, ఆరోగ్యం - పారిశుధ్య విధులు మొదలైన అంశాలను బోధించారు. డ్రిల్లు, కర్రసాము వంటి ఆత్మ రక్షణోపాయాలు నేర్పించారు. ఆ తరువాత జిల్లాస్థాయి 'మహిళా శిక్షణా తరగతులు' అనేక జిల్లాల్లో జరిగాయి.

ఈ అనుభవాలతో ఏర్పడిన 'ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య' నాటి నుండి నేటి దాకా అఖిల భారత మహిళా సమాఖ్య'కు అనుబంధంగా పనిచేస్తూ స్త్రీల హక్కులకోసం నిరంతర పోరాటాలు నిర్వహిస్తున్నది. వామపక్ష ఉద్యమంలో భాగంగానే తెలుగు నేలపై 1940 దశకం నుండి అభ్యుదయ సాహిత్యోద్యమం, ప్రజానాట్యమండలి సాంస్కృతికోద్యమం ఒకవైపు లిఖిత సాహిత్య రూపాలను, మరోవైపు ఆశుసాహిత్యాలను ప్రభావితం చేస్తూ, ప్రజల జీవితాలను చిత్రిస్తున్నాయి.

ఆధునిక సాహిత్యంలో రూపంలోనూ, వస్తువులోనూ, భాషలోనూ, భావ ప్రకటనలోనూ అనేక నూతన ధోరణులు వికసించడానికీ, సంకోచాలు లేకుండా వివిధ ప్రజాశ్రేణులు స్వేచ్ఛగా తమ అనుభూతులనూ, అనుభవాలనూ ప్రకటించడానికి మార్గ నిర్దేశం చేస్తూ విస్తరిస్తున్న మహోద్యమం అభ్యుదయ సాహిత్యం.

భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో వలస పాలనకు వ్యతిరేకంగా రచనలు చేసిన అభ్యుదయ రచయిత్రులు, స్వాతంత్ర్యానంతరం సమకాలీన సమాజ సమస్యలపై తమ కవితాస్త్రాలను



నాయిని కృష్ణకుమారి



కనపర్తి వరలక్ష్మమ్మ

సంధిస్తున్నారు.

1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్ర్యం లభించినప్పటికీ, నిజామాంధ్ర ప్రాంతం మాత్రం నిరంకుశ నైజాం పరిపాలన క్రింద మగ్గింది. ప్రజలు విముక్తి కోసం పోరాటాన్ని కొనసాగించారు. ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో వీరోచిత తెలంగాణా సాయుధ రైతాంగ పోరాటం ప్రజ్వరిల్లింది. ఈ పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొన్న సిహెచ్. కమల, తన భర్త అప్పన్నతో కలిసి రాసి, పాడిన గీతంలో

'రండ దొరల రజాకార్ల జూసారూ
ప్రజలు నడుంకట్టి రణమందు
దూకారూ
ముసలమ్మలు ముసలయ్యలు
లేచారు
వారి చేతికందిన కర్ర బడితెలే
బట్టారూ అంటూ పోరాట చిత్రాన్ని చిత్రించారు. అలాగే నకిరేకల్లు ప్రాంతంలో స్త్రీలు నాట్లు వేస్తూ...

'అమ్మ
కలువబోదాము
వస్తారమ్మా
అమ్మ కలికి రారో
మనలను కాపాడే రష్యా!
అమ్మ దూరము
శానున్నదమ్మా వాపి
నడిచేటి వారైతే రండూ
మాయమ్మ' అంటూ

దీర్ఘకాలిక పోరాటాలకు
సమాయత్తం కావాలని
పిలుపునిచ్చారు. పోరాటంలో అసువులు బాసిన అమర వీరులను స్మరిస్తూ స్మృతిగీతాలు పాడారు. 'ఉయ్యాల పాట' బాణీలో బి. స్వరాజ్యం (1946) రాసిన గీతాన్ని "వీర మట్టారెడ్డి ఉయ్యాలో... ధీర అనంతారెడ్డి ఉయ్యాలో...
మరువమెన్నటికైన ఉయ్యాలో.... అంటూ ప్రారంభించి

పాత సూర్యాపేట ఉయ్యాలో -
పోరాటమును జూడు ఉయ్యాలో
పురుషులూ లేనపుడు ఉయ్యాలో -
పల్లెలో స్త్రీలంత ఉయ్యాలో
పరువు కాపాడుకొన ఉయ్యాలో -
బయలుదేరినారు ఉయ్యాలో
శీల రక్షణ కొరకు ఉయ్యాలో -
స్త్రీలంతా కూడారు ఉయ్యాలో
లారీల చుట్టేసి ఉయ్యాలో - లడాయి
జేశారు ఉయ్యాలో
ప్రజల బలమూజూసి ఉయ్యాలో -
పారిపోయిరి వాళ్లు ఉయ్యాలో
పౌర హక్కుల కొరకు ఉయ్యాలో -
పోరాటమిది యమ్మ ఉయ్యాలో
ఝాన్సీ లక్ష్మీ చరిత ఉయ్యాలో -
చాటి చూపాలమ్మ ఉయ్యాలో
మన ప్రజల రాజ్యమును ఉయ్యాలో -
పొంది తీరాలమ్మ ఉయ్యాలో
అనే ఆకాంక్షను వ్యక్తం చేశారు.

నా నులి వెచ్చని రక్తముతో
కల్పి
చల్లిన అన్నము
బలిముద్దా?
నీ తొలిముద్దా.?
అంటూ బలివితర్ది పై కవితలల్లారు రాజేశ్వరీ రాణి.

ప్రజల పోరాటాలతో నిజాం సంస్థానం విముక్తమయ్యింది. ఇండియన్ యూనియన్‌లో విలీనమయ్యింది. 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' నినాదంతో తెలుగు ప్రజలు ఉద్యమించారు. 1956 నవంబర్ ఒకటిన దేశంలోనే మొట్టమొదటి భాషా ప్రయుక్త రాష్ట్రం ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడింది.

'రమ్య గౌతమి కృష్ణాతరంగిణుల వి
నూత్న సలిల సుస్నాత మనోజ్ఞమూర్తి
పచ్చపైరుల క్రొంబట్టు వలవ గట్టి'
కీర్తి తిలకంబు దిద్దిన గేస్తురాలు
మందహాస రుచుల్మొగ మందు దోప
జయపతాకము జివురు హస్తముల
బట్టి
విజయ గర్వము మానససీమ
వింతగొలుప
నిలిచియున్నది యొక
మహనీయురాలు' అంటూ ప్రారంభించిన
కవితాంతంలో...

అమ్మ, మా యవనీమాత,
యాంధ్రమాత
తల్లి, భాషామతల్లి మా తల్లి, యామె
రాజ్యలక్ష్మి స్వరూపిణీ, రత్నగర్భ
కీర్తి బాడెద సతము కెంగెలు మోడ్చి
అంటూ ఆంధ్రావతరణానికి
కైమోడ్పులర్పించారు. అలాగే శ్రీమతి
తల్లాప్రగడ విశ్వసుందరమ్మ...

పెంచి పెద్దను జేసిన ప్రేమమూర్తి
తల్లితో సమమైనదీ ధరణి మనకు
ఆంధ్ర రాష్ట్రమె
బలమిచ్చునందరకును
ఆంధ్ర భాషాభివృద్ధికి నదియె త్రోవ
అనే ప్రబోధాన్ని ప్రకటించారు

దేశం స్వాతంత్ర్యాన్ని సంపాదించింది.
తెలంగాణా విముక్తిని సాధించింది.
ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. అయినా ప్రజల
సమస్యలు తీరలేదు. ప్రజారాజ్యం
ఏర్పడలేదు.

ఈ పరిస్థితిని నిరసిస్తూ...

ఈ దేశం రత్న గర్భ - ఈ దేశం
ధన్యచరిత
దొరతనం నేడు నల్లవారి పాలైనది
డేగరెక్క నీడ చేరి కోటగోడ
కూల్చారని
హూంకరించు ఈ దేశం -
డేగముందు కోడిపిల్ల
పట్టపగలు పడతి పరువు నడి
బజారున తీయగలదు
బట్టబయలు మార్కెట్లో నల్ల సరుకు
అమ్మగలదు
ఈ దేశపు యంత్రాంగం ఈ దేశం
సోషలిజం
ఈ దేశం మాన్యచరిత - ఈ దేశం
పుణ్యచరిత
అంటూ సవిమర్శక వాస్తవికతా
గీతమాలపించారు. శ్రీమతి టి. వాణీ
రంగారావు.

ఈ దేశంలో ఎవ్వడైనా ఏమైనా
చేసుకోవచ్చు
ఎందుకంటే, ఇది ప్రజాస్వామ్య దేశం
కదా!
ఊపిరి పీల్చనూ వచ్చు విడవనూ
వచ్చు
చివరికి తీయనూవచ్చు
అనే పంక్తుల్లో బూర్జువా
ప్రజాస్వామ్యం ముసుగును తొలగించి
చూపుతున్న కవయిత్రి సువర్ణ.

స్వతంత్ర భారతంలో స్త్రీల
స్థితిగతులను వర్ణిస్తూ శ్రీమతి వట్టికొండ
విశాలాక్షి

పేరుగాంచిన యట్టి భారతావనిలోని
స్త్రీ సమాజము మిగుల -
చెరవడుటలు గాంచి
కన్నీరు గార్చకుము ఓ సోదరీ!
కరిగినీరైపోకుమా సోదరీ...
నిస్సహాయ స్థితిని - నిస్తబ్ధురాలివై,
నీ స్థితిని ఒకమారు - నిండారు
తలచుకొని
కళ్ళ నీళ్ళకు ఫలము ఓ సోదరీ -
కలకాలమేడ్చుటే!
మాతృకాలము నాటి- మానవుని
చరితమ్ము
తరిచి తరిచీ నీవు - పరికించి చూచితే
హక్కులన్నింటిని ఓ సోదరీ -
అనుభవించినదెవరు?
వృత్తి విభజన జేసి - ఊడిగము
మనకిచ్చి
పురుష వర్గము వారు - బులిపించి
వేసారు
ఆర్థికముగా స్త్రీల ఓ సోదరీ! అణగ
దొక్కేశారు!
మీ మంచి చెడ్డలకు - మాదె
పెత్తనమంటు
అన్నింట మేమెయని - అడ్డువస్తూ
వుండి

**ఆధునిక సాహిత్యంలో రూపంలోనూ, వస్తువులోనూ, భాషలోనూ, భావ ప్రకటనలోనూ అనేక నూతన ధోరణులు వికసించడానికీ, సంకోచాలు లేకుండా వివిధ ప్రజాశ్రేణులు స్వేచ్ఛగా తమ అనుభూతులనూ, అనుభవాలనూ ప్రకటించడానికి మార్గ నిర్దేశం చేస్తూ విస్తరిస్తున్న మహోద్యమం అభ్యుదయ సాహిత్యం. భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో వలస పాలనకు వ్యతిరేకంగా రచనలు చేసిన అభ్యుదయ రచయిత్రులు, స్వాతంత్ర్యానంతరం సమకాలీన సమాజ సమస్యలపై తమ కవితాస్త్రాలను సంధిస్తున్నారు.**

వ్యక్తి స్వతంత్రత ఓ సోదరీ! యుక్తితో
లాగారు!
సూర్యరశ్మేమాకు - సోకకుండా చేసి
సుకుమారివని యెంతో -
చోద్యమ్ముగా పొగడి
పరదాల చాటునను ఓ సోదరీ!
చెరసాలనుంచారు!
బయటికెడితే నీదు - పరువు
మరియాదలకు
భంగమొదవు నటంచు - పలుమారు
వంచించి
బాహ్య ప్రపంచమున ఓ సోదరీ!
భయము కల్పించారు! అనడంతో పాటు
'బానిసత్వమ్మనెడి - బ్రహ్మ రాక్షసి
నోట
పడిపోవుటో లేక - బయటపడి
గెలుచుటో
నిజమైన మార్గాన ఓ సోదరీ!
నిలిచిమరి తేల్చుకో! అంటూ
చైతన్యయుతమయిన
పిలుపునిచ్చారు.

'మహిళా సమాఖ్య నాయకురాలు కీ.శే.
గుజ్జుల సరళాదేవి మహిళలను చైతన్య
పరిచే గీతాలు కొన్ని రచించారు.

వ్యాసం

మేలుకో మేలుకో చెల్లెలా - మేలుకోవే
చిట్టి చెల్లెలా!
ఉన్నవాళ్ళ ఇళ్ళలోనా - ఊడిగములూ
చేసుకుంటూ
పరులకోసం సొంత సుఖముల -
మరిచిపోయిన చెల్లెలా!
అనే వర్గ చైతన్యంతో పాటు...
అమ్మగారీ కాను పైనా - అయ్యగారీ
పానుపైనా
అన్ని పనులూ నెత్తినేసుక -
అణగిపోయిన చెల్లెలా

అనే పంక్తుల్లో శ్రామిక స్త్రీల లైంగిక దోపిడిని వర్ణించారు.

కులం కులం అనీ - కుత్సితాలు
పెంచుకోకూ కూటికి లేని వాడా
మతం మతం అనీ - మాత్సర్యం
పెంచుకోకూ దరిద్ర నారాయణుడా

అనే ప్రఖ్యాత గీతం రచించిన కీ.శే. విజయలక్ష్మి తన కవితల్లో... అనురాగం అంబరమై నవరాజ్యం ప్రభవించును సమతా సురసౌరభాలు జగమంతా నిండిపోవుననే చారిత్రక ఆశావాదాన్ని ధ్వనింపజేస్తున్నారు.

పరుగులిడుతున్న కాలాన్ని చూస్తూ
కరిగిపోతున్న ఓ అసమర్థజీవీ!
కాలానికి కళ్ళెం లేదు
ఆలోచనలకు ఆనకట్ట లేదు
ఆశలకు అంతులేదు
ఆశయాలకు కొలతలేదు' అంటూనే
'అభ్యుదయ జ్వాలల్లో ఆలోచనలను
పుటం వెయ్యి
మెరుగు పెట్టిన ఆశయాలను
మెలిపెట్టి సరికొత్త నగలాంటి
మరొక యుగాన్ని సృష్టించు నంటూ

శ్రీమతి ఎన్. జ్యోతిర్మయి 'కొత్త యుగానికి స్వాగతం పలుకుతున్నారు.

> **ప్రజల పోరాటాలతో నిజాం సంస్థానం విముక్తమయ్యింది. ఇండియన్ యూనియన్‌లో విలీనమయ్యింది. 'విశాలాంధ్రలో ప్రజారాజ్యం' నినాదంతో తెలుగు ప్రజలు ఉద్యమించారు.**



**శరత్ జ్యోత్స్నారాణి**

చుట్టూరా నెలకొని ఉన్న అసమ
సమాజంలో...
మాకు ముక్తి లేదాయని - మానవాళి
ఆక్రందన
దీనులైన నరుల గాంచి - దేవునిదీ
ఆక్రందన

అంటున్నారు వింజమూరి రాధారాణి.

సోవియట్ కవయిత్రుల కవితలను అనువదించి, ప్రకటించిన డా॥ పి. చిరంజీవినీ కుమారి తమ కవితల్లో సోషలిస్టు చైతన్యాన్ని ప్రదర్శిస్తున్నారు. విప్లవాన్ని ఆహ్వానించమంటున్న కీ.శే. యలమంచిలి తాయారమ్మ గారి కవితల్లో సమకాలీన సామాజిక సమస్యలు, వాటికి పరిష్కారంగా వర్గపోరాట ప్రబోధం ప్రస్ఫుటమౌతున్నాయి. తొలితరం ప్రజానాట్యమండలి కళాకారిణి శ్రీమతి తాపీ రాజమ్మ తమ కవితల ద్వారా గీతాల ద్వారా ప్రజా సమస్యల పై నిరంతరం ప్రతిస్పందిస్తూనే ఉన్నారు. సమాజంలో రోజు రోజుకూ పెరిగిపోతున్న కన్స్యూమరిజంపై తమ నిరసన గళాన్ని వినిపిస్తున్న శ్రీమతి అంగలూరి అంజనీదేవి కవితా సంపుటి 'గుండెలోంచి అరుణోదయంలో ఈతరం అభ్యుదయ కవుల నుండి గుండె ఘోషలు వినబడుతున్నాయి.

కుల నిరసన, మతోన్మాద ఖండన, అసమ సమాజం పై ఆగ్రహం, పాలకవర్గం పై అధిక్షేపం, అమరవీరుల స్మృతి, స్త్రీల అణచివేతపై ప్రతిఘటన, వర్గరహిత సమసమాజ నిర్మాణాకాంక్ష మొదలైన అంశాలను తమ కవితా వస్తువులుగా తీసుకుని స్వాతంత్ర్యానంతర అభ్యుదయ రచయిత్రులు కవిత్వాన్ని ప్రకటిస్తున్నారు.

శ్రీమతి యలమంచిలి తాయారమ్మ,తాపీ రాజమ్మ, డా॥ నాయని కృష్ణకుమారి, వాణీరంగారావు, పి. చిరంజీవినీ కుమారి, దాసరి విజయకుమారి, కొలకలూరి స్వరూప రాణి, డా॥ పి. సంజీవమ్మ, సిహెచ్. సుశీల, బండారు సుజాతాశేఖర్, పి.సరళ, ఎస్. శరత్ జ్యోత్స్నారాణి మొదలైన అభ్యుదయ కవయిత్రులు సామాజిక స్పృహతో కూడిన స్త్రీల కవిత్వానికి ప్రాతినిధ్యం వహిస్తున్న వారిలో ముఖ్యులుగా పరిగణింపవచ్చును.

'నా దేశం బూర్జువాలని భుజాల మీద మోస్తూ అన్న మెరుగని వెర్రి జనాన్ని కాళ్ల కింద కసాబిసా తొక్కేస్తూ - ప్రగతి ప్రగతంటూ పాలికేకలు పెడుతోందంటున్న (శ్రీమతి అత్తలూరి రాజ్యలక్ష్మి) వర్గ చైతన్యాన్ని ఈ తరం అభ్యుదయ కవయిత్రులు ప్రదర్శిస్తున్నారు. అలాగే...

పుట్టాక తల్లి దండ్రుల పిడికిట్లో
పెరుగుతుంది
పెళ్ళి అయ్యాక భర్త అడుగుల్లో
కాపురం చేస్తుంది
ముసలనాన సంతానం చిగురుల్లో
తనువు చాలిస్తుంది
ఆమె స్వేచ్ఛగా తిరిగేది - ఒక్క తల్లి
కడుపులోనే
(శ్రీమతి కొనకంచి శారదాదేవి)-

అంటూ స్త్రీవాద చైతన్యాన్ని కూడా అభ్యుదయ రచయిత్రులు తమ రచనల్లో ప్రదర్శిస్తున్నారు...

శ్రీమతి అడవికొలను పార్వతి, అయినవోలు అరుణాదేవి, డా॥ అల్లూరి రాజకుమారి, కోకా విమలకుమారి, చల్లపల్లి స్వరూపరాణి, ఐ.ఎస్. రమాదేవి, ఐ. కుసుమకుమారి, మాడభూషి వరలక్ష్మి, ఎం. ఉదయ, పచ్చిగోళ్ల సుధ, డా॥ దివాకర్ల రాజేశ్వరి, శ్రీమతి అంబికా అనంత్, వి. రామలక్ష్మి, ఆచంట హైమవతి మొదలైన అభ్యుదయ కవయిత్రులు తమ రచనల్లో పీడితవర్గ చైతన్యాన్ని, సమ సమాజ నిర్మాణా ఆంక్షనూ, స్త్రీల అణచివేతపై నిరసన ప్రతిఘటనలనూ వ్యక్తం చేస్తున్నారు.

# యానాంలో ఒకరోజు

## నవీన్ కథాసంపుటిపై సమీక్షా వ్యాసం...

వరిగొండ కాంతారావు

డా॥ అంపశయ్య నవీన్ గారు నవలాకారునిగా సుప్రసిద్ధులు. ఇప్పటి వరకు ముప్పది మూడు నవలలను రచించారు. రెండు జీవిత చరిత్రలను, తొమ్మిది వ్యాస సంపుటాలను వెలువరించారు. హన్స్ఇండియా దినపత్రికలో 'విగ్నెట్స్ ఆఫ్ లైఫ్' పేరిట (ఆంగ్లంలో) శీర్షికను చాలాకాలం నిర్వహించారు. లోగడ ఏడు కథా సంపుటాలను వెలువరించారు. ఇప్పుడు వారి ఎనిమిదవ కథాసంపుటం వెలువడింది. పేరు "యానాంలో ఒకరోజు".

ఇందులో పధ్నాలుగు కథలున్నాయి. మొదటి కథ పేరునే కథాసంపుటి పేరుగా నిర్ణయించారు. ఈ కథలన్నీ పత్రికలలో అచ్చయినవే.

కాకినాడలో సన్మానానంతరం యానాంలో ఒకరోజు కవిమిత్రులతో గడపగలందులకు వెళ్ళిన కథారచయిత గోదారిలో బోటు షికారు కెళ్తారు. వీరితో పాటు కొత్తగా పెళ్ళయిన జంట కూడా ఆ షికారులో భాగమౌతారు. పెళ్ళికూతురు తండ్రి వలన ఆ దంపతులకు ప్రాణాపాయం వున్నది. ఆ ప్రేమజంటకు యానాంలో పోలీసు రక్షణ కల్పిస్తారీ కవులు, రచయితలు. స్థూలంగా కథ యిది. ఇందులోని పాత్రలన్నీ యథార్థాలే. కవుల, రచయితల పేర్లు యథాతథంగా వున్నాయి. ఒక్క ప్రేమజంట పేర్లు తప్ప. బోటులో కవులు తమ కవిత్వాన్ని ఆశువుగా చదువుతారు. నవీన్ నవలలను వాని వైశిష్ట్యంతో సహా ఏకరువు పెడుతుందా పెళ్ళికూతురు. ఇంతకూ నవీన్‌గారా బోటులోనే వున్న సంగతి తెలియదామెకు. విషయం తెలిశాక ఆమె ఆశ్చర్యానందాలకు అంతం వుండదు.



పరిచయం లేకుండానే తన రచనలను అభిమానించే వ్యక్తి అకస్మాత్తుగా తారసపడడం ఏ రచయితకైనా ఆనందాన్నిచ్చే విషయమే.

రచయిత గొప్పతనమెక్కడంటే మనమంతా ఆ బోటులో షికారుకెళ్తాం. యానాంలోని గౌతమిని దర్శిస్తాం. బోటు నదిలో వెళ్ళినంత అలవోకగా వెళ్ళిపోతుంది కథనం. చదువరికి బుచ్చిబాబు, అడివి బాపిరాజు గుర్తుకు రావడం ఖాయం.

కరీంనగర్‌లోను, వరంగల్‌లోను ఫిలిం క్లబ్బులున్నాయి. వాని స్థాపనలో నవీన్ పాత్ర మరువరానిది. నవీన్‌కి సినిమాలంటే అభిమానం అని చెప్తే చిన్నమాట అవుతుంది. సినీరంగాన్ని కూలంకషంగా అధ్యయనం చేసిన వ్యక్తి ఆయన. ఆయన నవలల్లోనూ, కథల్లోనూ ఎక్కడో ఒకచోట సినిమాల ప్రసక్తి అనివార్యంగా వస్తూనే వుంటుంది. డెబ్భయ్యవ పడిలో పడిన మనిషికి సినిమాల పట్ల ఆసక్తి గతకాలానికి సంబంధించిం దనడం సహజం. నవీన్ గారికలా కాదు. సినిమాల పట్ల వారి ఆసక్తి ఇంకా నిత్యనూతనంగానే వున్నది. ఇటీవల వచ్చిన 'జానూ' అన్న సినిమాను చూచిన నవీన్‌కి తను కళాశాల విద్యార్థిగా ఉన్నప్పుడు

జరిగిన సంఘటనలు గుర్తుకు వచ్చాయి. ఆ జ్ఞాపకాలు "నా గుండెల్లో దాచుకుంటా" అన్న కథానికగా రూపొందాయి.

ప్రఖ్యాత రచయిత 'శైలేంద్ర' రాసిన "చీకటి మూసిన ఏకాంతం" నవలను చదివిన 'నీహారిక' ఆయనను హైదరాబాదుకు రమ్మని ఆహ్వానిస్తూ ఉత్తరం రాస్తుంది. కథా కాలానికింకా సెల్‌ఫోన్లు రాలేదు. మామూలు ఫోన్లు కూడా అందరిండ్లలోనూ ఉండే రోజులు కావవి. స్టేషనుకు వచ్చి రచయితను రైలు దింపుకొని తన కారులో ఊరంతా తిప్పుతుంది నీహారిక. ఇద్దరూ కలిసి 'ఉత్సవ్' సినిమాకు కూడా వెళతారు. ఆమె ఒక ప్రఖ్యాత సినీదర్శకుని కూతురు. రచయిత నవలలోని విషయం విడాకులు. ద్వేషంతో కలిసుండడం కన్న మిత్రులుగా విడిపోవడం మిన్న అన్నది ఆ నవల సారాంశం. అదీ చర్చకు వస్తుంది. ఆ రాత్రి రచయితను తమ ఇంట్లోనే ఉండి పొమ్మంటుంది. తమ పడకగదిలో రచయితకు ఏర్పాట్లు చేసి కూతురితో పాటు వేరేగదిలో పడుకుంటుంది నీహారిక. ఉదయమే బొంబాయి నుండి వచ్చిన ఆమె భర్త తమ పడకగదిలో ఉన్న రచయితను చూసి అప్రతిభుడవుతాడు. కోపగించుకొంటాడు. చేయని తప్పుకు క్షమాపణలు చెప్తూ బయటకు వచ్చేస్తాడు రచయిత.

తర్వాత కొన్నాళ్ళకు ఆ దంపతుల విడాకుల వార్త, ఆమె తండ్రి గొప్ప సినీదర్శకుడైనందున, పత్రికల్లో ప్రముఖంగా ప్రచురింపబడింది. కథ పేరు "అభిమాని". విడాకులు పొందగలం దులకు గాను రచయితను వాడుకున్న అభిమాని ఆవిడ. "ఉజ్వల" అనే సంస్థ ప్రతిఏటా తమతమ రంగాల్లో నిష్ణాతులైన కార్యతత్పరులను సన్మానిస్తూ ఉంటుంది. ఓ సంవత్సరం సినీరంగానికి చెందిన ఇద్దరు ప్రముఖులను తన కార్యక్రమానికి ఆహ్వానిస్తుంది. అందులో విశ్వేశ్వరరావు అన్న ప్రఖ్యాత దర్శకునికి సన్మానం వుంటుంది. టి.ఆర్.పి. రేటింగుకు తాపత్రయపడే ప్రసారమాధ్యమ విలేఖర్లు, వీడియో గ్రాఫర్లు, ఇంటర్వ్యూ చేసే నెపంతో, వేదికనెక్కి, దర్శకుడిని ఘెరావ్ చేసినంత పని చేస్తారు. సభకు వచ్చిన వారికి వేదిక కనపడకుండా పోతుంది. నిర్వాహకులు బలవంతంగా ప్రసార మాధ్యమాల వారిని వేదిక నుండి దించేస్తారు. మాధ్యమాల వాళ్ళు ధర్నా మొదలుపెడతారు. వచ్చిన అతిథులు కోపగించుకొని వెళ్ళిపోతారు. సభాసదులు నిరాశ చెంది వెళ్ళిపోగా, నిర్వాహకులు హతాశులవుతారు. రసాభాసకు కారణం ప్రసారమాధ్యమాలు. కాని మరునాటి పత్రికలో వచ్చిన వార్త- నిర్వాహకుల కారణంగా 'కళాబ్రహ్మ'కు ఘోరావమానం జరిగిందని. చిన్న సంస్థల వారు ప్రఖ్యాతులను పిలిస్తే వచ్చే కష్టాలను "అపశ్రుతులు"గా వివరిస్తుంది కథ. ప్రసార మాధ్యమాల ధాష్టీకాన్ని నిరూపించడంలో రచయిత కృత కృత్యులయ్యారు.

కరోనా కాలంలో ఏర్పడిన ఖాళీ సమయంలో ఈ కథలను రాశానని తమ ముందుమాటలో చెప్పుకొన్నారు నవీన్. ఇందులో మూడు కథలు కరోనాకు సంబంధించినవే.

ఆకలిదప్పులతో అలమటించిపోతూ వందలకొద్ది కిలోమీటర్లు కాలినడకన పయనించారు వలస కూలీలు. సుధీర్, గోపాల్ అన్న ఇద్దరు కూలీలు కరోనా కారణంగా పనులు నిలిచిపోవడంతో వరంగల్లులో చిక్కుకుపోయారు. వరంగల్లు నుండి వారి స్వగ్రామమైన మహబూబునగర్‌కు నడచిపోతుండగా వంగపల్లి దగ్గర తాగేందుకు మంచినీళ్ళు కూడా లభించక సుధీర్ మరణిస్తాడు. ఊరివాళ్ళు వడదెబ్బతో చనిపోయిన వ్యక్తి శవ దహనానికి సహకరించకపోగా శవం వల్ల కరోనా వ్యాపిస్తుందన్న భయంతో శవంపైన పెట్రోలు పోసి తగులబెట్టడానికి వస్తుంటారు. గత్యంతరం లేక ప్రాణభయంతో పారిపోతాడు గోపాల్. కష్టాల నధిగమించి సుఖపడాలన్న వారి ఆకాంక్షలు కథ మొదట్లో వర్ణితమైనాయి. వారి ఆకాంక్షలన్నీ అడియాసలైనాయి. కథ పేరు "నడకేరా అన్నిటికి మూలం".

కరోనా సమయంలోని ప్రాణభయం దురదృష్టవశాత్తు మనిషిలోని క్రూరత్వాన్ని వెలికితీసింది. ఎనభై తొంభై ఏళ్ళ క్రింద వచ్చిన గత్తర్ల (ప్లేగు, మశూచి, కలరా) కాలంలో ఊళ్ళకు ఊళ్ళు మరణించినా వ్యాధిగ్రస్తుల పట్ల ఇంతటి క్రూరత్వాన్ని తోటివారు చూపించిన దాఖలాలు లేవు. అందుకు భిన్నంగా సాటివారి సేవానిరతిని గురించి, వెలిబుచ్చిన సానుభూతిని గురించి కథనాలున్నాయి.

తల్లిదండ్రులకు తెలియకుండా సరదాగా గడిపొద్దామని హైదరాబాద్ నుండి బొంబాయికి వెళ్ళిన ఇద్దరు విద్యార్థి మిత్రులకు కరోనా కారణంగా తిరుగు ప్రయాణానికి వీలవదు. ఉన్న డబ్బులన్నీ ఖర్చయిపోగా ఆకలిదప్పులతో గుల్బర్గా నుండి కాలినడకన వారు హైదరాబాదు చేరుకొన్న వైనం పేరు "వినోద యాత్ర". కరోనా ఇబ్బందులను మాత్రమే కాక డబ్బున్న తల్లిదండ్రుల పిల్లలకుండే నిర్లక్ష్య ధోరణిని కూడ వర్ణిస్తుందీ కథ.

కరోనా కారణంగా కుటుంబ సభ్యు లందరూ ఆనందంగా కలిసి వుంటున్నారు అన్న విషయాన్ని ప్రసార మాధ్యమాలు విరామం లేకుండా ఊదర గొడ్తున్నాయి. ఎటూ వెళ్ళకుండా ఇరవై నాల్గు గంటలూ అందరూ ఒకేచోట ఉండడం వల్ల ఉత్పన్న మయ్యే సమస్యలను "సమాంతర రేఖలు" కథ చర్చిస్తుంది.

వాసంతి, కుమార్ భార్యాభర్తలు. ఎప్పుడో ఒకసారి మందుకొట్టి ఇంటికొచ్చే కుమార్, కరోనా పుణ్యమా అని ఇంట్లోనే తాగుతున్నాడు. ఇరవై నాలుగ్గంటలూ మత్తులోనే జోగుతున్నాడు. సాఫ్ట్‌వేర్ పుణ్యమా అని అతనిలో శృంగార భావనలు నశించి కామోద్దీపనం లేకుండా అయినాడు. పెళ్ళయి రెండేళ్ళు కూడ కాని దంపతుల మధ్య ప్రేమానురాగాలు నశించడంతో వాసంతి నిరాశ చెందుతుంది. కరోనా నుండి రక్షణ నిమిత్తం కుమార్ తన తల్లిదండ్రులను హైదరాబాదుకు తెచ్చుకుంటాడు.

వాసంతి తన తల్లిదండ్రులను కూడ తీసుకురమ్మంటుంది. వాసంతి అన్నగారు కూడ హైదరాబాదులోనే ఉంటున్నాడు. అతనికి సొంత కారుంది. వీరికి లేదు. కొడుకు బాధ్యతగా అతడే తన తల్లిదండ్రులను తెచ్చుకోవాలి, మనకు వీలవదంటాడు కుమార్. భార్యాభర్తల మధ్య ఘర్షణ జరుగుతుంది.

అత్తాకోడళ్ళ గొడవలో తల్లి పక్షం వహిస్తాడు భర్త. భార్యను కొడతాడు కూడ. స్నేహితురాలి సహాయంతో అత్త మామలపైన, భర్తపైన గృహహింస కేసు పెట్టేందుకు బయల్దేరుతుంది వాసంతి.

కుటుంబ సభ్యుల మధ్యన గల సర్దుబాటు లేమిని ఈ కథ చక్కగా వర్ణిస్తుంది. అత్తాకోడళ్ళు నేరుగా సమస్యలను చర్చించుకొంటే కుటుంబాలలో శాంతి వర్ధిల్లుతుంది. అత్తగారు కోడలిని తన కొడుక్కి భార్యగాను, కోడలు అత్తగారిని తన భర్తకు తల్లిగాను మాత్రమే భావించి మగవాణ్ణి వీలయినప్పుడు ఆయుధం గాను, వీలవనప్పుడు వార్తాహరుని గాను వాడుకున్నంత కాలం, అత్తాకోడళ్ళు ఒకరికొకరు పరాయి వారవుతారు. ఈ ప్రథ ప్రారంభమై సుమారు ఐదు దశాబ్దాలు కావస్తున్నది. అప్పుడు రాజుకున్న ద్వేషాగ్ని ఇప్పుడు ఎవరూ ఆర్పడానికి వీలుకాని దావాగ్నిగా మారిపోయింది.

విద్య వల్లనే సమాజం బాగుపడుతుంది. సరియైన విద్యను అందుబాటులోకి తెస్తే సమాజం మారుతుంది అన్న సదుద్దేశంతో పాతికమంది అధ్యాపకులు, డాక్టర్లు, ఇంజనీర్లు కలిసి ఆదర్శ పాఠశాలను నెలకొల్పుతారు. అధ్యాపకుడైన ఆనంద్ రచయిత కూడ. అతనికి కళాశాలలోనే కాక ఊళ్ళో కూడా చాలా మంచి పేరుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని స్వార్థరహితంగా తన వృత్తి ధర్మాన్ని నిర్వర్తిస్తున్న కామేశ్వరరావు అనే సహోద్యోగి పాఠశాలను ప్రారంభిద్దామంటాడు. విష్ణువర్ధన్ అని కొత్తగా వచ్చిన లెక్చరర్ తను ఆనంద్ గారి అభిమానినంటాడు. పాఠశాల నేర్పించే సంఘంలో తను చేరడమే కాకుండా మరో ఐదుగురిని చేరుస్తాడు. ఉపాధ్యాయులకు స్వతంత్రమివ్వడం, ఖర్చులు పోను మిగిలిన ధనాన్ని పాఠాలు చెప్పేవారికే అప్పచెప్పాలన్నది ఆదర్శం. రెండు మూడేళ్ళలోనే పాఠశాలను భ్రష్టుపట్టించి మూతపడేట్లు చేస్తాడు విష్ణువర్ధన్. కొత్తగా వచ్చిన వారిని నమ్మరాదు అన్న చిన్నయసూరి 'నీతిచంద్రిక' కథ గుర్తుకు వస్తుంది.




ఆనంద్ పట్ల గల అప్రకటిత ఈర్ష్యాసూయలు విష్ణువర్ధన్ చేత ఆ పనిని చేయించాయి. ఆనంద్ వ్యక్తిత్వ హననమే తన కర్తవ్యంగా ఉండింది. తమను తాము కమ్యూనిస్టులుగా ప్రకటించుకొని, వారి ఆదర్శాల పట్ల గాని, ఆ ఆదర్శాల ఆచరణ పట్లగాని లవలేశం కూడ గౌరవభావం లేని వ్యక్తులకు ప్రతినిధి విష్ణువర్ధన్. దురదృష్టవశాత్తు ఈ సమాజం వారినే గొప్ప ఆదర్శవాదులుగా భావిస్తుంది. ఈ కారణంగానే ఆదర్శ పాఠశాల మూతపడింది. మార్పును ఈ సమాజం అంత సులువుగా అంగీకరించదు అని చెప్పే కథ "మార్పు".

పున్నామ నరకాన్నుండి రక్షించేవాడు పుత్రుడని నానుడి. బ్రతికుండగానే తండ్రికి పున్నామ నరకాన్ని చూపించే కొడుకుల కథ "తండ్రులూ కొడుకులూ". కొడుకులు పెట్టే కష్టాల్నుండి ముసలి తండ్రులు తమని తాము కాపాడు కోవడానికి కావలసిన చిట్కాలను చెపుతుందీ కథ.

నిజాయితీపరుడైన పోలీసాఫీసరు అరెస్టు చేసిన నిజాయితీపరుడైన నక్సలైట్ కథ "అంతరాత్మ అపరాధ భావన".

ఉద్యమ జీవితానికి వైయక్తిక జీవితానికి మధ్య ఘర్షణ ఏర్పడినప్పుడు ఎంతటి ఉద్యమకారుడైనా క్షణకాలం పాటు కౌటుంబిక జీవనం వైపు మొగ్గుచూపుతాడు. మొగ్గుచూపడానికి కారణం పోలీసులు ఇవ్వజూపిన బహుమతి, తదుపరి కాలంలో లభింపనున్న ప్రశాంతకరమైన జీవితం. ఇందు నిమిత్తం మరొక వరిష్ఠ ఉద్యమ కారుని జీవితాన్ని పణంగా పెట్టాల్సివస్తే!

ఉన్నతశ్రేణి తీవ్రవాది పరశురాం దాక్కున్న స్థలం చెప్తే కైలాసానికి ధనమూ, స్వతంత్రమూ లభిస్తాయి. ఉద్యమానికి ద్రోహం చేయాలన్న చింతన కైలాసానికి ఏ కోశానా లేదు. పరశురాం ఉండడానికి అవకాశం లేదనుకొన్న స్థలాలు రెంటిని పోలీసాఫీసరు హరివిఠల్‌రావుకు చెప్తాడు కైలాసం. కైలాసం చెప్పిన చోట పరశురాం ప్రాణాలతో పట్టుబడ్డాడని చెప్తాడు హరివిఠల్‌రావు. ఉద్యమానికి ద్రోహం తలపెట్టినా అన్న అపరాధ భావనకు లోనవుతాడు కైలాసం. పుస్తకాన్ని మూసేసి పక్కన పెట్టినా, కథ మనల్ని వెంటాడుతూనే ఉంటుంది.

తనను తాను విపరీతంగా అభిమా నించుకోవడం అన్నది ఒక మానసిక వ్యాధి. సునందకు ఫోటోల పిచ్చి. ఎక్కడ ఏ ఫంక్షనైనా సరే తనా ఫంక్షనుకు వెళితే చాలు ఫోటోలు దిగాల్సిందే. వాటిని సేకరించి ఆల్బమ్స్‌లో పెట్టుకోవాల్సిందే. ఆ ఆల్బమ్స్‌ని తరచుగా చూచుకొని మురిసిపోవడమే కాక ఇతరుల కంటే తాను బాగున్నట్లుగా భర్తతో చెప్పించు కోవాలి. భర్త సుకుమార్‌కు ఇలాంటి పనులంటే చిరాకు. చిన్నచిన్న ఘర్షణలు

తీవ్రస్థాయికి చేరి విడాకుల వరకు వెళ్ళింది విషయం. పెద్దవాళ్ళ ప్రమేయంతో మానసిక వైద్యుని వద్దకు వెళతారు. దీన్ని 'నార్సిజమ్' అంటారని చెప్పి ఆయన కొంతకాలం వైద్యం చేశాడు. గుణం కనిపించకపోవడంతో ఆమెకు ఫోటోల పట్ల విరక్తి కలిగేలా చిట్కా చెప్తాడు. ఆమెను కురూపిగా చూపించడమే ఆ చిట్కా. తనను కావాలని ఫోటోలలో కురూపిగా చూపిస్తున్నారని ఆమె గ్రహించడంతో చిట్కా పనిచేయడం ఆగిపోయింది. ఆమెతో సరిపెట్టుకోవడమే వైద్యమంటాడు వైద్యుడు. కథపేరు "రూపం-ప్రతిరూపం".

సునంద అనారోగ్యం తీవ్రస్థాయికి చేరడానికి కారణం ఆమె భర్త సుకుమార్ ప్రవర్తన. రచయిత ఈ విషయాన్ని సూచించి వదలిపెట్టారు. ఫోటోల పిచ్చి అంతో ఇంతో అందరికీ వుంటుంది. సునందరకు కాస్త ఎక్కువగా వుంది. సుకుమార్ చెల్లెలి పెళ్ళిలో మిగతా కుటుంబ సభ్యులంతా ఫోటో సెషన్స్‌లో విపరీతంగా పాల్గొంటారు. సునంద 'మనం కూడా ఫోటోలు దిగుదా'మంటుంది. సుకుమార్ నిరాకరిస్తాడు. సుకుమార్ వ్యక్తిత్వంలో హిపోక్రసి వుంది. ఆడంబరాలకు పోయి డబ్బు ఖర్చుచేసే వాళ్ళంటే తనకు అసహ్యమంటాడు. కాని అటువంటివాళ్ళతో తన స్నేహాన్ని మాత్రం వదులుకోడు. చెల్లెలి పెళ్ళిలో భార్యతో కలిసి నాలుగు ఫోటోలు దిగి వుంటే ఆమె డిప్రెషన్‌కు లోనయ్యేది కాదు. ఇవన్నీ కథాంశాలుగా మనకు కనపడవు. కాని ఇవన్నీ రచయిత చెప్పినవే. అక్కడక్కడా విత్తనాలు చల్లి వదిలేస్తాడు రచయిత. పాఠకుడు ఆ విత్తనాల నుండి మొలకెత్తే మొక్కల్ని పట్టుకోగలగాలి.

"సమయం కోసం.." అన్నది 'మి టూ' ఉద్యమానికి సంబంధించిన కథ. వాసంతి, నిరంజన్ అధ్యాపక వృత్తిలో సహోద్యోగులు. నిరంజన్ కొంతకాలం వాసంతి వెంటపడతాడు. ఆ తర్వాత వాసంతికి నిజంగానే సాయం చేస్తాడు. వాసంతి నిరంజన్ ఒకటవుతారు. నిరంజన్ రాజకీయాల్లోకి వెళ్ళిపోయి వాసంతిని నిర్లక్ష్యం చేస్తాడు. వేరొక స్త్రీని పెళ్ళాడతాడు. ఎమ్మెల్యే అయిన నిరంజన్ వాసంతి పనిచేస్తున్న పాఠశాలకు ఏదో కార్యక్రమంపైన వస్తాడు. పాత సంబంధాన్ని పునరుద్ధరించుకుందామంటాడు నిరంజన్. వాసంతి స్నేహితురాలు సుహాసినిని కలుస్తుంది. 'మి టూ' ఉద్యమంలో భాగంగా నిరంజన్ చరిత్రను ప్రసార మాధ్యమాల ముందుంచుతుంది వాసంతి. మంత్రి కావలసిన నిరంజన్ ఉన్న ఎమ్మెల్యే పదవిని కూడా పోగొట్టుకుంటాడు. సమయాన్ని చూసి శత్రువును దెబ్బ కొట్టాలి అన్న సూచనతో కథకు "సమయం కోసం" అన్న పేరు పెట్టినట్లు తోస్తుంది.

పై కథలో వలెనే ఈ కథలో కూడా రచయిత 'మి టూ' పరిస్థితి ఉత్పన్నమవడానికి వాసంతి నడవడి కూడ దోహదకారి అని సూచ్యంగా చెప్పి వదిలేస్తాడు. వాసంతి తల్లి చనిపోయింది. ఆ తర్వాత ఒంటరితనంలో మనిద్దరం పెళ్ళి చేసుకుందామంటాడు నిరంజన్. ఇలాగే ఉండిపోదామంటుంది వాసంతి. ఇలాగే ఉండిపోదామన్నది పెళ్ళి బాధ్యత లేని సహజీవనంగా అర్థమైంది నిరంజన్‌కి. స్నేహితురాలిగా ఉండిపోతాననుకున్నది వాసంతి. స్త్రీ పురుష స్నేహంలో పురుషుని నైజాన్ని "అభిమాని" కథలో సైతం రేఖామాత్రంగా చెప్పి వదిలేశారు రచయిత. స్త్రీ పురుష స్నేహంలో కొన్ని పరిమితులుంటాయి. ముఖ్యంగా స్పర్శ. స్పర్శ కోరికలు చెలరేగడానికి దారితీస్తుంది. కోరిక హద్దులు దాటిన స్పర్శను కోరుకొంటుంది. మనస్సు శరీరాన్నదుపు చేయడం సంస్కారం. శరీరం మనస్సును స్వాధీన పరచుకోవడం ప్రకృతి. స్వాధీనం తప్పిన మనస్సు శరీరం అదుపులోకి వస్తుంది. శరీరం హద్దులు దాటాక స్త్రీ పురుషునికి లోకువవుతుంది. సమాజమంగీకరించిన సాంఘిక బంధమే స్త్రీ గౌరవాన్ని కాపాడి ఆమెకు రక్షణ కలిగించగలుగుతుంది. ఆ బంధం పేరు పెళ్ళి.

ఇదంతా కథలో ఉందా అంటే ఉంది. కథకుడు చెప్పాడా అంటే చెప్పలేదు. ప్రధానంగా చెప్పదలచుకొన్న విషయాన్ని సూచ్యంగా చెప్పి, కథను సాధారణ మార్గంలో నడిపించుకుపోవడం నవీన్ గారి రచనాశిల్పంలో నాకు కొట్టవచ్చినట్లు కనిపించిన అంశం. పరిశోధకులీ విషయాన్ని లోతుగా ఆలోచించి వివరిస్తే రచయితలకు మేలవుతుంది.

ప్రాణస్నేహితురాండ్రైన సుస్మిత, అనూహ్యల ప్రాణాలు అనూహ్యంగా ఒకేసారి గాలిలో కలిసిపోయే విషాదగాథ "సృష్టిలో తీయనిది". అనూహ్య అపురూపంగా తన స్నేహితురాలికి కొనిచ్చిన ఖరీదైన సెల్‌ఫోన్ ఈ విషాదానికి కారణం. నవీన్ గారి కథనం మనస్సును కలచివేస్తుంది.

కోటీశ్వరుడి కూతురు అపర్ణ. ఇంగ్లండులో వాస్క్యులర్ సర్జన్ అనురాగ్. పెళ్ళి చాలా అట్టహాసంగా జరిగింది. 'హనీమూన్'కని ఊటీకి వెళతారు కొత్త దంపతులు. రాత్రి తొలి కలయికకు ముందు అనురాగ్‌ని కొన్ని ప్రశ్నలడుగుతుంది అపర్ణ. అతడిచ్చిన సమాధానాలతో అతడు తనకు తగిన వరుడు కాడని నిర్ణయించుకొంటుంది. అతణ్ణి దూరం పెడుతుంది. ఇద్దరూ ఘర్షణ పడతారు. పొద్దున్న అనురాగ్ లేచేప్పటికి అపర్ణ లేదు. పొద్దుటే ఇంట్లో దిగబడ్డ కూతుర్ని చూచిన తల్లిదండ్రులకు మతిపోయింది. తనకతడు సరిపడడని, విడాకులు తీసుకుంటానని ప్రకటించేసింది అపర్ణ. ఎవరెంత చెప్పినా వినలేదు. అనురాగ్ స్వార్థపరత్వాన్ని, విషయలోలతను, ఆడవారిపట్ల చిన్నచూపును, విలాసాల పట్ల అతనికి గల దృక్కోణాన్ని అపర్ణ సరిగానే అంచనా వేసింది. అందరాడపిల్లలకూ ఆ వివేచన, వివేకము, తెగువ వుండాలని ఆశిద్దాం.

ఒక్కమాటలో చెప్పాలంటే "యానాంలో ఒకరోజు" కథాసంపుటి - ఒక మంచి పుస్తకాన్ని చదివాం అన్న అనుభూతిని పాఠకుడిలో మిగులుస్తుందనడం సత్యదూరం కాదు.

# తెలంగాణ గజల్





మడిపల్లి రాజ్‌కుమార్

అప్పుడపుడు అటుకున సందూక సర్దడం మజా!
వీలుదొరికినప్పుడు మా ఊరు పోవడం మజా!

ప్రతినిమిషం పక్కన చరవాణి బల్లె మౌతుంటే..,
ఉత్తరాల కట్టన బాల్యాన్ని వెతకడం మజా!

మండుటెండ నిప్పుగ లోకాని కగ్గి పెడుతుంటే..,
ఊర్లె సుద్దవాగున మునకేసి రావడం మజా!

మాటమాటకు అతుకుతు ఈడ్చేటి బంధాల నొదిలి..,
మాంజా తెగి.. పతంగిగా తొవ్వ తప్పడం మజా!

వన్నెలవల గంపగ కండ్లనే కమ్మి వేస్తుంటే..,
రెక్క విప్పి.. బూగలా తోటంత తిరగడం మజా!

'రాకుమార' ఎన్నాళ్ళని సర్దుకు పొయ్యే బతుకు..,
ఒక్కసారి.. వల నెత్తుకు నింగి కెగరడం మజా!

# నాకు చీరంటే...!



నాంపల్లి సుజాత

నక్షత్రాలను పొదుముకొని
మెరిసిపోయే ఆకాశమే..నాకు చీరంటే
సప్తవర్ణాల సోయగాలతో నను
చుట్టుకున్న ఇంద్రధనుస్సే..చీరంటే
అలనాటి.. సంచారి సేకరించిన నారపోగుల
జలతారు సెలయేరే.. చీరంటే
భూమాత ఒడిలోంచి పచ్చ పచ్చగా
విచ్చుకున్న వరి నారే నాకు చీరంటే..
రైతన్న చెమట చుక్కలు
నేతన్న ఒడుపుగా వడికిన అల్లిబిల్లి పొగులే
నాకు చీరంటే.. నను బుట్టబొమ్మలా దిద్దిన
మొట్టమొదటి పట్టంచు పసుపు చీరె..
నా పుట్టింటికి నను చుట్టం చేసిన మహాతల్లి

చీరలను పోగేసుకునేందుకు యెన్ని సందర్భాలో!!
పెట్టిపోతలూ పుట్టినరోజులూ
పుట్టింటి కానుకలూ
కంటికి నచ్చినవీ కానుకలిచ్చినవీ
ఇప్పుడు అలమారీ నిండా
కదిపితే రాలిపడేన్ని గుట్టలు గుట్టలుగా
సమయానికేదీ నచ్చదు
కాలానికి తగినట్లు లేవనో..పూలూ లతలూ
వన్నె తగ్గాయనీ ఎన్ని వంకలో..!
ఒక్కోచీర..ఓ అమూల్య జ్ఞాపకాల నిధి
దేన్నీ త్యజించ మనసొప్పదు..!

అవునూ ఏమాటకామాటే..!
ఆమె ఆధునిక మహిళ
నూరు చేతులతో తీగె మీద కదా
తన పరుగులు
అందంగాదిద్దుకున్న నిండైన కుచ్చిళ్లే
ఆమె వేగానికి అవరోధం మిప్పుడు
అన్నట్టు ఆనాటి పాంచాలి అపర ధీశాలే..
నిండు సభలో చీర లాగినోడి చెయ్యి విరవకుండా..
చేతులెత్తి వేడుకుంది  కాపాడమంటూ..!
అదీ చీరతో వచ్చిన అణకువే నేమో..!
నిజమే ఇప్పుడిది ఓ కొండవీటి చాంతాడే..
నేటి సాధికారపు సర్కస్ పిల్లకి
మూడు మూరల నిలువూ
ముప్పైమూరల పొడవూ..
దేహానికి చుట్టుకుంటే ఒక్కజంగన్నా బలంగా
వెయ్యలేని స్వీయబందీలు..
ఆర్మీ నుంచి..అంతరిక్షం దాకా..
ఆమె సేవలు విస్తృతం
సాంప్రదాయం కన్నా సౌకర్యమయితేనే మేలు
అయినా దీని సరిజంట పంచాదోతీ
ఎప్పుడో కనుమరుగై కంఫర్ట్ జోన్ కెళ్లింది
ఈ చీరే..
ఇంకా తడబడుతూ పెనుగులాడుతోంది
ఇంకెవరి ఆదేశాల కోసమో చూస్తూ..!

# సాహితీ సోపతి - పదేండ్ల పండుగ

సాహితీ సోపతి సంస్థను నెలకొలిపి పదేండ్లు నిండిన సందర్భంగా ఏప్రిల్5,2021 సోమవారం కరీంనగర్ ఫిలిమ్ భవన్‌లో ఒక రోజు కథ,కవిత్వ సదస్సు తెలంగాణ సాహిత్య అకాడమి సౌజన్యంతో జరిగింది. పొద్దటి పూట అన్నవరం దేవేందర్ అధ్యక్షతన జరిగిన "కవిత్వం ముచ్చటలో కె. ఆనందాచారి, డా. కాంచనపల్లి గోవర్ధనరాజు, డాక్టర్ నలిమెల భాస్కర్, డాక్టర్ గంద్ర లక్ష్మణరావు, గాజోజు నాగభూషణం, మల్లావజల నారాయణ శర్మ, గులాబీల మల్లారెడ్డి తదితరులు మాట్లాడారు. కూకట్ల తిరుపతి సంపాదకత్వం వహించిన "సోపతి"బులెటిన్-2ను, కె. ఆనందాచారి, దామరకుంట శంకరయ్య రచన "సీతాకోక రెక్కలు" హైకూలను డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన రాజు ఆవిష్కరించారు.

కందుకూరి అంజయ్య అధ్యక్షతన జరిగిన కథ ముచ్చటలో జూపాక సుభద్ర, డాక్టర్ బి.వి. ఎన్. స్వామి, బెజ్జారపు రవీందర్, బూర్ల వేంకటేశ్వర్లు, మాడిశెట్టి గోపాల్, బుర్ర తిరుపతి తదితరులు ప్రసంగించారు. డిగ్రీ విద్యార్థుల కవిత్వం "విద్యార్థి కలం" ను జూపాక సుభద్ర ఆవిష్కరించారు. అక్కెపల్లి ఫౌండేషన్ కరీంనగర్, సినారె



దామరకుంట శంకరయ్య "సీతాకోక రెక్కలు" ఆవిష్కరిస్తున్న డా॥ కాంచనపల్లి

విశిష్ట సాహిత్య పురస్కార ప్రశంస పత్రాలు, తలా పదకొండు వందల పదహారు నగదుతో నడిమెట్ల రామయ్య, కందుకూరి అంజయ్య, కూకట్ల తిరుపతి, తోట నిర్మలారాణి, పెనుకొండ సరసిజ, దామరకుంట శంకరయ్యలకు ప్రదానం చేశారు. సాహితీ సోపతి-పదేండ్ల పండుగకు కూకట్ల తిరుపతి, సి. వి. కుమార్ సమన్వయకర్తలుగా వ్యవహరించారు. అనంతరం ఈ పండుగలో పాల్గొన్న సాహిత్యకారులకు జ్ఞాపికలను అందించారు.

**- కూకట్ల తిరుపతి**

# అమృతోత్సవ కవి సమ్మేళనం...



ఏప్రిల్ 3, 2021 భారత స్వాతంత్ర్యానికి డెబ్బై అయిదేళ్ళు నిండిన సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ కవితోత్సవాన్ని నిర్వహించింది. ఆ సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుండి హాజరైన కవులు కవితా గానం చేశారు. భారతదేశం రానున్న కాలంలో పొందవలసిన గౌరవాన్ని ప్రోది చేసుకోవాల్సిన జాతీయను కవులు తమ కవితల్లో వినిపించారు. పాల్గొన్న కవులందరికీ తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి మామిడి హరికృష్ణ మెమెంటోలతో సంత్కరించారు. ఈ సందర్భంగా ప్రసంగించిన వక్తలు కవుల కవిత్వాలలో భారతదేశంలోని భిన్నత్వంలో ఏకత్వం ప్రతిఫలించదని కొనియాడారు.

# "కవన కిరణాలు-" కవితా సంకలనం ఆవిష్కరణ సభ



మార్చి 24న రవీంద్రభారతిలో "కవన కిరణాలు-" కవితా సంకలనం ఆవిష్కరణ సభలో సాహిత్య ప్రకాశ్, తులాల సవరమ్మ, బైస దేవదాసు, శివ మంచాల, ఆవిష్కర్త, డా॥ నందిని సిధారెడ్డి, దేవానంద్ నాగేల్ల, మౌనశ్రీ మల్లిక్, గూడూరు ప్రభంజన్, వెల్మజాల నరిసింహ తదితరులు...

# తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాల రాష్ట్రస్థాయి విద్యార్థి కవి సమ్మేళనం

మార్చ్ 22న ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా కరీంనగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో అంతర్జాల రాష్ట్రస్థాయి విద్యార్థి కవి సమ్మేళనం నిర్వహించారు. తెలంగాణ లోని 26 ప్రభుత్వ డిగ్రీ కళాశాల ల విద్యార్థులు పాల్గొన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎం. వెంకట్ రాసిన శ్మశాన పలుకరింపు కవిత ప్రథమ బహుమతి గెల్చుకోగా, ప్రభుత్వ డిగ్రీ కళాశాల అగ్రహారం కు చెందిన కే. సాయి సురేష్ ద్వితీయ బహుమతి పొందినాడు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన తెలుగు విభాగ అధిపతి డా.ఎం. సంపత్ కుమార్ రెడ్డిని, తెలుగు అధ్యాపక బృందమును కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. టి. శ్రీలక్ష్మి అభినందించారు.

**- కపిల భారతి**




## మల్ దాదా చారిత్రక నవల

గులాబీల మల్లారెడ్డి

**జి.యం.ఆర్. పటేల్**
కరీంనగర్
సెల్ : 9440441351
వెల : రూ. 200/-




## భార్గవానందలహరి

సిరిప్రెగడ భార్గవరావు

**సాహితీ మేఖల,** చండూరు,
**శ్రీ షిర్డి సాయిబాబా ట్రస్టు**
సెల్ : 9949849583
వెల : రూ.150/-




## అక్షర ప్రేమికుడు

సంపాదకులు : శ్రీదాస్యం లక్ష్మయ్య

**డా॥ వైరాగ్యం ప్రభాకర్**
కరీంనగర్
సెల్ : 9014559059
వెల : రూ. 250/-




## బ్లాక్ బోర్డ్ కవితా సంపుటి

ఎర్రోజు వేంకటేశ్వర్లు

**ప్రణవి ప్రచురణలు**
కరీంనగర్
సెల్ : 9492557037
వెల : రూ. 100/-




## కాలం తెచ్చిన మార్పు

బి.ఎస్. రాములు

**విశాల సాహిత్య అకాడమి**
హైదరాబాద్
సెల్ : 8331966987
వెల : రూ. 120/-




## అచ్చు - కవిత్వం

డా॥ సిద్దెంకి యాదగిరి

**మంజీరా రచయితల సంఘం**
మెదక్ జిల్లా
సెల్ : 8121144773
వెల : రూ. 100/-




## ఇష్టపది

కోటం చంద్రశేఖర్

వికారాబాద్
సెల్ : 94920 43348
వెల.రూ. 40/-




## అంబర్‌పేట ఆకాశానికి పూచిన మందారం

కోడం పవన్‌కుమార్
సెల్ : 9848992825

**లయ పబ్లికేషన్స్**
వెల.రూ. 150/-




## శ్రమదేవోభవ

దోరవేటి

**సాహితీ మేఖల** చండూరు,
సెల్ : 94404 37992
వెల.రూ. 80/-




## జాతీయ విద్యావిధానం 2020ని ఎందుకు వ్యతిరేకించాలి

ఎనిశెట్టి శంకర్

**స్నేహ ప్రచురణలు,**
నిజామాబాద్
సెల్ : 9866630739
వెల.రూ. 50/-

